సమగ్ర సమాచార పత్రిక
# ముద్ర
www.mudranews.in
హైదరాబాద్
శుక్రవారం, 13.02.2026
www.mudranews.in | @mudranews
సంపుటి:13 సంచిక: 113
పేజీలు: 12 వెల: రూ. 5

## టీనేజర్లతో ఎప్‌స్టీన్ 'కామ కథలు'

ఈ కామరూప పిశాచి వెనుక చీకటి సామ్రాజ్యం ఇదీ **03**



- హైప్రొఫైల్ పరిచయాల వెనుకదాగిన లైంగికదురాగతాల సామ్రాజ్యం
- విలాసవంతమైన భవనాలు.. రహస్య కెమెరాలు..వలలో చిక్కుకున్న వందలాది బాలికలు
- రాజకీయ నేతలు, టెక్ దిగ్గజాల పేర్లు వెలుగులోకి తెచ్చిన ఎప్‌స్టీన్ ఫైల్స్
- 2008లో తేలిక శిక్ష.. 2019లో అనుమానాస్పద మృతి..

టీ20 వరల్డ్ కప్

## ఇషాన్ కిషన్ తుఫాన్ ఇన్నింగ్స్

నమీబియాపై భారత్ దూకుడు, నేపాల్ కు షాకిచ్చిన ఇటలీ
ఒమన్ పై 105 పరుగులతో గెలిచిన శ్రీలంక **11**



# గెలుపు ఎవరిది?

పట్టణ పాలకుడు ఎవరు..?

**నేడు పుర ఎన్నికల ఫలితాలు**

| ఉదయం నుంచే లెక్కింపు మొదలు | కౌంటింగ్‌కు 136 కేంద్రాలు సిద్ధం.. భద్రత కట్టుదిట్టం |
|---|---|

ఇప్పటికే సగం మంది క్యాంపులో..
అన్ని పార్టీలు విప్ జారీ చేసేందుకు రెడీ

- 80 శాతం సీట్లపై హస్తం ధీమా.. ఫలితాలపై ఉత్కంఠ తారస్థాయికి
- ఎగ్జిట్ పోల్స్ కాంగ్రెస్ వైపు.. విపక్షాల్లో ఆందోళన
- మెదక్‌లో గట్టి పోటీ.. మిగతా జిల్లాల్లో హస్తం ఆధిక్యమా?
- పుర ఫలితాలు తెలంగాణ రాజకీయ ముఖచిత్రాన్ని మలుస్తాయా?

**ముద్ర, తెలంగాణ బ్యూరో:** రాష్ట్రంలో హోరాహోరీగా సాగిన మున్సిపల్ ఎన్నికల ఫలితాలకు సమయం ఆసన్నమైంది. ఈ మున్సిపల్ ఎన్నికలు రాష్ట్రంలోని ప్రధాన పార్టీలైన కాంగ్రెస్, బీఆర్ఎస్, బీజేపీలకు ప్రతిష్టాత్మకంగా మారాయి. గత డిసెంబర్‌లో జరిగిన గ్రామ పంచాయతీ ఎన్నికల ఫలితాల జోరును కొనసాగించాలని అధికార కాంగ్రెస్ భావిస్తుండగా, పట్టణ ఓటర్ల మద్దతుతో తిరిగి పుంజుకోవాలని బీఆర్ఎస్ ప్రయత్నిస్తోంది. మరోవైపు తమ బలాన్ని నిరూపించుకోవాలని బీజేపీ గట్టిగా పోటీనిచ్చింది. ఈ ఫలితాలు తెలంగాణ రాజకీయాల్లో భవిష్యత్తు ముఖచిత్రం నిర్ణయించనున్నాయి.

పోలింగ్ సరళి తరువాత పార్టీలు లెక్కల్లో మునిగిపోయారు. కార్పొరేషన్లు.. మున్సిపాల్టీల్లో పోలింగ్ జరిగిన తీరు.. పోలింగ్ శాతం.. ఎంత మేర తాము నమ్ముకున్న ఓటర్లు ఓటింగ్ లో పాల్గొన్నారు... పోల్ మేనేజ్ మెంట్ పైనా సమీక్ష చేస్తున్నారు. ఎగ్జిట్ పోల్స్ ఇచ్చిన లెక్కలను బేరీజు వేస్తున్నారు. అంతిమంగా ఫలితాల పైన ఒక అంచనాకు వచ్చారు. పోలింగ్ జరిగిన తీరుపై విపక్షాలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నాయి. కాంగ్రెస్ మాత్రం 80 శాతం సీట్ల గెలుపుతో ధీమాగా కనిపిస్తోంది.

**మిగిలింది ఫలితమే**

రాష్ట్రంలో మున్సిపల్ ఎన్నికల పోరు ముగిసింది. ఈ నెల 13న ఓట్ల లెక్కింపు జరగనుంది. దీనికి ముందే పార్టీలు పోలింగ్ సరళికి అనుగుణంగా గెలుపు ఓటముల పైన ఒక అంచనాలకు వస్తున్నాయి. ఎగ్జిట్ పోల్స్ సైతం తమ అంచనాలు వెల్లడించాయి. పోలింగ్ తీరు మిగతా 02లో




## డిల్లీలో రేవంత్ మార్క్ వినతులు

మూసీ పునరుజ్జీవన ప్రాజెక్టుకు 100 ఎకరాలు బదలాయించండి



- రక్షణ భూముల బదిలీతో మూసీ పునరుజ్జీవనానికి ఊతం కోరిన సీఎం
- కృష్ణా-వికారాబాద్ రైలు మార్గం పూర్తిగా కేంద్ర నిధులతో నిర్మించాలన్న విజ్ఞప్తి
- హైదరాబాద్ కేంద్రంగా మూడు హైస్పీడ్ రైలు కారిడార్ల ప్రతిపాదన
- మామూనూరు ఎయిర్‌పోర్ట్‌ను అంతర్జాతీయ ప్రమాణాలతో నిర్మించాలని సీఎం డిమాండ్

**03**



## మెజారిటీ స్థానాలు బీజేపీకే

కేంద్ర మంత్రి బండి సంజయ్

- కాంగ్రెస్ ప్రలోభాలకు తెరదీసింది
- దేశమంతా కరీంనగర్ వైపు చూస్తోంది
- కౌంటింగ్ వద్ద అప్రమత్తంగా ఉండండి
- చిన్న పొరపాటు చేసినా నష్టపోతాం
- కార్పొరేటర్ అభ్యర్థులు, కౌంటింగ్ ఏజెంట్లతో సమావేశం
- మున్సిపల్ గెలిస్తే కొండగట్టుకు పాదయాత్ర

**03**

హైటెక్ సిటీలో

## హైటెక్ ఆక్రమణ

రోడ్డును మింగేసి.. ఏడంతస్తులు లేపేసి!



- అనుమతుల్లేకుండా ఏడు అంతస్తులు పూర్తి.. ఎనిమిదో అంతస్తు నిర్మాణం
- 20 కోట్లకు పైగా విలువైన ఆక్రమణల అంచనా.. గజం రూ.2 లక్షల పైమాటే!
- అధికారుల కళ్ల ముందే అక్రమ కట్టడం
- గ్రీవెన్స్ సెల్ ఫిర్యాదులకూ ఫలితం శూన్యం.. ఏడాది నుంచి నోటీసుల డ్రామా
- నిబంధనలు 'బేఖాతర్'.. ఫిర్యాదులు 'బుట్టదాఖలు'
- ఇజ్జత్ నగర్‌లో 'ఇజ్జత్' తీస్తున్న ఆక్రమణదారులు!
- శేరిలింగంపల్లి జీహెచ్ఎంసీ అధికారుల వింత మౌనం
- 20 కోట్ల ఆక్రమణ వెనుక అసలు కథ!
- 'సిబ్బంది కొరత' కారణమా? లేక రాజకీయ ఒత్తిడులా? ప్రజల్లో అనుమానాలు

**ముద్ర న్యూస్ :** భాగ్యనగరానికి హైటెక్ సిటీ గుండె కాయ.. తెలంగాణాకే ఒక బ్రాండ్..సాఫ్ట్ వేర్ రంగానికి ఓ ల్యాండ్ మార్క్.. వ్యాపార, వాణిజ్య వర్గాలకు అదో బూస్టర్...అంతే కాదు అవినీతి అధికారులకూ ఓ కల్పతరువు. సాఫ్ట్ వేర్ రంగం అభివృద్ధి చెందాక మాదాపూర్ ప్రాంతానికి ఊహించని డిమాండ్ పెరిగింది. సాఫ్ట్ వేర్ కంపెనీలు, వాటిల్లో లక్షల రూపాయల వేతనాలతో వివిధ ప్రాంతాల నుండి పనిచేసే ఉద్యోగులు.. ఉద్యోగుల విలాసవంతమైన జీవితం కోసం చేసే ఖర్చులతో మిగతా 02లో

రేవంత్ ట్రాప్‌లో

## కేటీఆర్ సెల్ఫ్ గోల్!

ప్రజా సమస్యల నుంచి వ్యక్తిగత విమర్శల వైపు మళ్లిన మున్సిపల్ ప్రచారం

**ముద్ర, తెలంగాణ బ్యూరో :** రాష్ట్రంలో జరిగిన మున్సిపల్ ఎన్నికల ప్రచార పర్వంలో బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ అనుసరించిన వ్యూహం దారి తప్పినట్లుగా కనిపిస్తోంది. రేవంత్ ట్రాప్ లో పడొద్దని చెప్పి ..తానే పడ్డారు. శకునం చెప్పే బల్లి కుడితిలో పడ్డట్టు అన్న సామెత కేటీఆర్ తీరుకు అద్దం పడుతోంది. మున్సి పల్ ఎన్నికల ప్రచార ప్రారంభంలో కార్యకర్తలకు దిశా నిర్దేశం చేస్తూ.. రేవంత్ విసి రే ట్రాప్ లో పడొద్దని, కేవలం ప్రజా సమస్యలపైనే దృష్టి సారించాలని కేటీఆర్ పిలుపునిచ్చారు. కానీ, ప్రచారం చివరి దశకు వచ్చేసరికి ఆయనే స్వయంగా నియంత్రణ కోల్పోయి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిపై ఘాటు విమర్శలు, తిట్లతో విరుచుకుపడ టం చర్చనీయాంశంగా మారింది. కార్యకర్తలకు శాంతి వచనాలు చెప్పి, తానే ఆవేశంతో ఊగిపోవడం బీఆర్ఎస్ వ్యూహకర్తలనే విస్మయానికి గురిచేసింది. చివర కు కేటీఆర్ వ్యాఖ్యలు ఆయన పనితీరును మిగతా 02లో




- కార్యకర్తలకు హితబోధ చేసి తానే ఆవేశానికి లోనైన బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్
- దారి తప్పిన బీఆర్ఎస్ ఎజెండా
- ప్రభుత్వ వ్యతిరేక ఓటును దారి మళ్లించిన తిట్ల రాజకీయం
- స్థానిక అంశాలపై దాడి చేయాల్సిన సమయంలో ఎజెండా మార్పు
- తటస్థ ఓటర్లను దూరం చేసే ప్రమాదంలో బీఆర్ఎస్ వ్యూహం




కార్మికుల మహా ప్రదర్శనకు

## టీయూడబ్ల్యూజే మద్దతు

బీజేపీ కార్మిక వ్యతిరేక విధానాలపై దేశవ్యాప్త నిరసనలు

- హైదరాబాద్‌లో ఆర్టీసి కళ్యాణ మండపం నుంచి ఇందిరా పార్కు వరకు ర్యాలీ
- కార్పొరేట్ అనుకూల విధానాలు కార్మికులకు ద్రోహమని విమర్శలు
- నాలుగు లేబర్ కోడ్‌లు వెంటనే రద్దు చేయాలని డిమాండ్
- 20 ప్రధాన కార్మిక సంఘాల వేలాది మంది కార్మికుల పాల్గొనడం

**02**

రాష్ట్రంలో 44 వేలకు పైగా

## అక్రిడిటేషన్ కార్డులు

- అక్రిడిటేషన్ ప్రక్రియ మరింత పారదర్శకంగా అర్హులందరికీ న్యాయం
- సమాచార పౌరసంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి

**09**



జాహ్నవి కందుల

## కుటుంబానికి న్యాయం



- రూ. 262 కోట్ల పరిహారం ప్రకటించిన సియాటెల్ నగరం
- ప్రపంచాన్ని కుదిపేసిన బాడీ కామ్ వీడియో
- న్యాయపోరాటంలో గెలుపు

**09**

జగ్గారెడ్డి, అర్వింద్‌పై

## కేసులు నమోదు

పోలింగ్ కేంద్రాల్లో వాగ్వాదం.. ఈసీ సీరియస్



- పోలీసులపై అనుచిత వ్యాఖ్యలపై చర్యలు
- ఎన్నికల విధుల్లో జోక్యం చేశారనే ఆరోపణలు
- బీఎన్ఎస్, మున్సిపల్ చట్టాల కింద కేసుల నమోదు
- పోలీసుల ఫిర్యాదులతో దర్యాప్తు ప్రారంభం

**09**

దోషి అని తేలితే..

## కేసీఆర్ జైలుకు

డిల్లీలో మీడియాతో తెలంగాణ
సీఎం రేవంత్ రెడ్డి చిట్ చాట్

- ఫోన్ ట్యాపింగ్ విచారణ తుది అంకానికి చేరుకుంది
- కేసీఆర్‌పై మాకు కక్ష సాధింపు లేదు
- ఆయన దోషి అని తేలితే జైలుకు వెళ్తారు
- మరో పదేళ్లు నేనే సీఎంగా ఉంటా
- మా ప్రభుత్వంలో ఎవరి ఫోన్లు ట్యాప్ చేయడం లేదు
- కాళేశ్వరం, ఫార్ములా ఈ-రేసుపై కేంద్ర ప్రభుత్వం చర్యలేవీ..?

**02**



- సోనియా, రాహుల్ ను విచారించిన ఈడీ, కేటీఆర్‌ను ఎందుకు విచారిస్తలేదు
- తెలంగాణకు 'నేనే రాజు.. నేనే మంత్రి'
- రాష్ట్రంలో నాకు పోటీ ఎవరూ లేరు
- కాళేశ్వరం ప్రాజెక్టు కూలితే నా నింద మాపై మోపాలని బీఆర్ఎస్ చూస్తోంది
- బీఆర్ఎస్ నేతలు కోరినట్లుగా మా ప్రభుత్వం నడవదు
- 2029లో దేశంలో జమిలీ ఎన్నికలు రాబోతున్నాయి





## 1974 రైల్వే సమ్మె

జార్జ్ ఫెర్నాండెజ్ నాయకత్వంలో జరిగిన ఈ సమ్మె, భారత దేశ చరిత్రలో అతిపెద్ద పారిశ్రామిక సమ్మెగా నిలిచింది.దాదాపు 17 లక్షల మంది రైల్వే ఉద్యోగులు జీతాల పెంపు మరియు మెరుగైన పని పరిస్థితుల కోసం 20 రోజుల పాటు దేశాన్ని స్తంభింపజేశారు.

# హైటెక్ సిటీలో 'హై'టెక్ ఆక్రమణ

(మొదటి పేజీ తరువాయి)

ఇక్కడి వ్యాపారులే కాదు.. యాజమానులు పూర్తిగా కమర్షియలే...అందుకు ఉదాహరణే హైటెక్స్ కు ఆనుకుని ఉన్న ఇజ్జత్ నగర్ లో కొందరు ఇంటి యజమానుల తీరు. వివరాల్లోకి వెళ్తే.. ఇంటి నెం.2–15 లో గత కొంత కాలంగా రేషన్ దుకాణాన్ని నిర్వహిస్తున్నారు. ఆ కాలనీకి దినదినమూ డిమాండ్ పెరగడంతో ఆ రేషన్ షాపు ఇంటి యజమానికి తన ప్లాట్ కు ఆనుకుని ఉన్న రోడ్డు ఆక్రమణకు శ్రీకారం చుట్టాడు. తనకున్న కొద్ది పాటి స్థలానికి రోడ్డు ఆక్రమించుకోవడంతో సుమారు 400 గజాలకు అతని ప్లాట్ విస్తరించింది. రోడ్డు స్థలాన్ని ఆక్రమించుకోవడంతో పాటు నిర్మాణ అనుమతులు లేకుండానే గత సంవత్సర కాలం నుండి ఒక అంతస్థుపై మరో అంతస్థు నిర్మిస్తూ ఏడవ అంతస్థు పూర్తి చేశాడు. ప్రస్తుతం ఎనిమిదవ అంతస్థు నిర్మాణం కొనసాగుతోంది. ఈ విషయమై శేరిలింగంపల్లి జీహెచ్ఎంసీ కార్యాలయంలో గ్రీవెన్స్ సెల్ లో గతేడాది కళ్లెం ఉమాకాంత్ రెడ్డి అనే సిటిజన్ ఫిర్యాదు చేశారు. అధికారులు మాత్రం.. ఇదిగో వెళుతున్నా.. అదిగో నోటీసులు ఇచ్చామంటూ సంవత్సర కాలం గడిపేసారు. ఇదే అదనుగా భావించిన అదే ముఠాలోని కొందరు సభ్యులు రేషన్ దుకాణానికి మరో వైపు ఉన్న రోడ్డుకు సైతం టెండర్ పెట్టారు. ఆ దారిలో వాహన రాకపోకలు ఎక్కువ లేకపోవడం అక్రమార్కులకు దానిని సైతం ఆక్రమించేందుకు వెనకాడటం లేదు. ఇజ్జత్ నగర్ లో జరుగుతున్న ఆక్రమణలపైనా డిప్యూటి కమిషనర్ కు ఫిర్యాదు చేసినా నేటికీ చర్యలు తీసుకోలేకపోయారు. భవన నిర్మాణ పనులు బహిరంగా జరుగుతున్నప్పటికీ ఆపలేకపోతున్నారు.



**ఆక్రమణ.. అక్రమ నిర్మాణాల విలువ 20 కోట్లకు పైనే..**

మాదాపూర్ లోని ఇజ్జత్ నగర్ లో ప్రస్తుతం గజం ధర సుమారు రూ.రెండు లక్షల పైనే. రేషన్ షాప్ యాజమానుల బృందం ఆక్రమించిన స్థలం సుమారు 500 గజాల నుండి 600 గజాల వరకు ఉంటుందని స్థానికులు అంచనా వేస్తున్నారు. అంటే స్థల వ్యయం, అక్రమ నిర్మాణాల వ్యయం కలిపితే సుమారు 20 కోట్ల రూపాయల పైమాటే. హైదరాబాద్ భాగ్యనగరంలో అక్రమ నిర్మాణాలు పరిపాటే అయినప్పటికీ ఇలా రోడ్లను ఆక్రమించుకుని, అక్రమ నిర్మాణాలు చేయడం స్థానికుల విచ్చలవిడితనానికి పరకాష్ట అని చెప్పుకోవాలి.

**నోటీసులు ఇచ్చాము**

ఆక్రమణ, అక్రమ నిర్మాణాల విషయమై శేరిలింగంపల్లి అసిస్టెంట్ కమిషనర్ కరుణాకర్ ను 'ముద్ర' సంప్రదించగా స్పందించలేదు. మరో ప్రయత్నంగా డిప్యూటి కమిషనర్ ఎన్.బాలక్రిష్ణను 'ముద్ర' సంప్రదించగా "ఈ విషయం మా దృష్టికి వచ్చింది. ఇప్పటికే నోటీసులు ఇచ్చాం. జీహెచ్ ఎంసీ పునర్విభజన వలన సిబ్బంది కొరత ఉంది. సిబ్బంది అలాట్ అయ్యాక ప్రత్యక్ష కార్యాచరణ చేపడతాం అన్నారు.

# గెలుపు ఎవరిది?




(మొదటి పేజీ తరువాయి)

పైన సీఎం రేవంత్ ఢిల్లీ పర్యటనలో పార్టీ అధ్యక్షుడు ఖర్గేకు నివేదిక ఇచ్చారు. 80 శాతం పైగా స్థానాలను పార్టీ గెలువబోతోందని చెప్పినట్లు సమాచారం. అదే విధంగా ఎగ్జిట్ పోల్స్ సైతం కాంగ్రెస్ కే అధికంగా సీట్లు వస్తాయని వెల్లడించాయి.

అధికార పార్టీ అక్రమాలకు పాల్పడిందని బీఆర్ఎస్, బీజేపీ నేత లు ఆరోపిస్తున్నారు. ఇదే సమయంలో రెండేళ్ల అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను చూసి పట్టణ ఓటర్లు తమకే పట్టం కడతారని అధికార పార్టీ నేతలు అంచనా వేస్తున్నారు. 116 మున్సిపాలిటీ లు, 7 మున్సిపల్ కార్పొరేషన్లలో జరిగిన ఎన్నికల్లో 80 శాతానికి పైగా స్థానాలు దక్కుతాయని కాంగ్రెస్ విశ్వాసం వ్యక్తం చేస్తోంది. ఎగ్జిట్ పోల్స్ అంచనాలకు దగ్గరగానే ఫలితాలు ఉంటాయని ఆ పార్టీ నేతలు విశ్వాసం వ్యక్తం చేస్తున్నారు. మెదక్ జిల్లా మినహా అన్నింటా కాంగ్రెస్ ఆధిక్యం ఉమ్మడి మెదక్, వరంగల్ జిల్లాల్లో బీఆర్ఎస్,–కాంగ్రెస్ మధ్య గట్టి పోటీ నెలకొన్నట్లు భావిస్తున్నారు. పురపోరు ప్రకటన వెలువడిన సమయం నుంచి ప్రచారం వరకు కాంగ్రెస్ పక్కా వ్యూహంతో ముందుకు సాగింది. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి స్వయంగా రంగంలోకి దిగి, పలు జిల్లాల్లో ప్రచార సభల్లో పాల్గొన్నారు. సీఎం అమెరికాలో ఉన్నప్పటికీ జూమ్ మీటింగ్‌ల ద్వారా పార్టీ నేతలతో నిత్యం సమీక్షలు నిర్వహిస్తూ దిశానిర్దేశం చేశారు. ఉమ్మడి నల్గొండ, మహబూబ్‌నగర్ జిల్లాల్లో క్లీన్ స్వీప్ చేసే అవకాశాలు ఉన్నాయని తేల్చి చెబుతున్నారు. ఖమ్మం జిల్లాలోనూ ఏకపక్ష ఫలితాలు వచ్చే సూచనలు కనిపిస్తున్నాయని అంచనా వేస్తున్నారు. ఉమ్మడి మెదక్ జిల్లా మినహా అన్ని జిల్లాల్లోనూ పార్టీకి అనుకూలత ఉందని నేతలు చెబుతున్నారు. ఎన్నికలు జరుగుతున్న మొత్తం 116 మున్సిపాలిటీల్లో హస్తం పార్టీ ఏకంగా 84 గెలుచుకోనుంది. ఇక ప్రతిపక్ష బీఆర్ఎస్ 26, బీజేపీ 5, ఎంఐఎం ఒక్క మున్సిపాల్టీ గెలుచుకునే అవకాశం ఉందని తాజాగా కాంగ్రెస్ నేతల అంచనా. మెదక్‌లో బీఆర్ఎస్ అత్యధిక మున్సిపాలిటీలు గెలిచే అవకాశం ఉందని విశ్లేషణలు చేస్తున్నారు. దీంతో.. అధికారిక ఫలితాల పైన ఉత్కంఠ కొనసాగుతోంది.

**కౌంటింగ్ ఏర్పాట్లు - ఫలితాల వెల్లడి**

బ్యాలెట్ బాక్సులను కట్టుదిట్టమైన భద్రత మధ్య స్ట్రాంగ్ రూమ్‌లకు తరలిస్తున్నారు. ఎన్నికల షెడ్యూల్ ప్రకారం శుక్రవారం ఉదయం నుంచి ఓట్ల లెక్కింపు ప్రక్రియ ప్రారంభం కానుంది. ఇందుకోసం రాష్ట్ర వ్యాప్తంగా 136 కౌంటింగ్ కేంద్రాలను సిద్ధం చేశారు. కౌంటింగ్ పూర్తయిన వెంటనే ఫలితాలను ప్రకటించి, గెలిచిన అభ్యర్థుల వివరాలను అధికారికంగా వెల్లడిస్తారు. ఈ ఫలితాలు వెలువడిన తర్వాత ఫిబ్రవరి 16న కొత్తగా ఎన్నికైన వార్డు సభ్యుల ప్రమాణ స్వీకారం, ఆపై మేయర్లు, మున్సిపల్ చైర్మన్ల పరోక్ష ఎన్నికలు జరుగుతాయి.

**అంచనాలు సిద్ధం**

మున్సిపల్ ఎన్నికల్లో అన్ని పార్టీల అంచనాల్లో మునిగి తేలుతున్నాయి. ఎన్నికల నిర్వహణపై ఆరోపణలుచేయడం ద్వారా బీఆర్ఎస్, బీజేపీ తాము వెనుకబడ్డామన్న సంకేతాలు ఇచ్చాయి అయితే, పోలింగ్ ముగిసిన వెంటనే వినిపిస్తున్న రాజకీయ విశ్లేషణలు, పార్టీల మధ్య జరుగుతున్న మాటల యుద్ధం ఆసక్తికరంగా మారింది. తెలంగాణలోని 116 మున్సిపాలిటీలు, 7 కార్పొరేషన్ల పరిధిలో బుధవారం జరిగిన పోలింగ్ ముగిసింది. సుమారు 70 శాతానికి పైగా పోలింగ్ నమోదైంది. పోలింగ్ సరళిని బట్టి చూస్తే అధికార కాంగ్రెస్ పార్టీలో ధీమా కనిపిస్తుండగా, విపక్షాలైన బీఆర్ఎస్, బీజేపీలు చేస్తున్న విమర్శలు రాజకీయ వర్గాల్లో కొత్త చర్చకు దారితీస్తున్నాయి.

**బీఆర్ఎస్, బీజేపీల ఆరోపణలు**

పోలింగ్ ముగిసిన వెంటనే బీఆర్ఎస్ శ్రేణులు అధికార యంత్రాంగంపై మండిపడ్డాయి. కాంగ్రెస్ ప్రభుత్వం అధికార దుర్వినియోగానికి పాల్పడిందని, పోలీసుల సహకారంతో తమ ఏజెంట్లను ఇబ్బందులకు గురిచేశారని ఆరోపించారు. మరోవైపు, బీజేపీ నేతలు ఒక అడుగు ముందుకు వేసి, అసలు తెలంగాణలో ఎన్నికల సంఘం ఉందా లేదా అని ప్రశ్నించారు. ఓటర్ల జాబితాలో అక్రమాలు జరిగాయని, అధికార పార్టీ నేతలు పోలింగ్ కేంద్రాల వద్ద ఇష్టారాజ్యంగా వ్యవహరించారని విమర్శించారు. సాధారణంగా ఎన్నికల్లో వెనుకబడిపోతామన్న భయం లేదా క్షేత్రస్థాయిలో పరిస్థితులు అనుకూలించని సందర్భంలోనే విపక్షాలు ఇలాంటి గొంతు ఎత్తుతాయని విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు.

**కాంగ్రెస్ 80 శాతం ధీమా**

గత డిసెంబర్‌లో జరిగిన గ్రామ పంచాయతీ ఎన్నికల్లో సాధించిన విజయాన్ని మున్సిపల్ ఎన్నికల్లోనూ పునరావృతం చేస్తామని కాంగ్రెస్ గట్టి నమ్మకంతో ఉంది. రాష్ట్రవ్యాప్తంగా కనీసం 80 శాతం మున్సిపాలిటీలను క్లీన్ స్వీప్ చేస్తామని ఆ పార్టీ నేతలు చెబుతున్నారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలు, ముఖ్యంగా పట్టణ ప్రాంతాల్లో చేపట్టిన అభివృద్ధి పనులే తమను గెలిపిస్తాయని వారు భావిస్తున్నారు. 116 మున్సిపాలిటీల్లో కనీసం వంద చోట్ల గెలుస్తామని అంటున్నారు. ఏడు కార్పొరేషన్లలో ఐదు కార్పొరేషన్లలో గెలుస్తామని అంచనా వేస్తున్నారు. బీఆర్ఎస్ పార్టీ క్రితం సారి జరిగిన మున్సిపల్ ఎన్నికల్లో క్లీన్ స్వీప్ చేసింది. ఈ సారి 20లోపు మున్సిపాలిటీలతో సరిపెట్టుకునే అవకాశం ఉందన్న ప్రచారం జరుగుతోంది.

**కార్పొరేషన్లలో బీఆర్ఎస్ గడ్డు పరిస్థితి**

ఈసారి కార్పొరేషన్లలో బీఆర్ఎస్ ఉనికి ప్రశ్నార్థకంగా మారే అవకాశం ఉందని రాజకీయ పరిశీలకులు విశ్లేషిస్తున్నారు. ఏడు కార్పొరేషన్లలో కనీసం ఒక్కటి కూడా గెలుచుకోకపోవచ్చని కొందరు అంచనా వేస్తున్నారు. పట్టణ ఓటర్లు ప్రధానంగా కాంగ్రెస్ , బీజేపీల మధ్య చీలిపోయే అవకాశం ఉండటం, బీఆర్ఎస్ కేడర్ లో కొంత స్తబ్ధత నెలకొనడం ఆ పార్టీకి ప్రతికూల అంశాలుగా మారాయి. కరీంనగర్, నిజామాబాద్‌లో బీజేపీ సిట్టింగ్ ఎంపీలు ఉండటంతో అక్కడ బీజేపీ గట్టి పోటీ ఇచ్చింది. అయితే మజ్లిస్, కాంగ్రెస్ పరస్పర సహకారంతో వాటిని కూడా గెలుచుకోవచ్చని భావిస్తున్నారు.

**ఓటరు పల్స్ ఎటు?**

పట్టణ ఓటర్లు ఈసారి మౌనంగా తమ తీర్పును బ్యాలెట్ బాక్సుల్లో నిక్షిప్తం చేశారు. పెరిగిన ధరలు, స్థానిక సమస్యలు వంటివి ప్రచారంలో చర్చనీయాంశాలు కాలేదు. లోకల్ పోల్స్ కావడంతో స్థానిక సమస్యలే హైలెట్ కావాల్సి ఉంది. కాకపోయినప్పటికీ ఓటర్లు ఇదే టాపిక్ ను తీసుకుని ఉంటారని భావిస్తున్నారు. ప్రభుత్వ పనితీరు, మౌలిక సదుపాయాల కల్పన వంటి అంశాలను దృష్టిలో ఉంచుకుని ఓటర్లు తమ నిర్ణయాన్ని తీసుకున్నట్లు క్షేత్రస్థాయి విశ్లేషణలు చెబుతున్నాయి. శుక్రవారం జరిగే ఓట్ల లెక్కింపుతో ఈ ఉత్కంఠకు తెరపడనుంది.

# రేవంత్ 'ట్రాప్'లో కేటీఆర్ సెల్ఫ్ గోల్!




(మొదటి పేజీ తరువాయి)

ప్రశ్నించే స్థాయికి వెళ్లాయి.

**ఎజెండా మార్చేసిన రేవంత్**

సాధారణంగా మున్సిపల్ ఎన్నిలు అంటే లోకల్ ప్రాబ్లమ్స్ హైలెట్ అవుతాయి. కానీ మున్సిపల్ ఎన్నికల ఎజెండాను రాజకీయాల వైపు మళ్లించడంలో సీఎం రేవంత్ రెడ్డి సఫలమయ్యారు. కేసీఆర్ జాతిపిత అంశంపై ఆయన చేసిన ఘాటు విమర్శలు బీఆర్ఎస్ శ్రేణులను రెచ్చగొట్టేలా ఉన్నాయి. ఇది పక్కాగా రేవంత్ విసిరిన ట్రాప్ అని గ్రహించిన కేటీఆర్, మొదట సంయమనం పాటించాలని పార్టీ శ్రేణులకు లేఖ రాశారు. కానీ, రేవంత్ దూకుడు పెంచే సరికి కేటీఆర్ సహనం నశించింది. తిట్లకు తిట్లతోనే సమాధానం చెప్పాలన్నట్లుగా ఆయన వ్యవహరించడంతో, మున్సిపల్ ఎన్నికల ఎజెండా ప్రజా సమస్యల నుంచి వ్యక్తిగత దూషణల వైపు మళ్లిపోయింది.

**మిస్ అయిన ప్రజా వ్యతిరేక ఓటు ?**

మున్సిపల్ ఎన్నికల్లో సాధారణంగా స్థానిక సమస్యలు, పాలక పక్షంపై ఉండే వ్యతిరేకత ప్రధాన పాత్ర పోషిస్తాయి. రోడ్లు, డ్రైనేజీ, తాగునీరు వంటి అంశాలపై బీఆర్ఎస్ గట్టిగా నిలదీసి ఉంటే ప్రభుత్వ వ్యతిరేక ఓటు ఆ పార్టీకి అనుకూలంగా మారే అవకాశం ఉండేది. కానీ, కేటీఆర్ ఎప్పుడైతే వ్యక్తిగత తిట్ల పురాణం అందుకున్నారో, అప్పుడు చర్చ అంతా ఎవరు ఎవరిని ఏమన్నారు అన్న దానిపైనే సాగింది. దీనివల్ల అసలైన ప్రజా సమస్యలు పక్కకు వెళ్లిపోయి, రాజకీయం అంతా భావోద్వేగాల చుట్టూ తిరిగింది. ఇది పరోక్షంగా ప్రభుత్వానికి మేలు చేసే అంశమేనని విశ్లేషకులు భావిస్తున్నారు.

**సైడ్ ట్రాక్ లోకి బీఆర్ఎస్**

ప్రతిపక్షంగా బీఆర్ఎస్ గత పదేళ్ల అభివృద్ధిని, ప్రస్తుత ప్రభుత్వ వైఫల్యాలను ప్రజల్లోకి తీసుకెళ్లాల్సిన కీలక సమయంలో సెల్ఫ్ ట్రాప్ లో పడిపోయినట్లు అయింది. రేవంత్ విసిరిన పొలిటికల్ గాలానికి చిక్కి కేటీఆర్ తన సహజమైన శైలిని పక్కనపెట్టి దూషణలకు దిగడం వల్ల పార్టీ కేడర్‌లో కొంత ఉత్సాహం వచ్చినట్లు కనిపించినా, తటస్థ ఓటర్లలో మాత్రం ప్రతికూలత వచ్చే ప్రమాదం ఉంది. ప్రజా సమస్యలను ఎజెండాగా మార్చడంలో విఫలమవ్వడం వల్ల బీఆర్ఎస్ ఒక మంచి రాజకీయ అవకాశాన్ని చేజార్చుకుందనే అభిప్రాయం వ్యక్తమవుతోంది.

**ఈ ప్రభావమే ఎక్కువ**

పోలింగ్ ముగిసిన తర్వాత వెలువడే ఫలితాల్లో ప్రజా సమస్యల ప్రభావం కంటే ఈ తిట్ల పురాణం ప్రభావమే ఎక్కువగా ఉంటే, దానికి బీఆర్ఎస్ వ్యూహాత్మక లోపమే కారణం అవుతుంది. ప్రత్యర్థి సెట్ చేసిన ఎజెండాలో చిక్కుకుపోవడం బీఆర్ఎస్ చేసిన అతిపెద్ద పొలిటికల్ బ్లండర్ అవుతుంది.

# దోషి అని తేలితే కేసీఆర్ జైలుకు

**ముద్ర, న్యూఢిల్లీ :**

రాష్ట్ర రాజకీయాల్లో సంచలనంగా మారిన ఫోన్ ట్యాపింగ్ కేసు విచారణ తుది అంకానికి చేరిందని సీఎం రేవంత్ రెడ్డి వ్యాఖ్యానించారు. గత ప్రభుత్వ హయాంలో జరిగిన ఈ వ్యవహారంపై తమ ప్రభుత్వం సిట్ తో వి చారణ మొదలు పెట్టిందన్నారు. అన్ని కేసులతో పాటే ఈ కేసులోనూ దర్యాప్తు చేశామన్నారు. బాధితులిచ్చిన వాంగ్మూలాలు, సిట్ నిర్ధారణకు వచ్చి.. నిగ్గు తేల్చిన అంశాలను పరిగణలో తీసుకుని ముందుకెళ్తామని పేర్కొన్నారు. విపక్షాలు ఆరోపిస్తున్న ట్లు ఈ కేసులో తమ ప్రభుత్వం ఎక్క డా వెనక్కి తగ్గలేదనీ.. తగ్గదన్నారు. ఈ వ్యవహారంలో సూత్ర, పాత్రదారులను వదిలిపెట్టే ప్రసక్తే లేదని స్పష్టం చేశారు. ప్రతిపక్ష నేత కేసీఆర్‌పై తమ కు ఎలాంటి కక్ష సాధింపు లేదన్నారు. ఫోన్ ట్యాపింగ్ లో సిట్ కేసీఆర్ ను దోషిగా నిర్ధారిస్తే.. ఒకవేళ కేసీఆర్‌ను జైల్లో వేయాల్సి వస్తే నిబంధనల ప్రకారమే వెళ్తామని పేర్కొన్నారు.. ఢిల్లీ పర్యటనలో ఉన్న సీఎం.. గురు వారం సాయంత్రం రాహుల్ గాంధీ తో పాటు ఏఐసీసీ ప్రధాన కార్యదర్శి కేసీ వేణుగోపాల్‌తో భేటీ అయ్యారు. సమావేశం ముగిసిన తర్వాత బయ టకు వచ్చిన ఆయన అక్కడి మీడి యాతో చిట్‌చాట్ చేశారు. ఈ సందర్భంగా సీఎం కీలక వ్యాఖ్యలు చేశా రు. తాము అధికారంలోకి వచ్చాక ఎవరి ఫోన్లు ట్యాప్ చేయడం లేదని సీఎం రేవంత్ రెడ్డి వివరణ ఇచ్చారు. ట్యాపింగ్ చేసి సంభాషణలు వింటే ఆయుష్షు తగ్గుతుందని సెటైర్లు వేశారు. ట్యాపింగ్ కాల్స్ వినడం ఓ మాన సిక రోగమని వ్యాఖ్యానించారు. ఇటీవల ఖమ్మంలో మున్సిపల్ ఎన్నికల ప్రచారంలో పాల్గొన్న మంత్రి పొంగు లేటి శ్రీనివాస రెడ్డి.. ప్రస్తుత ప్రభుత్వంలోనూ ఫోన్లు ట్యాప్ అవుతున్నాయంటూ చేసిన ఆరోపణలపై సీఎం పరోక్షంగా వివరణ ఇచ్చారు.

తెలంగాణ రాజకీయాలు హాట్ హాట్ గా కొనసాగుతున్నాయని సీఎం చెప్పారు. ఎవరెన్ని కుట్రలు చేసినా వచ్చే కాంగ్రెస్ పార్టీకి, ప్రభుత్వానికి ఎలాంటి ఢోకా లేదన్నారు. తెలంగాణ రాష్ట్రానికి ప్రస్తుతం తానే రాజు.. తానే మంత్రి అని ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. రాష్ట్ర రాజకీయాల్లో తనకు ఎవరూ పోటీ కాదన్న ఆయన.. తనకెవరూ సాటిరారన్నారు. మరో పదిన్నరేళ్ల పాటు తెలంగాణకు తానే సీఎంగా ఉంటానని స్పష్టం చేశారు. ఇప్పటి వరకు జరిగిన ఎన్నికల్లో రాష్ట్ర ప్రజలు కాంగ్రెస్ వైపే మొగ్గు చూపారన్న ఆయన.. నేడు విడుదల కానున్న ఫలితాల్లోనూ గత ఎన్నికల ఫలితాలే పునరావృత్తమవుతాయని ధీమా వ్యక్తం చేశారు. ప్రజా సంక్షేమమే లక్ష్యంగా రాష్ట్రంలో పాలన కొనసాగుతోందన్నారు. ఎన్నికల ముందు ఇచ్చిన హామీలు, వాగ్దానాలను ఒక్కొక్కటీగా అమలు చేసుకుంటూ ముందుకువెళ్తున్నామని చెప్పారు.

**కేటీఆర్‌ను ఈడీ ఎందుకు విచారించదు..?**

కాళేశ్వరం అక్రమాలు, ఫార్ములా ఈ–రేసుపై కేంద్ర ప్రభుత్వం చర్యలు ఎక్కడా అని సీఎం నిలదీశారు. సోనియా గాంధీ, రాహుల్ గాంధీలను విచారించిన ఈడీ, కేటీఆర్‌ను ఎందుకు విచారించడం లేదో చెప్పాలని డిమాండ్ చేశారు. ఈ కేసుకు సంబంధించిన అన్ని డాక్యుమెంట్లను త్వరలోనే అసెంబ్లీలో అందరి ముందు పెడతానని స్పష్టం చేశారు. కేసీఆర్, హరీశ్ రావు కోరినట్లుగా తమ ప్రభుత్వం నడువదని సీఎం రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు. కాళేశ్వరం ప్రాజెక్ట్ మొత్తం అధ్యయనం చేయాలని, ఆ బాధ్యత ఓ నిపుణుల కమిటీకి అప్పగించామని తెలిపారు. మూడు గేట్ల మరమ్మతుల తర్వాత ప్రాజెక్టు కూలితే.. ఆ నింద తమపై వేయాలని బీఆర్ఎస్ చూస్తోందని ఆరోపించారు. కేసీఆర్ హయాం నుంచే సింగరేణికి రాష్ట్ర ప్రభుత్వం బకాయి ఉందని తెలిపారు. పదేళ్ల పాటు కేసీఆర్‌ను ఆ విషయం గురించి అడగకుండా కిషన్ రెడ్డి తనను అడుగుతున్నారని సీఎం రేవంత్ రెడ్డి అన్నారు.

**హత్యా రాజకీయాలు కాంగ్రెస్ చరిత్రలో లేవు**

హత్యా రాజకీయాలు కాంగ్రెస్ చరిత్రలో లేవని సీఎం రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు. మక్తల్ మున్సిపాలిటీ పరిధిలోని ఆరో వార్డు బీజేపీ అభ్యర్థి మృతికి కాంగ్రెస్ పార్టీకి ఎలాంటి సంబంధం లేదన్నారు. ఒక్క వార్డు గెలుపు కోసం ఎవరినో హత్య చేయ్యాల్సిన అవసరం తమకు లేదని వివరణ ఇచ్చారు. ఈ విషయంలో ఏమైనా అనుమానాలు ఉంటే సీబీఐతో విచారణ జరిపించుకోవాలని బీజేపీ నేతలను కోరారు. గురువారం అధిష్టానంతో జరిగిన సమావేశంలో కేబినెట్ విస్తరణ ప్రస్తావన రాలేదని సీఎం రేవంత్ రెడ్డి క్లారిటీ ఇచ్చారు.

**ఎన్టీఆర్‌కు 'భారతరత్న' ఇవ్వాలి**

విశ్వ విఖ్యాత నట సార్వభౌముడు.. దివంగత ముఖ్యమంత్రి ఎన్ టీ రామారావుకు భారత రత్న ఇవ్వాలని సీఎం రేవంత్ రెడ్డి కేంద్రాన్ని డిమాండ్ చేశారు. ఎన్టీఆర్ తెలుగు జాతి ఆస్తి అని.. ఆయన ఎవరి సొత్తు కాదని వెల్లడించారు. పార్లమెంటులో ఎన్టీఆర్ విగ్రహం పెట్టింది కాంగ్రెస్ పార్టీనే అని గుర్తు చేశారు. వచ్చే నెల 31 లోపు హైద్రాబాద్ మెట్రోను ప్రభుత్వం టేకోవర్ చేసే ప్రక్రియ పూర్తి చేస్తానమని సీఎం ప్రకటించారు. జూన్ 2న ఆదిలాబాద్, వరంగల్ విమానాశ్రయాలకు శంకుస్థాపన చేస్తామని తెలిపారు. వచ్చే అసెంబ్లీ సమావేశాల్లో సింగరేణిపై ఒకరోజు చర్చ జరిపి అన్ని విషయాలు మాట్లాడతానని వివరణ ఇచ్చారు. వాస్తవాలు చెప్పిన తర్వాత కిషన్ రెడ్డి తాను మాట్లాడినది తప్పని గ్రహించి క్షమాపణ చెప్పాలని పేర్కొన్నారు. ఉమ్మడి రాష్ట్రంలో మంజూరైన ప్రాజెక్టులకు ఆంధ్రప్రదేశ్ ఎందుకు అభ్యంతరం చెబుతోందో అర్థం కావడం లేదని సీఎం ఆవేదన వ్యక్తం చేశారు. కృష్ణ, గోదావరి బేసిన్‌లో తెలంగాణకు రావాల్సిన నీటి వాటా ఇచ్చి ఆ రాష్ట్రం ప్రాజెక్టులు కట్టుకుంటే తప్పు లేదన్నారు. తెలంగాణ తన ప్రాజెక్టులు పూర్తి చేస్తే వరద జలాల లెక్కలు తేలుతాయన్నారు. నికర జలాల లెక్కల ప్రకారం తెలంగాణ ప్రాజెక్టులకు ఆంధ్రప్రదేశ్ అభ్యంతరం చెప్పకూడదని అన్నారు. గోదావరి, కృష్ణా నది బేసిన్‌లలో ప్రాజెక్టులు నిర్మించే విషయంలో ఒకే విధానం ఉండాలని సీఎం రేవంత్ రెడ్డి అన్నారు.



# ప్రభుత్వ ఉద్యోగులకు కొత్త ఆరోగ్య పథకం

**ముద్ర, తెలంగాణ బ్యూరో :**

మరో 15 రోజుల్లో రాష్ట్రంలో వివిధ శాఖల్లో విధులు నిర్వర్తిస్తోన్న ఉద్యోగుల కోసం కొత్త ఆరోగ్య పథకం ప్రారంభించాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఉద్యోగుల మూల వేతనంలో 1.5 శాతం ఆ పథకానికి చెల్లించేలా నిర్ణయం తీసుకున్నది.ఉద్యోగుల హెల్త్ కార్డుల సమస్యపై గురువారం రాష్ట్ర సచివాలయంలో సీఎస్ కె.రామకృష్ణారావు అధ్యక్షతన ఈహెచ్ఎస్ ట్రస్టు సమావేశం జరిగింది. సంబంధిత శాఖ అధికారులు, ఉద్యోగుల సంఘాలు హాజరైన ఈ సమావేశంలో అధికారులు కీలక నిర్ణయాలు తీసుకున్నారు. ఉద్యోగులు చెల్లించిన అంతే మొత్తం ప్రభుత్వం కూడా చెల్లించేలా నిర్ణయం తీసుకున్నారు. ఇందుకు సంబంధించిన విధివిధానాలు సిద్ధం చేయాలని సీఎస్ ఉన్నతాధికారులను ఆదేశించారు.

# కార్మికుల మహా ప్రదర్శనకు TUWJ మద్దతు

దేశంలో బీజేపీ ప్రభుత్వం అమలు చేస్తున్న కార్మిక వ్యతిరేక విధానాలను నిరసిస్తూ గురువారం జరిగిన దేశ వ్యాప్త ఆందోళనలో భాగంగా హైదరాబాద్ లో కార్మిక సంఘాలు నిర్వహించిన మహా ప్రదర్శనకు తెలంగాణ రాష్ట్ర వర్కింగ్ జర్నలిస్టుల సంఘం (TUWJ) సంపూర్ణ మద్దతు ప్రకటించింది. ఆర్టీసి కల్యాణ మండపం నుండి ఇందిరా పార్కు వరకు కొనసాగిన ప్రదర్శనలో యూనియన్ రాష్ట్ర అధ్యక్షులు కె.విరాహత్ అలీ కార్మిక సంఘాలతో కలిసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, కేంద్ర ప్రభుత్వం కార్పొరేట్ సంస్థలకు అనుకూల విధానాలను అనుసరిస్తూ, కార్మిక, కర్షక వర్గాలకు తీరని ద్రోహం తలపెట్టడం విచారకరమన్నారు. మోడీ సర్కారు తెచ్చిన నాలుగు లేబర్ కోడ్ లను వెంటనే రద్దు చేయాలని ఆయన డిమాండ్ చేసారు. కేంద్ర ప్రభుత్వం రద్దు చేసిన 29 చట్టాల్లో రెండు వర్కింగ్ జర్నలిస్టుల చట్టాలు రద్దయ్యాయని, ఇది జర్నలిస్టులకు తీరని ద్రోహం చేయడమేనని విరాహత్ ఆందోళన వ్యక్తం చేసారు. ఇవ్వాళ జరిగిన మహా ప్రదర్శనలో 20 ప్రధాన కార్మిక సంఘాల కార్మికులు పాల్గొన్నారు.



సమగ్ర సమాచార పత్రిక
# ముద్ర
13.02.2026 శుక్రవారం, హైదరాబాద్
www.mudranews.in | @mudranews



**2020 రైతు బంద్**
**(Dec 8, 2020)**

కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన మూడు వివాదాస్పద వ్యవసాయ చట్టాలకు వ్యతిరేకంగా రైతులు ఈ బంద్‌కు పిలుపునిచ్చారు. దీనికి దేశవ్యాప్తంగా పదికి పైగా రాజకీయ పార్టీలు, అనేక కార్మిక సంఘాలు మద్దతు తెలిపి రవాణా మరియు వాణిజ్యాన్ని అడ్డుకున్నాయి.



# ఢిల్లీలో రేవంత్ మార్క్ వినతులు

- **మూసీ పునరుజ్జీవన ప్రాజెక్టుకు 100 ఎకరాలు బదలాయించండి**
- **రక్షణ భూముల బదిలీతో మూసీ పునరుజ్జీవనానికి ఊతం కోరిన సీఎం**
- **గాంధీ సరోవర్ శంకుస్థాపనకు రాజ్‌నాథ్ సింగ్‌ను ఆహ్వానించిన రేవంత్ రెడ్డి**
- **కృష్ణా–వికారాబాద్ రైలు మార్గం పూర్తిగా కేంద్ర నిధులతో నిర్మించాలన్న విజ్ఞప్తి**
- **హైదరాబాద్ కేంద్రంగా మూడు హైస్పీడ్ రైలు కారిడార్ల ప్రతిపాదన**
- **శంషాబాద్ సమీపంలో 500 ఎకరాలు కేటాయింపుకు రాష్ట్రం సిద్ధం**
- **మామూనూరు ఎయిర్‌పోర్ట్‌ను అంతర్జాతీయ ప్రమాణాలతో నిర్మించాలని సీఎం డిమాండ్**
- **ఆదిలాబాద్ ఎయిర్‌పోర్ట్ అనుమతులు వెంటనే మంజూరు చేయాలని విజ్ఞప్తి**

**ముద్ర, ఢిల్లీ:**

మూసీ పునరుజ్జీవం.. రైలు మార్గాల మంజూరు... విమానాశ్రయాల పనులు వేగవంతమే లక్ష్యంగా ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి ఢిల్లీ పర్యటన కొనసాగుతోంది. ఢిల్లీలో రక్షణ శాఖ మంత్రి రాజ్‌నాథ్ సింగ్, రైల్వే శాఖ మంత్రి అశ్వినీ వైష్ణవ్, పౌర విమానయాన శాఖ మంత్రి రామ్మోహన్ నాయుడులతో గురువారం ముఖ్యమంత్రి వరుసగా భేటీ అయ్యారు. ఆయా ప్రాజెక్టులకు కేంద్ర ప్రభుత్వ అనుమతులు, భూ బదలాయింపులు.. నిధుల మంజూరును కోరుతూనే రాష్ట్ర ప్రభుత్వపరంగా ఇవ్వనున్నమద్దతు, భూ కేటాయింపులను కేంద్ర మంత్రులకు సీఎం వివరించారు. ఈసా.. మూసీ నదుల సంగమ స్థలిలో ప్రపంచస్థాయి విద్యా సాంస్కృతిక, ఆధ్యాత్మిక, పర్యావరణ కేంద్రంగా నిర్మించనున్నగాంధీ సరోవర్ ప్రాజెక్టు శంకుస్థాపన కార్యక్రమానికి రక్షణ శాఖ మంత్రి రాజ్‌నాథ్ సింగ్‌ను ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి ఆహ్వానించారు. కేంద్ర మంత్రితో సౌత్ బ్లాక్‌లోని ఆయన కార్యాలయంలో ముఖ్యమంత్రి గురువారం భేటీ అయ్యారు. సుస్థిర పట్టణాభివృద్ధి లక్ష్యాలతో పర్యావరణ హితంగా, స్వచ్ఛమైన నీటితో నది ప్రవహించేలా మూసీ పునరుజ్జీవన ప్రాజెక్టును చేపడుతున్నట్లు రక్షణ శాఖ మంత్రి రాజ్‌నాథ్ సింగ్‌కు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వివరించారు. ఈ ప్రాజెక్టుకు అవసరమైన 100 ఎకరాల రక్షణ శాఖ భూములను రాష్ట్ర ప్రభుత్వానికి బదలాయించాలని కేంద్ర మంత్రికి సీఎం విజ్ఞప్తి చేశారు. ఈసా... మూసీ నదుల సంగమ స్థలిలో 1948లో జాతిపిత మహాత్మా గాంధీ చితభస్మాన్ని నిమజ్జనం చేసిన బాపూ ఘాట్ వద్ద గాంధీ సరోవర్ ప్రాజెక్టు చేపడుతున్నట్లు సీఎం తెలియజేశారు. గాంధీజీ ఆశయాలైన శాంతి, ఐక్యత, సుస్థిరాభివృద్ధి, నిరాడంబర జీవనశైలిని అద్దం పట్టేలా గాంధీ సరోవర్ ప్రాజెక్టును నిర్మించనున్నట్లు కేంద్ర మంత్రికి సీఎం తెలిపారు. గాంధీ సరోవర్ ప్రాజెక్టును ప్రపంచస్థాయి విద్యా, సాంస్కృతిక, ఆధ్యాత్మక, పర్యావరణ కేంద్రంగా నిలుపుతామని కేంద్ర మంత్రి రాజ్ నాథ్ సింగ్‌కు సీఎం రేవంత్ రెడ్డి తెలియజేశారు. గాంధీ సరోవర్ ప్రాజెక్టులో శాంతి చిహ్నం, జాతీయ మ్యూజియం, విజ్ఞాన కేంద్రం, చేనేత ప్రోత్సాహక కేంద్రం ఏర్పాటు చేస్తామని తెలిపారు. గాంధీ సరోవర్ ప్రాజెక్టు కు ఫిబ్రవరి నెలాఖరులో చేసే శంకుస్థాపన, భూమి పూజ కార్యక్రమానికి హాజరుకావాలని కేంద్ర మంత్రికి సీఎం విజ్ఞప్తి చేశారు. సమావేశంలో ఎంపీలు డాక్టర్ మల్లు రవి, సురేశ్ షెట్కార్, డాక్టర్ కడియం కావ్య, గడ్డం వంశీ కృష్ణ, ఎం.అనిల్ కుమార్ యాదవ్, ముఖ్యమంత్రి ప్రిన్సిపల్ సెక్రటరీ కే.ఎస్.శ్రీనివాసరాజు, కేంద్ర ప్రభుత్వ పథకాల సమన్వయకర్త డాక్టర్ గౌరవ్ ఉప్పల్ పాల్గొన్నారు.



**కృష్ణా-వికారాబాద్ రైలు మార్గం నిర్మించాలి..**

కృష్ణావికారాబాద్ రైలు మార్గాన్ని పూర్తిగా కేంద్ర నిధులతో చేపట్టాలని రైల్వే శాఖ మంత్రి అశ్వినీ వైష్ణవ్‌కు ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి విజ్ఞప్తి చేశారు. ఈ ప్రాజెక్టుకు సంబంధించిన భూసేకరణ వ్యయాన్ని మొత్తాన్ని తామే భరిస్తామని ఇప్పటికే తెలియజేసిన విషయాన్ని సీఎం కేంద్ర మంత్రికి గుర్తు చేశారు. రైల్వే శాఖ మంత్రి అశ్వినీ వైష్ణవ్‌తో పార్లమెంట్‌లోని ఆయన ఛాంబర్‌లో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గురువారం భేటీ అయ్యారు. ఈ మార్గంలోని టేకల్‌కోడ్ లో లైమ్ స్టోన్ నిక్షేపాలను గుర్తించామని.. సిమెంట్, జౌళి పరిశ్రమల కేంద్రంగా దానిని అభివృద్ధి చేసే ప్రయత్నాల్లో ఉన్నట్లు సీఎం కేంద్ర మంత్రికి తెలియజేశారు. తాను ప్రాతినిధ్యం వహిస్తున్న కొడంగల్ నియోజకవర్గంతో పాటు కర్ణాటక లోని పలు సిమెంట్ పరిశ్రమలకు సమీపంలో కృష్ణా ప్రాంతం ఉందని కేంద్ర మంత్రికి సీఎం తెలిపారు. కొడంగల్, టేకల్‌కోడ్, దౌల్తాబాద్‌లను పారిశ్రామిక జోన్లుగా అభివృద్ధి చేస్తున్నట్లు సీఎం వివరించారు.

హైదరాబాద్‌చెన్నై (778 కి.మీ.), హైదరాబాద్‌బెంగళూర్ (586 కి.మీ.), హైదరాబాద్‌పుణే (556 కి.మీ.) హైస్పీడ్ రైలు కారిడార్లకు శంషాబాద్ ఎయిర్ పోర్ట్ సమీపంలో 500 ఎకరాల స్థలం కేటాయిస్తామని ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి రైల్వే శాఖ మంత్రి అశ్వినీ వైష్ణవ్‌కు తెలియజేశారు. అంతర్జాతీయ విమానాశ్రయం ఉన్న శంషాబాద్ నుంచే హైస్పీడ్ రైలు మార్గాలని ప్రారంభించాలని సీఎం సూచించారు. హైదరాబాద్‌చెన్నై హైస్పీడ్ కారిడార్ అమరావతి మీదుగా వెళుతుందని, అక్కడి నుంచి బందరు పోర్టుకు రైలు మార్గం మంజూరు చేయాలని కోరారు. దీంతో డ్రైపోర్ట్ నుంచి బందరు పోర్టుకు సరకు రవాణా వేగవంతం అవుతుందని వివరించారు. హైదరాబాద్‌బెంగళూరు, హైదరాబాద్‌పుణే హైస్పీడ్ కారిడార్లు శంషాబాద్ నుంచే మొదలు పెడితే అది ట్రై జంక్షన్ అవుతుందని సీఎం రైల్వే మంత్రికి వివరించారు. ఈ మూడు కారిడార్లకు భూ సేకరణ వెంటనే చేపట్టి పనులు ప్రారంభించాలని రైల్వే శాఖ మంత్రికి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి విజ్ఞప్తి చేశారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి విజ్ఞప్తులకు కేంద్ర మంత్రి అశ్వినీ వైష్ణవ్ సానుకూలత వ్యక్తం చేశారు. పనులు ప్రారంభిస్తామని హామీ ఇచ్చారు. సమావేశంలో ఎంపీలు డాక్టర్ మల్లు రవి, సురేశ్ షెట్కార్, రామసహాయం రఘురాం రెడ్డి, డాక్టర్ కడియం కావ్య, గడ్డం వంశీకృష్ణ, ఎం.అనిల్ కుమార్ యాదవ్, ముఖ్యమంత్రి ప్రిన్సిపల్ సెక్రటరీ కే.ఎస్.శ్రీనివాస రాజు, ముఖ్యమంత్రి కార్యదర్శి మాణిక్ రాజ్, కేంద్ర పథకాల సమన్వయకర్త డాక్టర్ గౌరవ్ ఉప్పల్ పాల్గొన్నారు.

## అంతర్జాతీయ ప్రమాణాలతో మమూనురు ఎయిర్‌పోర్ట్

తెలంగాణలో రెండో పెద్ద నగరమైన వరంగల్ కు సమీపంలో నిర్మించనున్న మామూనూరు ఎయిర్‌పోర్ట్‌ను అంతర్జాతీయ ప్రమాణాలతో నిర్మించాలని పౌర విమానయాన శాఖ మంత్రి కె.రామ్మోహన్ నాయుడుకు ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి విజ్ఞప్తి చేశారు. పౌర విమానయాన శాఖ మంత్రి కె.రామ్మోహన్ నాయుడుతో పార్లమెంట్‌లోని ఆయన ఛాంబర్‌లో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గురువారం భేటీ అయ్యారు. మామూనూరు ఎయిర్‌పోర్ట్‌కు అవసరమైన భూ సేకరణ పూర్తయినందున వెంటనే పనులు ప్రారంభించాలని కేంద్ర మంత్రిని సీఎం కోరారు. మామూనూరు ఎయిర్‌పోర్ట్‌లో కార్గో సేవలతో పాటు మెయింటెనెన్స్.. ఓవర్ హాల్ రిపేర్ (ఎంఓఆర్) సదుపాయాలు ఉండేలా చూడాలని కేంద్ర మంత్రికి సీఎం విజ్ఞప్తి చేశారు. జౌళి, ఇతర పరిశ్రమలతో వరంగల్ నగరం పారిశ్రామిక కేంద్రంగా అభివృద్ధి చెందుతోందని, వరంగల్‌కు దగ్గరలో రెండేళ్లకోకసారి ఆసియా ఖండంలోనే అతిపెద్ద గిరిజన జాతర సమ్మక్క-సారలమ్మ జాతర మేడారంలో జరుగుతుందని కేంద్ర మంత్రికి సీఎం తెలియజేశారు. వరంగల్ ఎయిర్‌పోర్ట్ ఉమ్మడి వరంగల్‌తో పాటు ఉమ్మడి ఖమ్మం, ఉమ్మడి నల్గొండ, ఉమ్మడి కరీంనగర్ జిల్లాలకు కేంద్రంగా ఉంటుందని కేంద్ర మంత్రికి సీఎం వివరించారు. మామూనూరు నుంచి సాధ్యమైనంత త్వరగా విమాన రాకపోకలు సాగేలా పనులు ప్రారంభించాలని కేంద్ర మంత్రి రామ్మోహన్ నాయుడును రేవంత్ రెడ్డి కోరారు. ఆదిలాబాద్ విమానాశ్రయానికి సంబంధించి అనుమతులు వెంటనే మంజూరు చేయాలని కేంద్ర మంత్రి రామ్మోహన్ నాయుడుకు సీఎం విజ్ఞప్తి చేశారు. ఆ విమానాశ్రయ ఏర్పాటుకు అదనంగా అవసరమైన 249.82 ఎకరాలు అందజేసేందుకు సిద్ధంగా ఉన్నట్లు కేంద్ర మంత్రికి సీఎం తెలియజేశారు. వెంటనే అనుమతుల మంజూరు చేయాలని కోరారు. మామూనూరు ఎయిర్‌పోర్ట్ పనుల ప్రారంభానికి తీసుకోవాల్సిన చర్యలకు సంబంధించి ఎయిర్‌పోర్ట్ అథారిటీ ఆఫ్ ఇండియా అధికారులను అక్కడకు పంపిస్తానని కేంద్ర మంత్రి రామ్మోహన్ నాయుడు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి హామీ ఇచ్చారు. సమావేశంలో ఎంపీలు డాక్టర్ మల్లు రవి, సురేశ్ షెట్కార్, రామసహాయం రఘురాంరెడ్డి, డాక్టర్ కడియం కావ్య, గడ్డం వంశీకృష్ణ, ఎం.అనిల్ కుమార్ యాదవ్, ముఖ్యమంత్రి ప్రిన్సిపల్ సెక్రటరీ కే.ఎస్.శ్రీనివాస రాజు, ముఖ్యమంత్రి కార్యదర్శి మాణిక్ రాజ్, కేంద్ర పథకాల సమన్వయకర్త డాక్టర్ గౌరవ్ ఉప్పల్ పాల్గొన్నారు.

# పాదయాత్రగా వెళ్లి శ్రీవారి దర్శనం

- **ఏపీ సీఎం చంద్రబాబును కలిసిన సినీ నిర్మాత బండ్ల గణేష్**
- **పాదయాత్ర తీరును అడిగి తెలుసుకున్న సీఎం**

**ముద్ర, అమరావతి:**

ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడుని అసెంబ్లీలోని ఆయన ఛాంబర్‌లో బండ్ల గణేష్ గురువారం కలిశారు. వైసీపీ ప్రభుత్వం చంద్రబాబుపై 2023లో అక్రమ కేసులు బనాయించి జైలుకు పంపింది. సీఎం చంద్రబాబు జైలు నుంచి విడుదలై ముఖ్యమంత్రి అయితే తిరుమలకు పాదయాత్రగా వస్తానని బండ్ల గణేష్ మొక్కుకున్నారు. 2024లో జరిగిన ఎన్నికల్లో కూటమి విజయం సాధించి చంద్రబాబు 4వసారి సీఎం అయ్యారు. సంకల్ప యాత్ర పేరుతో షాద్‌నగర్ ఇంటి నుంచి జనవరి 19న పాదయాత్ర చేపట్టి ఈ నెల 10వ తేదీన తిరుమలకు చేరుకున్నారు. 23 రోజుల పాటు 535 కి.మీ మేర బండ్ల గణేష్ పాదయాత్ర సాగింది. రెండ్రోజుల క్రితం తిరుమల శ్రీ వేంకటేశ్వర స్వామివారిని దర్శించుకుని బండ్ల గణేష్ తన మొక్కును చెల్లించుకున్నారు. ఈ నేపథ్యంలో గురువారం అమరావతిలో సీఎం చంద్రబాబును కలిశారు. తిరుమల నుండి తీసుకువచ్చిన శ్రీవారి ప్రసాదాన్ని ముఖ్యమంత్రికి అందజేశారు. బండ్ల గణేష్‌ను సీఎం చంద్రబాబు ఆత్మీయంగా పలకరించి ఆలింగనం చేసుకున్నారు. పాదయాత్ర సాగిన తీరును సీఎంతో బండ్ల గణేష్ పంచుకున్నారు. దారి పొడవునా పార్టీ కార్యకర్తలు అండగా నిలిచి తనతో నడిచారని, వారి ప్రోత్సాహంతో తాను మరింత ఉత్సాహంగా పాదయాత్ర చేస్తూ తిరుమలకు చేరుకున్నానని బండ్ల గణేష్ తెలిపారు.




# ప్రపంచాన్ని కుదిపేస్తున్న చీకటి వల

- **టీనేజర్లతో ‘ఎప్ స్టీన్’ కామ కథలు**
- **కామరూప పిశాచి వెనుక చీకటి సామ్రాజ్యం**

**ముద్ర, ఢిల్లీ:**

ప్రపంచ రాజకీయాలు, కార్పొరేట్ ప్రపంచం, రాజకుటుంబాలు——ఈ మూడింటినీ ఒకే చీకటి తంతుతో కట్టిపడేసిన పేరు జెఫ్రీ ఎప్‌స్టీన్. బయటకు ఫైనాన్షియర్, పెట్టుబడిదారు, ఉన్నత వర్గాల మధ్య చలామణి అయ్యే ప్రభావశాలి. కానీ లోపల టీనేజ్ బాలికలను ఉచ్చులోకి లాగి, లైంగిక దుర్వినియోగానికి గురిచేసిన నేరగాడు. 2019లో జైల్లో అనుమానాస్పద మరణం అతని కథకు ముగింపు పలికినా, అతడు నేసిన చీకటి వల ఇప్పటికీ ప్రపంచాన్ని కుదిపేస్తూనే ఉంది.

**పక్కదారి పట్టిన ప్రయాణం**

1953లో న్యూయార్క్ బ్రూక్లిన్‌లో జన్మించిన ఎప్‌స్టీన్ సాధారణ కుటుంబంలో పెరిగాడు. చదువులో సాధారణమే అయినా గణితంలో నైపుణ్యం కలిగిన అతడు డిగ్రీ పూర్తి చేయకుండానే ఉపాధ్యాయుడిగా మారాడు. ప్రముఖ డాల్టన్ స్కూల్‌లో పనిచేసిన సమయంలోనే విద్యార్థినుల పట్ల అతని ప్రవర్తనపై అనుమానాలు తలెత్తాయి. రెండు సంవత్సరాలకే అక్కడి నుంచి వెళ్లిపోయాడు.

అక్కడి పరిచయాలతో వాల్‌స్ట్రీట్‌లోకి అడుగు పెట్టి, పెట్టుబడిదారుల నమ్మకం గెలుచుకున్నాడు. తాను సీఐఏ ఏజెంట్‌నని చెప్పుకోవడం, ఆస్ట్రియా పాస్‌పోర్టు కలిగి ఉండడం వంటి విషయాలు అతని చుట్టూ మిస్టరీ వాతావరణం సృష్టించాయి. ఆర్థిక రంగంలో పరిచయాలు పెంచుకుంటూ, తన స్వంత అసెట్ మేనేజ్‌మెంట్ సంస్థను ప్రారంభించాడు.

**హైప్రొఫైల్ పరిచయాలు – రాజకీయ ప్రకంపనలు**

ఎప్‌స్టీన్ పార్టీల్లో రాజకీయ నేతలు, టెక్ దిగ్గజాలు, వ్యాపారవేత్తలు, రాజకుటుంబ సభ్యులు పాల్గొన్నట్లు రికార్డులు చెబుతున్నాయి. అతని పరిచయ జాబితాలో-బిల్ క్లింటన్, డొనాల్డ్ ట్రంప్, ప్రిన్స్ ఆండ్రూ, బిల్ గేట్స్, యలాన్ మస్క్ ఇలా అనేక ప్రముఖుల పేర్లు వినిపించాయి. అయితే పరిచయం ఉన్నందుకే నేరంలో భాగస్వామ్యం అన్నది తేలాల్సిన అంశమే అని న్యాయ నిపుణులు చెబుతున్నారు.

**మొదటి కేసు – తేలిక శిక్ష**

2005లో ఫ్లోరిడాలో ఒక మైనర్ బాలికపై లైంగిక దుర్వినియోగం కేసు నమోదైంది. 2008లో అతడు ఒప్పందం కుదుర్చుకొని కేవలం 18 నెలల జైలుశిక్షతో బయటపడ్డాడు. ఈ ప్లీ డీల్‌పై అప్పట్లోనే తీవ్ర విమర్శలు వచ్చాయి.



### అక్రమ సంపాదన – విలాసవంతమైన ఆస్తులు

ఫ్లోరిడా, న్యూయార్క్, న్యూమెక్సికోలో విలాసవంతమైన భవనాలు కొనుగోలు చేశాడు. అతని మాన్‌హట్టన్ టౌన్‌హౌస్ అమెరికాలో అతిపెద్ద ప్రైవేట్ గృహాల్లో ఒకటిగా పేరుగాంచింది. అక్కడి గదుల్లో రహస్య కెమెరాలు అమర్చి కార్యకలాపాలను రికార్డు చేసినట్లు దర్యాప్తులో బయటపడింది.
వర్జిన్ ఐలాండ్స్‌లోని లిటిల్ సెయింట్ జేమ్స్ అనే ప్రైవేట్ ద్వీపం అతని “చీకటి కేంద్రం”గా మారింది. అక్కడికి అతని ప్రైవేట్ జెట్ తరచూ వెళ్లేది. స్థానికులు ఆ విమానాన్ని “లోలితా ఎక్స్‌ప్రెస్”గా పిలిచేవారు. ఆ ఫ్లైట్ లాగ్స్‌లో ప్రపంచ ప్రముఖుల పేర్లు వెలుగుచూశాయి.

### ఫైళ్ల విడుదల – ప్రపంచానికి షాక్

ఎప్‌స్టీన్ నివాసాలు, ద్వీపం నుంచి స్వాధీనం చేసుకున్న వేలాది ఫైళ్లు, ఫొటోలు, వీడియోలను అమెరికా న్యాయశాఖ దశలవారీగా విడుదల చేసింది. వాటిలోని పేర్లు, రికార్డులు ప్రపంచ రాజకీయాలను కుదిపేశాయి. “పరిచయం” ఎంతవరకు? “పాలుపంచుకోవడం” ఎంతవరకు? అన్నది దర్యాప్తు సంస్థలు ఇంకా పరిశీలిస్తున్నాయి. జెఫ్రీ ఎప్‌స్టీన్ కథ ఒక వ్యక్తి నేరగాథ మాత్రమే కాదు. అది అధికారం, డబ్బు, ప్రభావం కలిసినప్పుడు న్యాయం ఎలా వంగిపోతుందో చూపిన చీకటి అధ్యాయం. అతడు లేకపోయినా, అతని ఫైళ్లు ఇంకా ప్రపంచ రాజకీయాలపై నీడవేసి ఉన్నాయి. నిజం మొత్తం బయటపడే వరకు ఈ కేసు చరిత్రలో మచ్చగానే మిగిలిపోతుంది.

### టీనేజర్ల వల – గిస్లైన్ పాత్ర

ఎప్‌స్టీన్ నెట్‌వర్క్‌లో కీలక పాత్ర పోషించింది అతని సన్నిహితురాలు Ghislaine Maxwell. స్కాలర్‌షిప్‌లు, మోడలింగ్ అవకాశాలు, ఉన్నత వర్గాలతో పరిచయాలు అనే ఆశలతో బాలికలను దగ్గర చేసుకుని, తర్వాత ఎప్‌స్టీన్ వద్దకు తీసుకువచ్చినట్లు కోర్టు విచారణల్లో తేలింది. డిపార్ట్‌మెంట్ ఆఫ్ జస్టిస్ అంచనాల ప్రకారం కనీసం 1,000 మంది వరకు బాధితులుండవచ్చని భావిస్తున్నారు.

**2019 అరెస్ట్ – అనుమానాస్పద మృతి**

2019 జులైలో న్యూయార్క్‌లో మళ్లీ అరెస్ట్ అయ్యాడు. బెయిల్ నిరాకరించబడింది. కొద్ది రోజుల్లోనే జైల్లో మెడపై గాయాలతో మృతదేహంగా కనిపించాడు. అధికారికంగా ఆత్మహత్యగా ప్రకటించినా, అనుమానాలు ఇంకా చెదరలేదు. అతని మరణంతో అనేక ప్రశ్నలు సమాధానం లేకుండానే మిగిలిపోయాయి.

# మెజారిటీ స్థానాలు బీజేపీకే..

- **కాంగ్రెస్ ప్రలోభాలకు తెరదీసింది**
- **దేశమంతా కరీంనగర్ వైపు చూస్తోంది**
- **కౌంటింగ్ వద్ద అప్రమత్తంగా ఉండండి**
- **చిన్న పొరపాటు చేసినా నష్టపోతాం జాగ్రత్త**
- **కార్పొరేటర్ అభ్యర్థులు, కౌంటింగ్ ఏజెంట్లతో కేంద్ర మంత్రి బండి సంజయ్**

**ముద్ర, కరీంనగర్:**

కరీంనగర్ కార్పోరేషన్ ఫలితాల్లో మెజారిటీ స్థానాలు బీజేపీ కైవసం చేసుకోబోతుందని కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ ధీమా వ్యక్తం చేశారు. యావత్ దేశమంతా కరీంనగర్ ఫలితాలవైపు చూస్తోందన్నారు. బీజేపీకి అనుకూల ఫలితాలు రాబోతున్నాయని, కరీంనగర్ కార్పొరేషన్ మేయర్ పీఠాన్ని కైవసం చేసుకుని చరిత్ర సృష్టించబోతున్నామని చెప్పారు. గురువారం కరీంనగర్ లోని రాజశ్రీ గార్డెన్ లో బీజేపీ కార్పోరేటర్ అభ్యర్థులు, కౌంటింగ్ ఏజెంట్లతో బండి సంజయ్ కుమార్ సమావేశమయ్యారు. బీజేపీ జిల్లా మాజీ అధ్యక్షులు బాస సత్యనారాయణ, మాజీ మేయర్ సునీల్ రావు, మాజీ డిప్యూటీ మేయర్ గుగ్గిళ్ల రమేశ్, పార్టీ సీనియర్ నేతలు వాసాల రమేశ్, సాయిని మల్లేశం, గుజ్జ శ్రీను తదితరులు హాజరయ్యారు. ఈ సందర్భంగా బండి సంజయ్ మాట్లాడుతూ... “కరీంనగర్ లో బీజేపీకి మెజారిటీ స్థానాలు రాబోతుండటంతో అధికార కాంగ్రెస్ పార్టీలో కలవరం మొదలైంది. ప్రలోభాలకు గురిచేసి బీజేపీ కార్పొరేటర్లను గుంజాలని చూస్తోంది. అప్పుడే కాంగ్రెస్ నేతలు ఫోన్లు చేస్తూ ప్రలోభాల స్కెచ్ కు తెరదీశారు. జాగ్రత్తగా ఉండండి.”అని సూచించారు. పార్టీని మోసం చేస్తే కన్నతల్లిని మోసం చేసినట్లేనని చెప్పిన బండి సంజయ్ “అధికార పార్టీ ఆశలకు లోబడి ఎవరైనా కాంగ్రెస్ లోకి వెళితే తీవ్రమైన పరిణామాలుంటాయి. కార్యకర్తల ఆవేశాన్ని తట్టుకోవడం అసాధ్యం”అని హెచ్చరించారు. ఫలితాల సందర్భంగా కౌంటింగ్ కేంద్రం వద్ద అభ్యర్థుల తరపున ఏజెంట్లు ఏం చేయాలనే అంశంపై మాజీ మేయర్ సునీల్ రావు వివరించారు. కౌంటింగ్ ఏజెంట్ల దృష్టి అంతా బ్యాలెట్ పేపర్ మీదే ఉండాలని చెప్పారు. చర్చల పేరుతో, గొడవల పేరుతో దృష్టి మళ్లించేందుకు ప్రత్యర్థులు ప్లాన్ చేసే అవకాశముందని, వాటికి తావివ్వకుండా బ్యాలెట్ పైనే దృష్టి పెట్టాలన్నారు. ముఖ్యంగా కౌంటింగ్ కేంద్రంలో ఎవ్వరితోనూ గొడవ పడొద్దని, ఏదైనా అభ్యంతరం ఉంటే రాతపూర్వకంగా రాసి ఎన్నికల అధికారికి ఫిర్యాదు చేయాలని చెప్పారు. ఈ ఎన్నికల్లో ప్రతి ఒక్క సీటు పార్టీకి అత్యంత ముఖ్యమనే విషయాన్ని గుర్తుంచుకుని ప్రతి క్షణం జాగ్రత్తగా ఉండాలని సూచించారు. అనంతరం కార్పొరేటర్ అభ్యర్థులంతా బండి సంజయ్ కు ధన్యవాదాలు తెలిపారు “ఈ ఎన్నికల్లో మాకు టిక్కెట్లు ఇవ్వడమే కాకుండా మా గెలుపు కోసం మీరు పడ్డ కష్టాన్ని మరువలేం. ఈ ఎన్నికల్లో మీ కష్టం.. మీరందించిన సాయం... మీరందించిన సహకారం ఎనలేనిది.” అని బండి సంజయ్ కు ధన్యవాదాలు చెప్పారు. ఎన్నికల్లో గెలిస్తే కరీంనగర్ నుండి కొండగట్టుకు పాదయాత్రగా వెళ్లి హనుమాన్ ను దర్శించుకుంటే బాగుంటుందని సూచన రాగా సమావేశానికి హాజరైన కార్పొరేటర్ అభ్యర్థులంతా అందరం కలిసే పాదయాత్రగా వెళ్లి హనుమాన్ ను దర్శించుకుందామని చేతులెత్తి సమ్మతిని తెలియజేశారు.



### అజయ్ వర్మకు బండి పరామర్శ

మున్సిపల్ ఎన్నికల పోలింగ్ సందర్భంగా కరీంనగర్ జిల్లా పరిషత్ వద్ద పోలీసులు జరిపిన లాఠీఛార్జిలో తీవ్రంగా గాయపడి న బిజెపి నేత, సర్పంచ్ సొల్లు అజయ్ వర్మ ను కేంద్ర మంత్రి బండి సంజయ్ కుమార్ పరామర్శించారు. మున్సిపల్ ఎన్నికల సందర్భంగా బిఆర్ఎస్ నేతలు 58 డివిజన్ లో దొంగ ఓట్లు వేయిస్తున్నారనే సమాచారం మేరకు కరీంనగర్ జిల్లా పరిషత్ పోలింగ్ కేంద్రానికి బిజెపి నాయకులు, కార్యకర్తలు తరలి వెళ్లిన నేపథ్యంలో పోలీసులు జరిపిన విచక్షణ రహిత లాఠీ చార్జీలో బిజెపి రాష్ట్ర నాయకులు, గునుకుల కొండాపూర్ సర్పంచ్ సొల్లు అజయ్ వర్మ మోచేయి, కాలు కు తీవ్ర గాయాలయ్యాయి. తీవ్ర గాయాలపాలై కరీంనగర్లోని కార్తికేయ హాస్పిటల్ లో చికిత్స పొందుతున్న అజయ్ వర్మను కేంద్ర మంత్రి బండి సంజయ్ పరామర్శించారు. ఈ సందర్భంగా మంత్రి బండి సంజయ్ వైద్యులతో మాట్లాడి అజయ్ వర్మ కు మెరుగైన వైద్యం అందించాలని సూచించారు.

సమగ్ర సమాచార పత్రిక

# ముద్ర

శుక్రవారం 13.02.2026

www.mudranews.in
@mudranews
mudratv

4 వేదిక
Peoples Voice

మీ 'ముద్ర' వేయండి

నా తెలంగాణ కోటి రతనాల వీణ అన్నాడు 'దాశరథి'.. నైజాం పాలనలో 'బండెనక బండి కట్టి'.. పాటలతో ఉద్యమాన్ని రగిలించిన నేల ఇదీ.. తెలంగాణ రక్తంలోనే కవిత్వం ఉంది.. కవులు, కళాకారులకు ఈ నేల పుట్టినిల్లు.. అందుకే మీలోని రచయితను మేల్కొల్పండి.. కవితలు, వ్యాసాలు, సంపాదకీయాలు ఏవైనా సరే.. మేం ప్రచురిస్తాం.. మన 'ముద్ర'లో ఎడిటోరియల్ గా మీ భావాలను వ్యక్తీకరించండి..

మీ రచనలు పంపాల్సిన వాట్సాప్ నం: +91 98496 23744
అలాగే ఈ-మెయిల్ కూడా చేయొచ్చు: mudradaily@gmail.com


# భారత కవికోకిల సరోజిని నాయుడు



**- ఫిబ్రవరి 13 సరోజిని నాయుడు జయంతి**

ఈరోజు మనం అనుభవిస్తున్న స్వాతంత్ర్యం ఎందరో దేశభక్తులు,త్యాగమూర్తుల ఫలితం.ఎన్నో పోరాటాలు, మరెన్నో త్యాగాలు మన భారత స్వాతంత్ర్య పోరాట చరిత్రలో సువర్ణాక్షరాలతో లిఖించబడ్డాయి. ఆ పోరాట చరిత్రలో మహిళల పాత్ర అమోఘమైనది. అనిర్వచనీయమైనది. వారు కేవలం నాయకులు, నాయకీమణులుగానే కాకుండా ఎందరికో స్ఫూర్తిప్రదాతలుగా నిలుస్తారు. అలాంటి అరుదైన మహిళామూర్తులలో ఒకరు 'భారత కోకిల'గా ప్రసిద్ధి చెందిన సరోజిని నాయుడు గారు. ఆమె కేవలం స్వాతంత్ర్య సమరయోధురాలే కాదు తన కవిత్వ సుగంధంతో దేశ హృదయాన్ని గెల్చిన కవయిత్రి తన ప్రతిభతో, ధైర్యంతో, అచంచలమైన దేశభక్తితో దేశానికి ఎనలేని సేవలందించిన బహుముఖ ప్రజ్ఞాశాలి. ఇలాంటి మహోన్నతమూర్తి జయంతిని ఫిబ్రవరి 13న దేశమంతటా ఘనంగా జరుపుకుంటాం. భారత మహిళాలోకానికి ప్రేరణదినంగా భావిస్తాం.

**బాల్యం:** సరోజిని నాయుడు 1879 వ సంవత్సరం ఫిబ్రవరి నెల 13వ తేదీన హైదరాబాదులో జన్మించారు. తండ్రి డా. అఘోరనాథ్ ఛటోపాధ్యాయ, తల్లి శ్రీమతి వరద సుందరి, వీరిది సంప్రదాయ బెంగాలీ కుటుంబం, అఘోరనాథ్ చటోపాధ్యాయ నిజాం కాలేజి తొలి ప్రధానోపాధ్యాయుడు, అష్టభాషాకోవిదుడు. తల్లి వరద సుందరి కూడా గొప్ప రచయిత్రి, ఈమె బెంగాలీ భాషలో ఆధ్యాత్మికతను ప్రతిబింబించి కవితలు, ప్రకృతి అంశాలు, కుటుంబ విలువలు ఆమె కవితల్లోని ప్రధాన అంశాలు. ఇలాంటి మేధావుల కుటుంబంలో జన్మించడం సరోజిని నాయుడు ప్రతిభకు గొప్ప పునాది అయింది. ఇంటిలోనే సాహిత్య వాతావరణం ఉండటంతో చిన్నప్పటినుండే సరోజినిలో సృజనాత్మకత, భావుకత, తెలివితేటలు వికసించాయి. సరోజిని నాయుడు బాల్యం నుండే ప్రతి విషయంలోను ఆసక్తిని కనబరచి ఏది ఏమిటో తెలుసుకునేవరకు విశ్రమించేదికాదు.

చిన్ననాటినుండే సరోజిని నాయుడుకు ఇంగ్లీష్ భాషపట్ల చాలా మక్కువ ఉండేది. ఆమె అద్భుతమైన జ్ఞాపకశక్తి, అంతకుమించిన పట్టుదలతో అనతికాలంలోనే ఇంగ్లీష్ ప్రావీణ్యం సాధించారు. సరోజిని పాఠ్యాంశాల సారాన్ని వేగంగా గ్రహించడమే కాకుండా తన భావాలను పద్యరూపంలో వ్యక్తపరచగలిగే ప్రతిభను కలిగి ఉండేది. సెయింట్ జార్జ్ గ్రామర్ స్కూల్లో తన విద్యాభ్యాసం సమయంలో ఇంగ్లీష్ భాషలో అనర్గళంగా మాట్లాడే సరోజినిని చూసి ఉపాధ్యాయులు ఆశ్చర్య చకితులయ్యేవారు. తన పదకొండవ ఏటనే ఇంగ్లీష్ లో రచనలు ఆరంభించిన ఘనత సరోజినిదే.

## విద్యాభ్యాసం - సాహిత్యం:

ఆమె తన పన్నెండవ ఏటనే మద్రాస్ విశ్వవిద్యాలయంలో మెట్రిక్యులేషన్ పూర్తిచేసిందంటే తన కుశాగ్రబుద్ధి, అంకితభావం మనం గమనించవచ్చు. ఆకాలంలో మహిళావిద్యకు ప్రాధాన్యం తక్కువ, సమాజ పరిమితులు ఎక్కువై నప్పటికి సరోజిని వాటన్నింటిని అధిగమించి తన గమ్యం చేరుకున్న తీరు ఎంతోమంది మహిళామణులకు ఆదర్శం. సరోజిని తన పదమూడవ ఏట 'లేడీ ఆఫ్ లేక్' అనే రచనతో తన సాహితీ ప్రస్థానం ప్రారంభించారు. అది పదమూడు వందల పంక్తులతో నిండిన అతి చక్కనైన రచన. తాను చెప్పదలచుకున్న విషయాన్ని హృదయాలకు హత్తుకునేలా వుంటుంది సరోజిని రచనాశైలి. ఈమె ప్రతిభా పాటవాలు గమనించిన నిజాం నవాబు విదేశీ విద్యాభ్యాసానికి ప్రోత్సహించడంతో సరోజిని లండన్ కింగ్స్ కాలేజీలోను, కేంబ్రిడ్జి విశ్వవిద్యాలయ ఆధ్వర్యంలోని గిర్టన్ కళాశాలలో తన ఉన్నతవిద్య అభ్యసించింది. ఈమె కవితలు ఆంగ్ల భాషా విమర్శకుల మన్ననలు పొందాయి. ఇంగ్లండ్ లో విద్యాభ్యాసం సరోజినికి పాశ్చాత్యుల పాండిత్యాన్ని ఆకళింపు చేసుకునే ఒక మహదవకాశంగా నిల్చింది. అనేకమంది సలహాలు, సూచనలతో తన కవితా ప్రతిభకు మెరుగులు దిద్దుకుంది. సరోజినీ కవిత్వం మధురంగా, సంగీత ప్రవాహంలా ఉంటుంది. ద గోల్డెన్ థ్రెషోల్డ్, ద బర్డ్ ఆఫ్ టైమ్, ద బ్రోకెన్ వింగ్, ద స్కెప్టైడ్ ఫ్లూట్ ఆమె ప్రసిద్ధ రచనలు.విదేశాల్లో విద్యాభ్యాసం చేసినా,ఆమె కవితల్లో భారతీయ సంస్కృతి, ప్రకృతి సౌందర్యం, దేశభక్తి అద్భుతంగా ప్రతిఫలిస్తాయి.

## వైవాహిక జీవితం:

విదేశాలలో విద్యాభ్యాసం అనంతరం 1898వ సంవత్సరంలో సరోజిని భారతదేశానికి తిరిగివచ్చి హైదరాబాద్ వాస్తవ్యుడైన డాక్టర్ గోవిందరాజులు నాయుడును వివాహం చేసుకున్నది.ఇది అంతర్వర్ణ వివాహం.ముత్యాల గోవిందరాజులు నాయుడు, సరోజినిల వివాహాన్ని ప్రముఖ సంఘ సంస్కర్త కందుకూరి వీరేశలింగం పంతులుగారు జరిపించారు. విమర్శలెన్ని ఎదురైనా సరోజిని లెక్కచేయలేదు. సాహిత్యరంగంలో ముందుకు సాగడానికి, స్వాతంత్ర్యోద్యమంలో ప్రముఖపాత్ర పోషించడానికి గోవిందరాజులు గారు అన్ని విధాలుగా సహకరించేవారు. వివాహ జీవితం, కుటుంబ బాధ్యతలు సరోజిని దేశభక్తికి ఏమాత్రం ప్రతిబంధకాలుగా మారలేదు. వీరికి ఒక కుమారుడు, ఇద్దరు కుమార్తెలు. కుమారుడు జయసూర్య నాయుడు హోమియో వైద్యుడు మరియు స్వాతంత్ర్య సమరయోధుడు. కుమార్తెల్లో ఒకరైన పద్మజా నాయుడు బెంగాల్ గవర్నర్ గా పనిచేశారు.

**గాంధీజీతో సాన్నిహిత్యం:** సరోజినీనాయుడులో హాస్యచతురత, ధైర్యసాహసాలు జోడుగుర్రాల్లా ఉండేవి. గాంధీజీతో హాస్యోక్తులాడగల చొరవ ఆనాటి అతిరథ మహారథ కాంగ్రెస్ నాయకులలో ఒక్క సరోజినీనాయుడుకే ఉండేది. ఒక్కో సందర్భంలో ఆమె గాంధీజీని కూడా ఎదిరించేది. గాంధీజీని 'మిక్కీమవుస్' అని పిలువగల ధైర్యం శ్రీమతి సరోజిని నాయుడికి కాక మరెవరికీ లేవు. ఒకసారి లండన్ లో జనసమూహం మధ్య ఇరుక్కు పోయిన గాంధీజీని వెదుకుతూ "బాబూ! మీకెక్కడైనా మా మిక్కీ మవుస్ కనిపించాడా" అని జనాన్ని ప్రశ్నించగా గాంధీజీతో సహా అంతా పగలబడినవ్వారు.

ఒకసారి మహాత్మాగాంధీ ఉపవాస వ్రతం చాలించి తర్వాత మామూలుగా సరోజిని చేతుల మీదగా నిమ్మరసం త్రాగుతున్నారు.సరోజిని హాస్యంగా "ఉపవాసం చేసినా హుషారుగా పెళ్ళికొడుకులాగానే వున్నావుగా" అనగానే గాంధీజీ వెంటనే నవ్వుతూనే "నీవు పెళ్ళికూతురైతే నేను పెళ్ళికొడుకు కావటానికి సిద్ధం" అన్నారు.1944 అక్టోబరు 2కు గాంధీజీకీ 75 సంవత్సరాలు నిండాయి.ఆ సందర్భంగా ఆయనకు బహూకరించటానికి 75 లక్షలు ప్రోగుచేశారు. ఆ చెక్కును సరోజిని ద్వారా అందజేయటానికి నిర్ణయించి సభ ఏర్పాటు చేశారు. భారతీయ సాంప్రదాయం ప్రకారం పెద్ద ముత్తైదువుగా సరోజిని గాంధీజీ నుదుట కుంకుమ బొట్టు పెట్టి, ఆప్యాయంగా తలనిమిరి, తన కణతలపై మెటికలు విరుచుకొని చెక్కును గాంధీజీకి సమర్పించుతూ కొంటెగా "ఈ చెక్కు మీకు ఇవ్వకుండా నేనే తీసుకుపోతే ఏం చేస్తావు" అనగానే గాంధీ నవ్వుతూ "నీకు నిజంగా అంతపనీ చేయగలవు" అని చెక్కు తీసేసుకున్నారట.

## స్వాతంత్ర్యోద్యమంలో సరోజినీ:

సరోజిని జీవితంలో గాంధీజీ పరిచయం ఒక కీలక మలుపుగా చెప్పవచ్చు. గాంధీజీ ఆదర్శాలు, అహింసా సిద్ధాంతం ఆమెను గాఢంగా ప్రభావితం చేశాయి. తన కుటుంబ క్షేమం, వారి బాగోగుల గురించే ఆలోచించకుండా ఆంగ్లేయుల పాలనకు వ్యతిరేకంగా పోరాడాలని నిర్ణయించింది సరోజిని, కలంపట్టి కవిత్వాన్ని కాదు, తన వాగ్ధాటితో ప్రజల్లో చైతన్యాన్ని రగిలించగలనని నిరూపించింది.1906వ సంవత్సరంలో దేశమంతా ఎన్నో మహిళా సమావేశాలు ఏర్పర్చి మహిళల్లో చైతన్యం తీసుకురావడానికి శ్రమించారు. గోపాలకృష్ణ గోఖలే నాయకత్వంలో అఖిల భారత జాతీయ కాంగ్రెస్ ఉద్యమాలు సాగిస్తున్న రోజులవి. 1915వ సంవత్సరంలో బొంబాయిలో జరిగిన కాంగ్రెస్ సమావేశంలో 1916వ సంవత్సరంలో లక్నో కాంగ్రెస్ సభల్లో ఆమె పాల్గొనడం జరిగింది. సహాయ నిరాకరణ ఉద్యమంలో పాల్గొని ఉప్పు సత్యాగ్రహంలో గాంధీజీతో కలసి నడిచారు. సరోజిని బ్రిటీష్ పాలనకు వ్యతిరేకంగా దేశవ్యాప్తంగా ముఖ్యనగరాల్లో తిరుగుతూ అగ్నిజ్వాలల్లాంటి తన ప్రసంగాలతో ప్రజల్లో దేశభక్తి రగిల్చారు. మహిళలు స్వాతంత్ర్య పోరాటంలో పాల్గొనడానికి ప్రేరణగా నిలిచారు.1925లో కాన్పూర్ లో జరిగిన భారత జాతీయ కాంగ్రెస్ సమావేశానికి అధ్యక్షురాలిగా ఎన్నికై, ఈ ఘనత పొందిన తొలి భారతీయ మహిళగా నిలిచారు. కుల, మత బేధాలు లేకుండా, లింగబేధం లేకుండా ప్రజలందరూ ఏకతాటిపై పోరాటం చేస్తేగాని బానిసత్వ విముక్తి కలగదని పిలుపు నిచ్చారు.1928లో కెనడా, అమెరికా లాంటి దేశాలకు వెళ్ళి భారతీయులు అనుభవిస్తున్న దుర్భర పరిస్థితుల గురించి ప్రచారం చేసింది.1929లో తూర్పు ఆఫ్రికా అంతా పర్యటించింది. ఇదంతా మింగుడుపడని నాటి బ్రిటీష్ ప్రభుత్వం 1930వ సంవత్సరం మేలో సరోజినిని అరెస్ట్ చేసింది. కానీ ఈ అరెస్ట్ ఆమె దృఢ సంకల్పాన్ని ఏమాత్రం సడలించలేక పోయింది. 1931వ సంవత్సరంలో భారత ప్రతినిధిగా లండన్ రౌండ్ టేబుల్ సమావేశానికి హాజరైంది.1942 క్విట్ ఇండియా ఉద్యమంలో పాల్గొని మళ్ళీ జైలుశిక్ష అనుభవించింది.1947లో స్వాతంత్ర్యం వచ్చిన తర్వాత ఉత్తరప్రదేశ్ తొలి మహిళా గవర్నర్ గా నియమితులైనారు.

భారత మహిళా సాధికారతకు చిహ్నంగా భావించే సరోజిని గారు 1949 మార్చి 2న లక్నోలో మరణించారు. కవయిత్రిగానే కాక ఒక విప్లవజ్యోతిలా భాసిల్లిన సరోజిని నిజంగా భారత మహిళా లోకానికి మార్గనిర్దేశకురాలు. అందుకే ఫిబ్రవరి 13ను జాతీయ మహిళా దినోత్సవంగా జరుపుకుంటున్నాం. దేశంకోసం జీవించడమే జీవితానికి పరమార్థం అని భావించిన 'భారత కోకిల' సరోజిని ఆశయాల సాధనకు మనమంతా ముందుకు సాగుదాం.


- సుధాకర్.ఏ.వి

★ రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షులు
★ స్టేట్ టీచర్స్ యూనియన్ తెలంగాణ స్టేట్ (STUTS)
★ 9000674747




## పార్లమెంటులో రాహుల్ గాంధీ @2.0



గతంలో డిఫెన్స్‌లో ఉండే రాహుల్ గాంధీ, ఇప్పుడు 'అటాకింగ్ మోడ్' లోకి మారి బీజేపీని ఉక్కిరిబిక్కిరి చేస్తున్నారు. మాజీ ఆర్మీ చీఫ్ ఎం.ఎం. నరవాణే పుస్తకాన్ని సాక్ష్యంగా చూపిస్తూ 'అగ్నిపథ్' వంటి కీలక విషయాల్లో ప్రభుత్వాన్ని ఇరకాటంలో పెట్టారు. ఎప్‌స్టీన్ ఫైల్స్ వంటి అంశాలను దేశీయ రాజకీయాలకు ముడిపెడుతూ చర్చా అజెండాను మార్చేశారు. ఒకప్పుడు రాహుల్ విమర్శలను కొట్టిపారేసిన అధికార పక్షం, ఇప్పుడు ఆయన సంధిస్తున్న పదునైన ప్రశ్నలకు వివరణలు ఇచ్చుకోవాల్సిన పరిస్థితికి వచ్చింది. పత్రాలు, ఆధారాలతో సభలోకి వస్తుండటంతో కాంగ్రెస్ శ్రేణుల్లో ఉత్సాహం పెరగడమే కాకుండా, ఢిల్లీ రాజకీయాల దిశ మారుతోంది. మొత్తంమీద, ప్రశ్నలనే ఆయుధాలుగా చేసుకుని ఈ 'కొత్త రాహుల్' బీజేపీకి ఒక సీరియస్ సవాల్‌గా నిలుస్తున్నారు.

# మానసిక ఆనందాన్ని కల్గించే రేడియో

**- ఫిబ్రవరి 13 ప్రపంచ రేడియో దినం సందర్భంగా**

"టీవీ అందరికీ ఒక ఇమేజ్ ఇస్తుంది, కానీ రేడియో లక్షలాది మెదడుల్లో లక్షలాది ఇమేజ్‌లకు జన్మనిస్తుంది." పెగ్గీ నూనన్ అన్నారు. వీడియో రేడియో స్టార్‌ను చంపిందని ప్రజలు అంటున్నారు, కానీ వాల్ స్ట్రీట్ జర్నల్ కాలమిస్ట్ పెగ్గీ నూనన్ అన్నారు రేడియో దశాబ్దాలుగా కొద్దీ సంవత్సరాలుగా ఎందుకు మనుగడలో ఉందో నిరూపిస్తుంది: ఇది శ్రోతలు టీవీ చేయలేని విధంగా వారి ఊహలను ఉపయోగించుకోవడానికి అనుమతి స్తుంది. ఈ కోట్ నూనన్ జ్ఞాపకాల నుండి వచ్చింది, వాట్ ఐ సా ఎట్ ది రివల్యూషన్: ఎ పొలిటికల్ లైఫ్ ఇన్ ది రీగన్ ఎరా. ప్రపంచంలో అత్యంత సన్నిహితమైన మరియు సామాజికంగా వ్యక్తిగత మాధ్యమం రేడియో."హ్యారీ వాన్ జెల్ అన్నారు

హ్యారీతో మేము హృదయపూర్వకంగా ఏకీభవిస్తున్నాము. రేడియో సన్నిహితంగా మరియు సామాజికంగా వ్యక్తిగతంగా లేకపోతే, మనకు రేడియో స్వర్ణయుగం ఉండేది కాదు , టాక్ రేడియో యొక్క ఆధునిక పునరావృతం, పాడ్‌కాస్ట్‌లు నేడు ఇంత ప్రజాదరణ పొంది ఉండేవి కావు. ప్రజలను చేరుకోగల రేడియో సామర్థ్యం గురించి వాన్ జెల్‌కు అన్నీ తెలుసు: అతను 1925 నుండి 1975 మధ్య అమెరికన్ రేడియో అనౌన్సర్. మా ఆశీర్వాదకరమైన రేడియో. ఇది మనకు ప్రపంచంలోకి కళ్ళు మరియు చెవులను ఇస్తుంది. మేము మంచి సంగీతం కోసం మాత్రమే జర్మన్ స్టేషన్‌ను వింటాము. మరియు ఆశ కోసం మేము వింటాము."అన్నే ఫ్రాంక్ అన్నారు ప్రియమైన అన్నే ఫ్రాంక్ తన ప్రసిద్ధ డైరీలో రాసిన ఈ కోట్, రేడియో ఎలా ప్రాణాలను కాపాడుతుందో చూపిస్తుంది. రేడియో సాధారణంగా ఆనందం కోసం ఉపయోగించబడుతుంది, కానీ క్లిష్టమైన విషయాలకు కూడా ఉపయోగించవచ్చు. అన్నే చెప్పినట్లుగా, రేడియో యొక్క రెండు పద్ధతులు మానవాళి శ్రేయస్సుకు ముఖ్యమైనవి.

సంగీతంతో మిమ్మల్ని చుట్టుముట్టండి. రేడియోను ఆన్ చేయడం మర్చిపోవద్దు అని–లిసా ఎం.అన్నారు. ఆకాశవాణి వార్తలు చదువుతుంది ప్రయాగ రామకృష్ణ అంటూ రోజు శ్రావ్యంగా వార్తలు రేడియో లో వస్తాయి ఎన్నో ఎఫ్ ఎం కేంద్రాలు వున్నాయి రోజంతా అనేక కార్యక్రమాలు వస్తున్నాయి కోట్లాది మంది శ్రోతలు వున్నారు

**అరుణోదయపు ఆకాశం అంచులపై**
**అలసిన నిశ్శబ్దాన్ని తడిమే స్వరం —— రేడియో.**
**చిన్న పెట్టె గుండెలో**
**ఎన్నో ప్రపంచాల స్పందన.**
**గాలి తంతుల మీద జారే గీతం,**
**దూర గ్రామాల దుఃఖానందాలు,**
**పట్టణ వీధుల పరుగులు,**
**ఒకే తరంగంలో చేరిన మనసులు.**
**చాయ్ కప్పు పక్కన మెల్లగా వినిపించే వార్తలు,**
**పాత పాటలలో జ్ఞాపకాల పరిమళం,**
**ప్రకటనల మధ్యలో నవ్వుల చిరుజల్లులు ——**
**ఇల్లు మొత్తం మేల్కొల్పే మధుర మ్రోగు.**
**చూచే కళ్లకన్నా**
**వినే హృదయానికే దగ్గరైన స్నేహితుడు,**
**అడగక ముందే తోడు నిలిచే**
**అనాదిగా కొత్తగానే ఉండే మాయ స్వరం.**
**సిగ్నల్ కొంచెం దూరమైనా**
**సంబంధం మాత్రం తగ్గదు;**
**రేడియో ——**



మన ఊపిరి తాకే తరంగాల కథ. ప్రపంచ రేడియో దినోత్సవం ప్రతి సంవత్సరం ఫిబ్రవరి 13న నిర్వహించబడుతుందిరేడియో మాధ్యమ ప్రాధాన్యతను తెలియజేయడానికి ఈ దినోత్సవం జరుపుకుంటారు. విద్యుదయస్కాంత శక్తి గల రేడియో తరంగాలను 1886లో మొదటి సారిగా ప్రముఖ జర్మన్ భౌతిక శాస్త్రవేత్త అయిన హెన్రిచ్ హెర్ట్జ్ కనిపెట్టారు. రేడియో తరంగాలను తొలిసారిగా గుర్తించిన హెన్రిచ్ హెర్ట్జ్ పేరిట రేడియో తరంగాల ఫ్రీక్వెన్సీని హెర్ట్జ్ లతో కొలవడం కొలవడం ప్రారంభించారు. ఇటాలియన్ శాస్త్రవేత్త గుగ్లిఎల్మో మార్కోనీ 1895 – 96 సంవత్సరం నాటికి రేడియో తరంగాలను శబ్ద తరంగాలుగా మార్చి ప్రసార మాధ్యమాలుగా వాడుకలోకి తీసుకు వచ్చారు.

## మొదటి సారిగా రేడియో ప్రసారాలు

1920 నవంబరు 2 న అమెరికాలోని పిట్స్‌బర్గ్ లో మొట్టమొదటి రేడియో ప్రసారం కేంద్రాన్ని ఏర్పాటు చేశారు. అమెరికా అధ్యక్షుడిగా హార్డింగ్ ఎన్నికయ్యారు అనే వార్తను పిట్స్‌బర్గ్ కేంద్రంగా ప్రపంచంలోనే తొలిసారిగా రేడియో వార్తా ప్రసారం మొదలైంది. అనంతరం ఇంగ్లాండ్ లో 1922 అక్టోబర్ 18 న బ్రిటిష్ బ్రాడ్ కాస్టింగ్ కార్పొరేషన్ స్థాపించారు. 1922 నవంబరు 14 బీబీసీ లండన్ కేంద్రంగా తన ప్రసారాలను ప్రారంభించింది.

## భారతదేశంలో రేడియో చరిత్ర:

దేశంలోనే తొలిసారిగా, 1923 లో రేడియో క్లబ్ ఆఫ్ బాంబే రేడియో ప్రసారాలను ప్రారంభించింది. బ్రిటిష్ హయాంలో 23 జూలై 1927 న తొలి రేడియో స్టేషన్ బాంబేలో ప్రారంభమైంది. ఇండియన్ బ్రాడ్ కాస్టింగ్ కంపెనీ అప్పటి వైస్రాయ్ లార్డ్ ఇర్విన్ ప్రారంభించారు. 1936 లో ఇండియన్ బ్రాడ్ కాస్టింగ్ కంపెనీ పేరును ఆలిండియా రేడియోగా మార్చారు. ఆలిండియా రేడియో అధికారికంగా 1956 నుండి ఆకాశవాణిగా పిలువబడుతుంది.

## ఆల్ ఇండియా రేడియో:

ఆలిండియా రేడియోను ప్రభుత్వ ఆధీనంలో పనిచేస్తుంది. ఇది కేంద్ర ప్రభుత్వ సమాచార, ప్రసార యంత్రాంగ ఆధ్వర్యములో స్వయం ప్రతిపత్తి కలిగిన ప్రసార భారతికి చెందిన విభాగము. భారత దేశానికి స్వాతంత్ర్యం వచ్చేనాటికీ భారత దేశంలో కేవలం 6 ఆలిండియా రేడియో కేంద్రాలు మాత్రమే ఉండేవి. అవీ: 1) బొంబాయి 2) కలకత్తా 3)ఢిల్లీ 4) మద్రాసు5) తిరుచిరాపల్లి6) లక్నో కేంద్రాలు. 2025నాటికీ దేశవ్యాప్తంగా 679 ఆలిండియా రేడియో కేంద్రాలు పని చేస్తున్నాయి. 1946, ఫిబ్రవరి 13న ఐక్యరాజ్యసమితి రేడియో ప్రారంభించబడింది కాబట్టి, ఆ సందర్భం గా ప్రతిఏటా ఫిబ్రవరి 13న ఈ దినోత్సవం జరుపుకునేలా జనరల్ కాన్ఫరెన్స్ 36వ సమావేశంలో ప్రపంచ రేడియో దినోత్సవాన్ని ప్రకటించాలని బోర్డు యునెస్కోకు సిఫారసు చేసింది. ఐక్యరాజ్య సమితి సభ్య దేశాలు, ఐక్యరాజ్యసమితి సంస్థలు, అంతర్జాతీయ ప్రాంతీయ సంస్థలు, వృత్తి సంఘాలు, ప్రసార సంఘాలు, ప్రభుత్వ యేతర సంస్థలు మొదలైనవన్ని ప్రపంచ రేడియో దినోత్సవాన్ని జరుపుకోవాలని బోర్డు ఆహ్వానించింది. ప్రపంచ రేడియో దినోత్స వాన్ని జనరల్ అసెంబ్లీలో ఆమోదించడానికి, ప్రపంచవ్యాప్తంగా ఈ దినోత్సవం జరుపుకునే విధంగా యునెస్కో డైరెక్టర్ జనరల్ ఈ తీర్మానాన్ని ఐక్యరాజ్యసమితి సెక్రటరీ జనరల్ దృష్టికి తీసుకురావా లని బోర్డు అభ్యర్థించింది. ఈ అభ్యర్థనను యునెస్కో జనరల్ కాన్ఫరెన్స్ పరిగణించి, 36 సి/63 ఫైల్‌లో ఉన్న తీర్మానాన్ని ఆమోదించింది. ప్రపంచ రేడియో దినోత్సవాన్ని 2011 నవంబరు లో యునెస్కోలోని అన్ని సభ్య దేశాలు ఏకగ్రీవంగా ప్రకటించాయి. అప్పటి నుంచి ప్రతి ఏటా 13న ఈ రేడియో దినోత్సవం జరుపుకుంటారు.

## కార్యక్రమాలు

స్త్రీ పురుషుల సమానత్వం కోసం లింగబేధం సంబంధిత అంశాల, విధానాల రూపకల్పనకు శ్రీకారం చుట్టేందుకు రేడియో స్టేషన్ యజమానులకు, ప్రభుత్వాలకు, కార్యదర్శులకు యునెస్కో అవగాహన కల్పిస్తుంది. మహిళా రేడియో జర్నలిస్టుల రక్షణను పెంపొందించడం కోసం కృషి చేస్తుంది.ప్రతి రోజు రేడియో ను విందాం ఉల్లాసంగా ఉందాం


- కామిడి సతీష్ రెడ్డి
జయశంకర్ భూపాల్ పల్లి జిల్లా
9848445134

**2012 పెట్రోల్ ధరల వ్యతిరేక బంద్**

పెట్రోల్ ధరల పెరుగుదలను నిరసిస్తూ ఎన్డీయే, వామపక్షాలు సంయుక్తంగా ఈ బంద్‌ను నిర్వహించాయి. యూపీఏ (యూపీఏ) ప్రభుత్వం పెంచిన ధరలను తగ్గించాలని డిమాండ్ చేస్తూ దేశవ్యాప్తంగా విద్యాసంస్థలు, కార్యాలయాలు మూసివేయబడ్డాయి.



# విజయోత్సవ ర్యాలీల నిషేధం : ఎస్పీ

**ముద్ర, వికారాబాద్ జిల్లా ప్రతినిధి :**



మున్సిపల్ ఎన్నికల ఓట్ల లెక్కింపు ప్రక్రియను ప్రశాంతంగా, స్వేచ్ఛాయుతంగా నిర్వహించేందుకు అన్ని భద్రతా చర్యలు చేపట్టినట్లు ఎస్పీ స్నేహ మిశ్రా తెలిపారు. జిల్లాలోని నాలుగు మున్సిపల్ పట్టణాల్లో మోడల్ కోడ్ ఆఫ్ కండక్ట్ అమలులో ఉన్న నేపథ్యంలో కౌంటింగ్ కేంద్రాల పరిసర ప్రాంతాల్లో విజయోత్సవ ర్యాలీలు, బైక్ ర్యాలీలు, ఊరేగింపులు, బాణాసంచా కాల్చడం, డీజే సౌండ్ సిస్టమ్‌ల వినియోగాన్ని పూర్తిగా నిషేధించినట్లు స్పష్టం చేశారు. ఫలితాలు వెలువడిన తర్వాత కూడా ప్రజలు సంయమనం పాటించాలని, ఉత్సాహంలో చట్టవిరుద్ధ చర్యలకు పాల్పడవద్దని హెచ్చరించారు. కౌంటింగ్ కేంద్రాల పరిసరాల్లో నిర్దిష్ట పరిధిలో సీఆర్‌పీసీ సెక్షన్ 144 అమల్లో ఉంటుందని ఎస్పీ తెలిపారు. అన్ని రాజకీయ పార్టీలు, అభ్యర్థులు, డీజే యజమానులు, ఈవెంట్ నిర్వాహకులు పోలీస్ శాఖకు సహకరించి, ఎన్నికల సంఘం మార్గదర్శకాలను కచ్చితంగా పాటించాలని కోరారు. ఆదేశాలను ఉల్లంఘించిన వారిపై కఠిన చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

# రాజిరెడ్డి ఆశయాలు సాకారం చేయాలి : ఎమ్మెల్యే

**ముద్ర, కాప్రా :**



ప్రజల కోసమే జీవించి, పీడిత వర్గాల పక్షాన అండగా నిలిచిన ఉప్పల్ మాజీ ఎమ్మెల్యే స్వర్గీయ బండారి రాజిరెడ్డి రాజకీయ ప్రస్థానం తరతరాలకు ఆదర్శమని ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి అన్నారు. ఆయన 79వ జయంతి సందర్భంగా ఉప్పల్, కాప్రా, చర్లపల్లి, నాచారం ప్రాంతాల్లో బీఆర్ఎస్ ఆధ్వర్యంలో బండారి రాజిరెడ్డి చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రజాసేవే ధ్యేయంగా నిరంతరం కృషి చేసిన నాయకుడు రాజిరెడ్డి అని అన్నారు. ఆయన ఆశయాలను ముందుకు తీసుకెళ్లేందుకు కట్టుబడి ఉన్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉప్పల్ డివిజన్ పార్టీ నాయకులు నవీన్ గౌడ్, ఇంద్రయ్య, శివకుమార్, మహేష్ తదితరులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.

# 14 నుంచి రామలింగేశ్వర స్వామి జాతర ఉత్సవాలు

**ముద్ర, తాండూర్ :**

తాండూర్ నియోజకవర్గంలోని బషీరాబాద్ మండలం జీవంగి గ్రామంలో కాగ్నా నది సమీపంలో వెలసిన శ్రీ రామలింగేశ్వర స్వామి జాతర ఉత్సవాలు ఈనెల 14నుంచి 17వరకు నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. జాతర ఏర్పాట్లను తాండూర్ డీఎస్పీ నర్సింగ్ యాదయ్య, రూరల్ సీఐ ప్రవీణ్ కుమార్ రెడ్డి, స్థానిక సర్పంచ్ బసప్పతో కలిసి పరిశీలించారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. ముఖ్యంగా ట్రాఫిక్ సమస్యలు లేకుండా తగిన ఏర్పాట్లు చేయాలని ఆదేశించారు. కార్యక్రమంలో బషీరాబాద్ ఎస్ఐ, పోలీసు సిబ్బంది, ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

# పెండింగ్ పనులు త్వరితగతిన పూర్తి చేయాలి

- **సైబరాబాద్ తొలి కమిషనర్‌కు పీఏసీ చైర్మన్ గాంధీ సూచనలు**

**ముద్ర, శేరిలింగంపల్లి :**



సైబరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ తొలి కమిషనర్‌గా ఐఏఎస్ అధికారి జి. సృజన బాధ్యతలు స్వీకరించిన సందర్భంగా పీఏసీ చైర్మన్ ఆరేకపూడి గాంధీ మర్యాదపూర్వకంగా కలిశారు. మాదాపూర్‌లోని సైబరాబాద్ నగరపాలక సంస్థ కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో తాజా మాజీ కార్పొరేటర్లు రాగం నాగేందర్ యాదవ్, దొడ్ల వెంకటేష్ గౌడ్, ఉప్పలపాటి శ్రీకాంత్, సీనియర్ నాయకులు రఘునాథ్ రెడ్డి, భాస్కర్, కృష్ణారెడ్డిలతో కలిసి శాలువా కప్పి సత్కరించి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈసందర్భంగా గాంధీ మాట్లాడుతూ.. జీహెచ్ఎంసీ పునర్వ్యవస్థీకరణలో భాగంగా ఏర్పాటైన సైబరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో మౌలిక వసతుల అభివృద్ధికి ప్రాధాన్యం ఇవ్వాలని కోరారు. శేరిలింగంపల్లి నియోజకవర్గంలో పెండింగ్‌లో ఉన్న అభివృద్ధి పనులను వేగవంతం చేయాలని కమిషనర్‌ను అభ్యర్థించారు. అసంపూర్తిగా ఉన్న పనులను త్వరగా పూర్తి చేయడానికి తగిన ఆదేశాలు ఇవ్వాలని, అభివృద్ధి కార్యక్రమాలకు అవసరమైన నిధులు సమయానికి విడుదలయ్యేలా చూడాలని సూచించారు. రహదారుల మరమ్మత్తులు, చెరువుల సుందరీకరణ, పార్కుల అభివృద్ధి వంటి అంశాల్లో ప్రత్యేక దృష్టి సారించాలని విజ్ఞప్తి చేశారు. ప్రజలకు మెరుగైన మౌలిక వసతులు కల్పించేందుకు సమన్వయంతో పనిచేయాలని కోరారు.

# చైర్‌పర్సన్ రేసులో ఇద్దరు హేమాహేమీలు

**ముద్ర, తాండూర్:**





వికారాబాద్ జిల్లా తాండూర్ మున్సిపల్ ఎన్నికల్లో అధికార కాంగ్రెస్ పార్టీకి ఆధిక్యం దక్కే సూచనలు కనిపిస్తున్నాయి. 36వార్డుల్లో సగానికి పైగా స్థానాలు కాంగ్రెస్ కైవసం చేసుకునే అవకాశమున్నట్లు రాజకీయ వర్గాలు అంచనా వేస్తున్నాయి. నామినేషన్ దశ నుంచే బీఆర్ఎస్, కాంగ్రెస్ పార్టీల మధ్య పోటీ హోరాహోరీగా సాగినా, మున్సిపల్ పరిధిలోని ఓటర్లు అధికార కాంగ్రెస్ వైపు మొగ్గుచూపినట్లు తెలుస్తోంది. చైర్‌పర్సన్ పదవికి కాంగ్రెస్ పార్టీలోనే ఆసక్తికర పోటీ నెలకొంది. 27వ వార్డు నుంచి గెలుపొందిన మాజీ జడ్పీటీసీ ఉప్పరి స్వరూప మల్లేశం పేరు బలంగా వినిపిస్తోంది. పార్టీకి దీర్ఘకాలంగా సేవలందించడం, ఇతర వర్గాలతో సత్సంబంధాలు కలిగి ఉండటం ఆమెకు అనుకూల అంశాలుగా భావిస్తున్నారు. అధిష్టానం ఆమె వైపు మొగ్గు చూపే అవకాశం ఉందని రాజకీయ విశ్లేషకులు పేర్కొంటున్నారు. మరోవైపు 12వ వార్డు నుంచి గెలిచిన నీరజ బాల్‌రెడ్డి కూడా రేసులో ఉన్నారు. రెండు సార్లు మున్సిపల్ కౌన్సిలర్‌గా పనిచేసిన అనుభవం ఆమెకు బలం. ఇరువురికీ పార్టీలో మంచి పలుకుబడి ఉండటంతో అధిష్టానం నిర్ణయం కీలకంగా మారింది. 16న జరిగే చైర్‌పర్సన్ ఎన్నిక వరకు తుది ఫలితంపై స్పష్టత రానుంది.

# కౌంటింగ్‌కు కట్టుదిట్టమైన ఏర్పాట్లు

**ముద్ర, వికారాబాద్ :**





వికారాబాద్‌లో మున్సిపల్ ఎన్నికల కౌంటింగ్ ప్రక్రియను పారదర్శకంగా, శాంతియుతంగా, సమర్థవంతంగా నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ ప్రతీక్ జైన్ తెలిపారు. గురువారం పట్టణంలోని ఎస్ఏపీ కళాశాలలో ఏర్పాటు చేసిన కౌంటింగ్ కేంద్రాన్ని ఆయన పరిశీలించారు. ఈసందర్భంగా అధికారులతో మాట్లాడుతూ కౌంటింగ్ కేంద్రంలో భద్రతా ఏర్పాట్లు కట్టుదిట్టంగా ఉండాలని ఆదేశించారు. కేంద్ర పరిసరాల్లో సెక్షన్ 144 అమల్లో ఉంటుందని, అనుమతి పొందిన సిబ్బంది మరియు అభ్యర్థుల ఏజెంట్లకే ప్రవేశం ఉంటుందని స్పష్టం చేశారు. మొత్తం 34వార్డులకు 12 టేబుళ్లు ఏర్పాటు చేసి, ప్రతి టేబుల్‌కు ఒక సూపరింటెండెంట్, ఇద్దరు అసిస్టెంట్లు, ముగ్గురు సిబ్బందిని నియమించినట్లు తెలిపారు. కౌంటింగ్ హాలులో సీసీటీవీ కెమెరాలు ఏర్పాటు చేయాలని, మొబైల్ ఫోన్లకు అనుమతి లేదన్నారు. కౌంటింగ్ ఉదయం 8 గంటలకు ప్రారంభమై దశలవారీగా కొనసాగుతుందని చెప్పారు. తాగునీరు, వైద్య సదుపాయాలు, విద్యుత్ బ్యాకప్ వంటి మౌలిక వసతులు కల్పించాలని సూచించారు. ఎన్నికల నియమావళిని కచ్చితంగా పాటించాలని అభ్యర్థులు, వారి ప్రతినిధులకు సూచించారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలీసు బలగాలు సిద్ధంగా ఉన్నాయని తెలిపారు. కౌంటింగ్ ఫలితాలను అధికారిక వెబ్‌సైట్ మరియు మీడియా ద్వారా వెల్లడించనున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ విక్రం సింహారెడ్డి, తహసీల్దార్ లక్ష్మీనారాయణ తదితరులు పాల్గొన్నారు.

**వనపర్తిలో పకడ్బందీ ఏర్పాట్లు**

వనపర్తి : జిల్లాలోని ఐదు మున్సిపాలిటీలకు శుక్రవారం ఉదయం 8 గంటల నుంచి ప్రారంభం కానున్న ఓట్ల లెక్కింపు ప్రక్రియకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ ఆదర్శ్ సురభి తెలిపారు. గురువారం వనపర్తి, అమర్చింత, ఆత్మకూరు, కొత్తకోట, పెబ్బేరు మున్సిపాలిటీలలో ఏర్పాటు చేసిన లెక్కింపు కేంద్రాలను ఆయన సందర్శించి ఏర్పాట్లను పరిశీలించారు. వనపర్తి మున్సిపాలిటీ ఓట్ల లెక్కింపు నర్సింగాయపల్లిలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో, పెబ్బేరు మున్సిపాలిటీ లెక్కింపు జాతీయ రహదారి పక్కనున్న ప్రభుత్వ బాలికల పాలిటెక్నిక్ కళాశాలలో నిర్వహించనున్నారు. కొత్తకోటలో ప్రభుత్వ జూనియర్ కళాశాలలో, ఆత్మకూరులో ప్రభుత్వ జూనియర్ కళాశాలలో, అమర్చింతలో జిల్లా పరిషత్ హైస్కూల్‌లో లెక్కింపు కేంద్రాలు ఏర్పాటు చేశారు. లెక్కింపు ప్రక్రియను పకడ్బందీగా నిర్వహించేందుకు మూడు అంచెల పోలీసు భద్రత ఏర్పాటు చేసినట్లు కలెక్టర్ తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆర్డీవో సుబ్రమణ్యం, డీఎస్పీ వెంకటేశ్వరరావు, మున్సిపల్ కమిషనర్ వెంకటేశ్వర్లు, తహసీల్దార్ రమేష్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# సోషల్ మీడియాను సద్వినియోగం చేసుకోండి: ఎమ్మెల్యే

- **ట్రస్మా ఆధ్వర్యంలో పదవ తరగతి విద్యార్థులకు కేరీర్ గైడెన్స్**

**ముద్ర, కుత్బుల్లాపూర్ :**



సోషల్ మీడియాను పెడదోరణులకు కాకుండా స్ఫూర్తిదాయక వ్యక్తుల జీవితాలు తెలుసుకునేందుకు వినియోగించుకోవాలని టీఆర్ఎస్ ఎల్పీ విప్, కుత్బుల్లాపూర్ ఎమ్మెల్యే కేపీ వివేకానంద సూచించారు. తెలంగాణ గుర్తింపు పొందిన ప్రైవేటు పాఠశాలల యాజమాన్యాల సంఘం (ట్రస్మా) గ్రేటర్ కుత్బుల్లాపూర్ కమిటీ ఆధ్వర్యంలో ధనిక్ భారత్ విద్యాసంస్థల సహకారంతో పదోతరగతి విద్యార్థులకు వృత్తి మార్గదర్శక మరియు ప్రేరణాత్మక తరగతులు గాజులరామారంలోని పద్మావతి గార్డెన్స్‌లో నిర్వహించారు. కార్యక్రమానికి రక్షణ మంత్రిత్వ శాఖ మాజీ డైరెక్టర్ బాలలత మల్లవరపు ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. మాజీ ఐఏఎస్ అధికారి బాలలత జీవితం యువతకు ఆదర్శమని అన్నారు. కృషి, పట్టుదలతో రెండు సార్లు సివిల్ సర్వీసెస్ సాధించడం గొప్ప విషయమన్నారు. సోషల్ మీడియాలో అనవసర విషయాలకు సమయం కేటాయించకుండా, గొప్ప వ్యక్తుల సలహాలు, సూచనలు తెలుసుకోవాలని విద్యార్థులకు సూచించారు. అనంతరం బాలలత మల్లవరపు మాట్లాడుతూ.. యువత ఉద్యోగాల కోసం ఎదురుచూడకుండా, ఉద్యోగాలను సృష్టించే పారిశ్రామికవేత్తలుగా ఎదగాలని కోరారు. చిన్ననాటి నుంచే పోలియోను ఎదుర్కొన్నప్పటికీ లక్ష్య సాధనలో వెనుకడుగు వేయలేదన్నారు. దేశ అభివృద్ధి యువత చేతుల్లోనే ఉందని, పదవ తరగతిని భవిష్యత్తుకు బలమైన పునాదిగా తీసుకుని ఉత్తమ ఫలితాలు సాధించాలని సూచించారు. కార్యక్రమంలో కుత్బుల్లాపూర్ మండల విద్యాధికారిణి జమిని కుమారి, మాజీ కార్పోరేటర్ సురేష్ రెడ్డి, ట్రస్మా రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షుడు కె.రామేశ్వర్‌రెడ్డి, జిల్లా ప్రధానకార్యదర్శి బిర్రు ఆంజనేయులు, జిల్లా నాయకులు గడ్డమీది బాలరాజు, శ్రీనివాస్‌రెడ్డి, వీరన్న, శ్యాం, ట్రస్మా గ్రేటర్ కుత్బుల్లాపూర్ చైర్మెన్ కోలా వెంకటేశ్ ముదిరాజ్, అధ్యక్షుడు వినోద్ జాదవ్, ప్రధాన కార్యదర్శి జనార్ధన్ దయాకర్, కోశాధికారి శ్రీశైలం, సీనియర్ కరస్పాండెంట్స్ బలరాం యాదవ్, నర్సింహులుగౌడ్, ప్రవీణ్‌రెడ్డి, మధుకుమార్, భూపాల్‌రెడ్డి, ధనిక్ భారత్ విద్యాసంస్థల ప్రతినిధులు అజయ్ విక్రం, గిరిబాబు, రవీందర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# శివరాత్రి సందర్భంగా కీసర గుట్టలో ట్రాఫిక్ ఆంక్షలు

**ముద్ర, మల్కాజిగిరి :**

కీసరగుట్ట శ్రీ రామలింగేశ్వర స్వామి ఆలయంలో ఈనెల 15న జరిగే మహా శివరాత్రి సందర్భంగా ట్రాఫిక్ ఆంక్షలు విధించినట్లు మల్కాజిగిరి జోన్ ట్రాఫిక్ డిసిపి తెలిపారు. ఫిబ్రవరి 13 నుంచి 18 వరకు బ్రహ్మోత్సవాలు నిర్వహించనున్న నేపథ్యంలో ఆరు రోజుల పాటు భారీ వాహనాల రాకపోకలను మళ్లించనున్నట్లు వెల్లడించారు. ఔటర్ రింగ్ రోడ్ లేదా చేర్యాల్ క్రాస్ రోడ్ నుంచి కీసర గ్రామం వైపు వచ్చే భారీ వాహనాలను అనుమతించరు. వాటిని ఘట్కేసర్ లేదా షామీర్‌పేట్ వైపు ఔటర్ రింగ్ రోడ్, సర్వీస్ రోడ్డు మార్గాల ద్వారా మళ్లిస్తారు. ఉద్దేమర్రి, బొమ్మలరామారం ప్రాంతాల నుంచి వచ్చే వాహనాలను రంగాపురం చౌరస్తా వద్ద మళ్లించి ప్రత్యామ్నాయ మార్గాల్లో పంపిస్తారు. షామీర్‌పేట్ నుంచి వచ్చే వాహనాలను యాద్గిరిపల్లి వద్ద మళ్లించి ఘట్కేసర్ వైపు దారి మళ్లిస్తారు. బోగారం నుంచి వచ్చే వాహనాలను వన్నెగూడ క్రాస్ రోడ్ వద్ద మళ్లించి ఔటర్ రింగ్ రోడ్ వైపు పంపిస్తారు. భారీగా భక్తులు తరలివచ్చే అవకాశమున్నందున ఈ చర్యలు తీసుకున్నట్లు అధికారులు తెలిపారు. ప్రజలు సూచించిన మార్గాలను అనుసరించి ట్రాఫిక్ పోలీసులకు సహకరించాలని కోరారు.



# రాష్ట్ర స్థాయి కుస్తీ పోటీల విజేతకు సన్మానం

**ముద్ర, శేరిలింగంపల్లి :**

రాష్ట్ర స్థాయి కుస్తీ పోటీల్లో ప్రథమ స్థానం సాధించిన అర్కపల్లి అరవింద్‌ను టిసాట్ ప్రధాన కార్యనిర్వాహణ అధికారి బోదనపల్లి వేణుగోపాల్ రెడ్డి అభినందించారు. జూబ్లీహిల్స్‌లోని టిసాట్ కార్యాలయంలో ఆయనను శాలువా కప్పి సన్మానించి తక్షణ ఆర్థిక సహాయం అందజేశారు. భవిష్యత్ పోటీలకు ప్రభుత్వ పరంగా పూర్తి సహకారం అందిస్తామని హామీ ఇచ్చారు. వ్యవసాయ కుటుంబానికి చెందిన అర్కపల్లి సైదులు కుమారుడు అరవింద్ (15) ఈనెల 8న ఉస్మానియా విశ్వవిద్యాలయ ప్రాంగణంలో నిర్వహించిన 19వ తెలంగాణ రాష్ట్ర పాఠశాల క్రీడల సమాఖ్య ఆధ్వర్యంలోని కుస్తీ పోటీల్లో విజేతగా నిలిచాడు. పదో తరగతి చదువుతున్న ఆయన ఇప్పటికే జిల్లా, మండల స్థాయిలో పలు పోటీల్లో ప్రతిభ కనబరిచి రాష్ట్ర స్థాయికి ఎంపికయ్యాడు. తమ గ్రామానికి చెందిన విద్యార్థిని ప్రోత్సహించినందుకు గ్రామస్తులు ఆనందం వ్యక్తం చేశారు.

# ఎవరి లెక్కల్లో వారు...!

- **మహబూబ్‌నగర్‌లో రాజకీయ ఉత్కంఠత**
- **నేడు పాలమూరు యూనివర్సిటిలో ఓట్ల లెక్కింపు**

**ముద్ర, ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లా ప్రతినిధి :**

మున్సిపల్ ఎన్నికల పోలింగ్ ముగియడంతో జిల్లాలో రాజకీయ ఉత్కంఠ నెలకొంది. నేడు జరగనున్న ఓట్ల లెక్కింపుతో ఫలితాలు తేలనున్నప్పటికీ, ప్రధాన పార్టీలు ఇప్పటికే గెలుపు లెక్కలు వేసుకుంటున్నాయి. ముఖ్యంగా మహబూబ్‌నగర్ మున్సిపల్ కార్పొరేషన్ ఫలితాలపై అన్ని పార్టీల దృష్టి కేంద్రీకృతమైంది. మొత్తం 60 డివిజన్లలో ఒక డివిజన్ కాంగ్రెస్ అభ్యర్థి ఏకగ్రీవంగా ఎన్నిక కాగా, మిగిలిన 59 డివిజన్లకు లెక్కింపు జరగనుంది. మెజారిటీకి అవసరమైన మేజిక్ సంఖ్య 31 కాగా, 50కు పైగా డివిజన్లలో విజయం సాధిస్తామని కాంగ్రెస్ ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి ధీమా వ్యక్తం చేశారు. మరోవైపు 30కు పైగా స్థానాల్లో గెలుస్తామని బీఆర్ఎస్ నాయకులు పేర్కొంటుండగా, అత్యధిక డివిజన్లలో విజయం సాధిస్తామని బీజేపీ నేతలు ప్రకటిస్తున్నారు. దీంతో ఫలితాలపై ఉత్కంఠ మరింత పెరిగింది. ఉమ్మడి జిల్లాలోని 19 మున్సిపల్ కౌన్సిల్ ఎన్నికల్లోనూ ఇదే తరహా పరిస్థితి నెలకొంది. కొల్లాపూర్, మక్తల్, దేవరకద్ర, గద్వాల, వనపర్తి, నాగర్‌కర్నూల్, నారాయణపేట తదితర పట్టణాల్లో గెలుపు తమదేనని ప్రధాన పార్టీలు ధీమా వ్యక్తం చేస్తున్నాయి. కొడంగల్ నియోజకవర్గ పరిధిలోని కొడంగల్, కోస్గి, మద్దూర్ మున్సిపాలిటీల ఫలితాలపై ప్రత్యేక ఆసక్తి కనిపిస్తోంది. మహబూబ్‌నగర్ మున్సిపల్ కార్పొరేషన్ ఓట్ల లెక్కింపు బండమీదిపల్లె సమీపంలోని పాలమూరు విశ్వవిద్యాలయంలో నిర్వహించనున్నారు. లెక్కింపు కేంద్రం వద్ద పోలీసులు కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్లు చేసి, సెక్షన్ 144 అమలు చేస్తున్నారు. కలెక్టర్ విజయేంద్ర బోయి, ఎస్పీ జానకి తదితర అధికారులు ఏర్పాట్లను పర్యవేక్షించారు.






# సబ్ రిజిస్టర్ కార్యాలయం ఏర్పాటు చేయాలి : ఎమ్మెల్యే

**ముద్ర, మల్కాజిగిరి :**

అల్వాల్ మండలంలో సబ్ రిజిస్టర్ కార్యాలయం ఏర్పాటు చేయాలని మల్కాజిగిరి ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డి ప్రభుత్వాన్ని కోరారు. ఈ మేరకు మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, రెవెన్యూ శాఖ రిజిస్ట్రేషన్‌స్టాంపుల ప్రత్యేక కార్యదర్శి రాజీవ్ గాంధీ హనుమంతుకు గురువారం సచివాలయంలో వినతిపత్రం సమర్పించారు. ప్రస్తుతం సబ్ రిజిస్టర్ కార్యాలయం వల్లభనగర్‌లో ఉండటంతో అల్వాల్ మండల ప్రజలు సుమారు 20కిలోమీటర్లు ప్రయాణిస్తూ ట్రాఫిక్ రద్దీని ఎదుర్కొంటున్నారని ఎమ్మెల్యే తెలిపారు. ముఖ్యంగా వృద్ధులు, మహిళలు రిజిస్ట్రేషన్ పనుల కోసం ఇబ్బందులు పడుతున్నారని పేర్కొన్నారు. అల్వాల్‌లోనే కార్యాలయం ఏర్పాటు చేస్తే ప్రజలకు సమయం, ఖర్చు ఆదా కావడంతో పాటు పరిపాలనా సౌలభ్యం కలుగుతుందని సూచించారు. వినతిపై మంత్రి, ప్రత్యేక కార్యదర్శి సానుకూలంగా స్పందించి పరిశీలిస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు అరుణ్ తేజ రావు, సతీష్ రావు తదితరులు పాల్గొన్నారు.

సమగ్ర సమాచార పత్రిక
ముద్ర
శుక్రవారం 13-02-2026
www.mudranews.in | @mudranews


**2016 కార్మిక సంఘాల సమ్మె**
**సెప్టెంబరు 2, 2016**

కేంద్ర ప్రభుత్వ ఆర్థిక విధానాలకు మరియు ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా సుమారు 18 కోట్ల మంది కార్మికులు ఈ సమ్మెలో పాల్గొన్నారు. కనీస వేతనం పెంపు మరియు సామాజిక భద్రత కల్పించాలని డిమాండ్ చేస్తూ బ్యాంకింగ్, రవాణా రంగాలను స్తంభింపజేశారు.

## సాధారణ ప్రసవాలకు ప్రాధాన్యం ఇవ్వాలి

- మాతా శిశు కేంద్రంలో మరిన్ని పడకలు
- జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి



**ముద్ర, కరీంనగర్:** సాధారణ ప్రసవాలకు అత్యంత ప్రాధాన్యం ఇవ్వాలని, తప్పనిసరి అయితేనే సిజేరియన్ చేయాలని జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి వైద్యులకు సూచించారు. కరీంనగర్ మాత శిశు సంరక్షణ కేంద్రాన్ని గురువారం కలెక్టర్ తనిఖీ చేశారు. గర్భిణీలు, పిల్లల వార్డును సందర్శించి వారికి అందుతున్న సేవలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం సమావేశ మందిరంలో గైనకాలజిస్టులు, అనస్తీసియా, పిల్లల వైద్యులు, రేడియాలజిస్టులు తదితరులతో సమావేశం ఏర్పాటు చేశారు.

ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలోని వివిధ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో ఎక్కువ సంఖ్యలో సాధారణ ప్రసవాలు జరగడం విశేషమని అన్నారు. ఆదిలాబాద్ తర్వాత జిల్లాలోని పిహెచ్సిల్లో ప్రసవాల సంఖ్య ఎక్కువగా ఉందని తెలిపారు. మాత శిశు సంరక్షణ కేంద్రంలో డెలివరీల సంఖ్య ఎక్కువగా ఉందని తెలిపారు. అయితే సాధ్యమైన మేర సాధారణ ప్రసవాలకే ప్రాధాన్యం ఇవ్వాలని సూచించారు. గర్భిణికి ముందు నుంచే సాధారణ ప్రసవం ఆవశ్యకతను ఏఎన్ఎం, ఆశా వర్కర్ల ద్వారా కౌన్సెలింగ్ నిర్వహించాలని తెలిపారు. శుక్రవారం సభలకు ప్రభుత్వ ఆసుపత్రి సిబ్బంది హాజరై సాధారణ ప్రసవం ప్రాధాన్యతను ప్రజలకు తెలియజేయాలని సూచించారు. ప్రతి గర్భిణీకి టిఫా స్కాన్ తప్పనిసరి అని తెలిపారు. మాతా శిశు ఆరోగ్య కేంద్రంలో మరొక టిఫా మిషన్ తెప్పించేందుకు ఏర్పాట్లు చేయాలని తెలిపారు. ప్రభుత్వ జనరల్ ఆసుపత్రి, మాతా శిశు కేంద్రంలో అవసరమైన వైద్య పరికరాల జాబితా సమర్పించాలని, వాటిని ఏర్పాటు చేసేందుకు చర్యలు తీసుకుంటామని అన్నారు. మాతా శిశు ఆరోగ్య కేంద్రంలో మరిన్ని పడకలు ఏర్పాటు చేసేందుకు చర్యలు తీసుకోవాలని సూపరింటెండెంట్ ను ఆదేశించారు.

ఈ సమావేశంలో ప్రభుత్వ జనరల్ ఆసుపత్రి సూపరింటెండెంట్ వీరారెడ్డి, జిల్లా వైద్యాధికారి వెంకటరమణ, ఆర్ఎంవో నవీనా, ప్రోగ్రాం అధికారి సనా, వివిధ విభాగాలకు చెందిన వైద్యాధికారులు పాల్గొన్నారు.

## నాణ్యమైన విద్య, మౌలిక సదుపాయాల కల్పన..

- ఎస్సీ, ఎస్టీల సంక్షేమానికి బడ్జెట్ లో పెద్దపీట.. - విదేశీ విద్యా అవకాశాల పెంపునకు చర్యలు..
- ఉన్నత ప్రమాణాలతో స్టడీ సర్కిళ్లు.. - 2026–27 బడ్జెట్ పై అధికారులతో మంత్రి అడ్లూరి సమీక్ష..





**ముద్ర, ధర్మపురి:** షెడ్యూల్డ్ కులాల, గిరిజన వసతి గృహాలలో హాస్టల్ విద్యార్థులకు నాణ్యమైన విద్య, వైద్యం, మౌలిక సదుపాయాల కల్పనలో రాజీ పడే ప్రసక్తి లేదని షెడ్యూల్డ్ కులాల అభివృద్ధి, గిరిజన సంక్షేమం, దివ్యాంగులు వయోవృద్ధులు మరియు ట్రాన్స్ జెండర్ ల సాధికారత శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ స్పష్టం చేశారు. గురువారం డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ సెక్రటేరియట్ లో షెడ్యూల్డ్ కులాల అభివృద్ధి శాఖ మరియు గిరిజన సంక్షేమ తదితర శాఖల ఉన్నతాధికారులతో బడ్జెట్ ప్రతిపాదనలపై ముందస్తు బడ్జెట్ చర్చలపై వివరణాత్మక అంశాలపై మంత్రి అడ్లూరి సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు.

ఈ సందర్భంగా మారుమూల గ్రామీణ ప్రాంతాలు, గిరిజన ఏజెన్సీ ప్రాంతాలలో ఉన్న వసతి గృహాలలో వసతులు, మరమ్మతులు, రవాణా సౌకర్యం తదితర సదుపాయాలకు సంబంధించిన ప్రతిపాదనలను రూపొందించాలని అధికారులను మంత్రి ఆదేశించారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి విద్యకు ప్రాధాన్యం ఇస్తున్నారని నిధులకు ఏలాంటి కొరత లేదని మంత్రి స్పష్టం చేశారు. బడ్జెట్లో అవసరమైన నిధులు కేటాయించడానికి ప్రభుత్వం సిద్ధంగా ఉందని మంత్రి అన్నారు.

ఎస్సీ, ఎస్టీ వర్గాలకు చెందిన విద్యార్థులను అత్యున్నత స్థాయికి తీసుకురావాలన్నదే ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి దృఢ సంకల్పమని, సీఎం ఆశయాలకు అనుగుణంగా అధికారులు పనిచేయాలని మంత్రి అడ్లూరి లక్ష్మణ్ స్పష్టం చేశారు. విద్యార్థుల నాణ్యమైన విద్యను అందించి ఉత్తమ ఫలితాలు సాధించి వారిని ఉన్నత శిఖరాలకు చేర్చే గురుతరమైన బాధ్యత ఉన్నతాధికారులపై ఉందని మంత్రి పేర్కొన్నారు. అందుకు అవసరమైన సదుపాయాలను కల్పించడానికి ప్రభుత్వం సిద్దంగా ఉందని తెలిపారు. అధికారులు ఎప్పటికప్పుడు హాస్టళ్లను పర్యవేక్షించాలని మంత్రి ఆదేశించారు. ఎస్సీ, ఎస్టీ సంక్షేమ హాస్టల్ విద్యార్థుల విద్య, వైద్యం, సదుపాయాల కోసం ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ వహించిందని, సంక్షేమ పథకాలను విజయవంతంగా అమలు చేసేందుకు ప్రభుత్వం అధిక నిధులను కేటాయించిందని మంత్రి అడ్లూరి లక్ష్మణ్ వివరించారు. హాస్టల్ విద్యార్థుల సంక్షేమం కోసం గత బడ్జెట్ లో హాస్టల్ విద్యార్థుల సంక్షేమం కోసం గత బడ్జెట్ లో పథకాల అమలుకు ప్రభుత్వం కేటాయించిన నిధుల అమలు తీరుపై ఒక నివేదికను రూపొందించి సమర్పించాలని మంత్రి ఉన్నతాధికారులను ఆదేశించారు. హాస్టల్, భవనాలు, వసతులు, మరమ్మతులు సదుపాయాలపై అధికారులు ఎప్పటికప్పుడు పర్యవేక్షించి నివేదికలను అందజేయాలని, ఎస్సీ, ఎస్టీ విద్యార్థులకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా చూసుకోవాలని అన్నారు.

తమ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ప్రీ– మెట్రిక్ ఉపకార వేతనాలను పెంచామని, విద్యాబోధనలో అసమానతలను తొలగించేందుకు ఇంటిగ్రేటెడ్ గురుకుల పాఠశాలలను ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రారంభించారని మంత్రి ఈ సందర్భంగా గుర్తు చేశారు. సంక్షేమ పథకాలను మరింతగా ముందుకు తీసుకెళ్లేందుకు తీసుకోవలసిన చర్యలను అధికారులు ఒక నివేదికను రూపొందించి ప్రభుత్వానికి సమర్పించాలని మంత్రి ఆదేశించారు.

### విదేశీ విద్య కోసం..

విదేశీ విద్యను సాకారం చేసుకోవాలనే ఎస్సీ విద్యార్థులకు అంబేద్కర్ ఓవర్సీస్ విద్యానిధి ఓ వరం లాంటిదని, లబ్ధిదారుల సంఖ్యను గతంలో ఉన్న 200 సీట్లను 500 కు పెంచామని, అధిక నిధులను కేటాయించామని, పోస్టు మెట్రిక్ విద్యార్థుల కోసం నిధులను మంజూరు చేశామని, బిఏఎస్ విద్యా పథకాన్ని మరింత ముందుకు తీసుకెళుతున్నామని నిధులు కేటాయించామని మంత్రి తెలిపారు. దేశంలోనే అత్యున్నత స్థాయిలో విద్యా విధానాన్ని తీర్చిదిద్దేందుకు ప్రభుత్వం దృఢ సంకల్పంతో ఉన్నదని అన్నారు. ఎస్సీ, ఎస్టీ హాస్టల్ విద్యార్థుల కోసం ముఖ్యమంత్రి ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నారని మంత్రి అన్నారు.

### ఉన్నత ప్రమాణాలతో స్టడీ సర్కిళ్ళు

ఎస్సీ, ఎస్టీ విద్యార్థులను ఐఏఎస్, ఐపీఎస్ అధికారులుగా తీర్చిదిద్దేందుకు ప్రభుత్వం కృత నిశ్చయంతో ఉన్నదని మంత్రి తెలిపారు. జాతీయ ప్రమాణాలతో పోటీ పడేలా స్టడీ సర్కిళ్లను తీర్చిదిద్దేందుకు సీఎం ప్రణాళికలను రూపొందిస్తున్నారని వివరించారు. లోయర్ ట్యాంక్ బండ్, కాచిగూడ అంబేద్కర్ భవనాలను ఢిల్లీ, చెన్నై తరహాలో అత్యాధునికంగా రూపొందిస్తున్నామని మంత్రి వివరించారు.

## లేబర్ కోడ్లను రద్దు చేయాలని చిగురుమామిడిలో ఆందోళన

**ముద్ర, కరీంనగర్:** దేశవ్యాప్త సమ్మెలో భాగంగా చిగురుమామిడి మండల కేంద్రంలో ఆశా, అంగన్వాడీలు, గ్రామపంచాయతీ, హమాలీ కార్మికులు బస్టాండ్ నుండి తహసీల్దార్ కార్యాలయం వరకు గురువారం ర్యాలీ నిర్వహించారు.

కేంద్రంలోని బీజేపీ ప్రభు త్వం కార్మిక రైతు ప్రజా వ్యతిరేక విధానా లను అనుసరిస్తుం దని మండిపడ్డారు. నాలుగు లేబర్ కోర్స్ రద్దు చేయాలని వారు డిమాండ్ చేశారు.

ఈ కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షురాలు మారేళ్ల శ్రీలత, అం గన్ వాడీ నాయకురాలు విజయ, తిరుమల, పద్మ, ధనలక్ష్మి, పద్మ, పావని, ఆశ నాయకురాలు పద్మ, ప్రియాంక, కల్పన, అంజలి, సునీత, సరోజన, శ్వేత, పంచాయతీ కార్యదర్శి వర్కర్స్ నాయకురాలు సునీత, శాంత, రాధా, కార్తీక్, వెంకటస్వామి, అంకవ్వ, సరవ్వ తదితరులు పాల్గొన్నారు.

## వీణవంకలో ఆందోళన

**ముద్ర, కరీంనగర్:** కార్మిక వర్గాన్ని బలిచ్చే నాలుగు లేబర్ కోడ్లు కేంద్ర ప్రభుత్వం రద్దు చేయాలని సీఐటీయూ జిల్లా కమిటీ సభ్యులు పిల్లి రవియాదవ్ డిమాండ్ చేశారు. దేశవ్యాప్త కార్మిక సంఘాల ఆధ్వర్యంలో చేపట్టిన సార్వత్రిక సమ్మెలో భాగంగా వీణవంక మండల కేంద్రంలోని స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాల నుండి బస్టాండ్ వరకు ర్యాలీ తీసి, రోడ్డుపై ధర్నా చేపట్టారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ మండల కన్వీనర్ చొప్పరి శ్రీనివాస్, హమాలీ మండల కార్యదర్శి తడిగొప్పుల రాజయ్య, జీపీ కార్మికులు మహంకాళి కొమురయ్య, దాసారపు శంకర్ తదితరులు పాల్గొన్నారు.

## లేబర్ కోడ్ లు కార్మికులకు మరణ శాసనం

- టియుసిఐ రాష్ట్ర ఉపాధ్యక్షుడు కే రాజన్న




**ముద్ర ప్రతినిధి, నిర్మల్:** కార్మికులకు మరణ శాసనంగా ఉన్న నాలుగు లేబర్ కోడ్ లు రద్దు చేయాలని, కార్మిక వ్యతిరేక, కార్పొరేట్ అనుకూల విధానాలను ఉపసంహరించుకోవాలని టియుసిఐ రాష్ట్ర ఉపాధ్యక్షుడు కే రాజన్న డిమాండ్ చేశారు. దేశవ్యాప్త సార్వత్రిక సమ్మెలో భాగంగా గురువారం నిర్మల్ లో టియుసిఐ ఆధ్వర్యంలో భారీ ప్రదర్శన నిర్వహించారు. ఈ సందర్భంగా రాజన్న మాట్లాడుతూ కొత్తగా ప్రవేశపెట్టిన లేబర్ కోడ్ లు కార్మికులకు మరణ శాసనం వంటివని అన్నారు. కాంట్రాక్ట్ కార్మికులకు కనీస వేతన చట్టం అమలు చేయాలని వారికి రూ.26 వేలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఔట్ సోర్సింగ్, కాంట్రాక్టు కార్మికులను రెగ్యులరైజ్ చేయాలని, ఎనిమిది గంటల పని దినాన్ని కొనసాగించాలని అన్నారు. కార్మికులకు భద్రత సౌకర్యం కల్పించాలని డిమాండ్ చేశారు. కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం కార్మిక సంఘాలు కార్మిక చట్టాలు లేని దేశంగా మార్చాలని అన్నారు. కార్మికుల్ని నిరాయుధులను చేసి పెట్టుబడుదారులు పారిశ్రామిక వేతలకు కార్పొరేట్లకు ఆహ్వానం పలుకుతున్న కేంద్ర ప్రభుత్వ తీరును దుయ్యబట్టారు. పోరాడి ప్రాణ త్యాగాలతో సాధించుకున్న 29 చట్టాలను రద్దు చేసి వాటి స్థానంలో నాలుగు లేబర్ కోడ్ లను తేవటాన్ని తీవ్రంగా వ్యతిరేకిస్తున్నామన్నారు.

ఈ కార్యక్రమంలో టియుసిఐ జిల్లా కోశాధికారి ఎండి గఫూర్. పిఓడబ్ల్యూ జిల్లా కార్యదర్శి కట్ట లక్ష్మి. టియుసిఐ జిల్లా నాయకులు గంగా మణి, భూషణ్, గంగన్న, రాజేందర్, ఫెరోజ్, లక్ష్మి, ఏఐటీయూసీ రాష్ట్ర నాయకులు పద్మ కుమారి, ఎస్ఎన్ రెడ్డి సంజీవ్ తదితరులు పాల్గొన్నారు.

## మున్సిపల్ ఓట్ల లెక్కింపునకు పటిష్ట చర్యలు

- నిర్మల్ జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్




**ముద్ర ప్రతినిధి, నిర్మల్:** మున్సిపల్ ఎన్నికల ఓట్ల లెక్కింపునకు పటిష్ట ఏర్పాట్లు పూర్తి చేశామని జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్ తెలిపారు. ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో ఏర్పాటు చేసిన కౌంటింగ్ కేంద్రాన్ని గురువారం కలెక్టర్ సందర్శించి సిబ్బందికి పలు అంశాలపై దిశానిర్దేశం చేశారు. నిర్మల్, భైంసా, ఖానాపూర్ మున్సిపాలిటీల వారీగా కౌంటింగ్ కేంద్రాల్లో విధులు నిర్వహించనున్న సిబ్బందికి అవసరమైన సూచనలు ఇచ్చారు. సమయ పాలన అత్యంత ముఖ్యమని, సిబ్బంది నిర్ణీత సమయానికి కౌంటింగ్ కేంద్రాలకు హాజరుకావాలని ఆదేశించారు. అన్ని నియమాలను పాటిస్తూ, పారదర్శకంగా వేగవంతంగా కౌంటింగ్ ప్రక్రియను పూర్తి చేయాలని సూచించారు. అనంతరం జిల్లా మున్సిపల్ ఎన్నికల సాధారణ పరిశీలకులు వీరారెడ్డి మాట్లాడుతూ జిల్లాలో పోలింగ్ విజయవంతంగా నిర్వహించినందుకు సిబ్బందిని అభినందించారు. అదే క్రమశిక్షణతో ఓట్ల లెక్కింపును కూడా పూర్తి చేయాలని పేర్కొన్నారు. సిబ్బందికి అవసరమైన అన్ని సౌకర్యాలు కల్పించామని తెలిపారు. అనంతరం కౌంటింగ్ హాళ్లలో సీసీ కెమెరాల ఏర్పాట్లను అధికారులు పరిశీలించారు. కలెక్టర్ వెంట అదనపు కలెక్టర్లు ఫైజాన్ అహ్మద్, కిషోర్ కుమార్, అధికారులు, సిబ్బంది ఉన్నారు.

## మున్సిపల్ కౌంటింగ్ కు కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్లు

ఎస్పీ జానకి షర్మిల



**ముద్ర ప్రతినిధి, నిర్మల్:** శుక్రవారం నిర్వహించనున్న మున్సిపల్ ఎన్నికల ఓట్ల లెక్కింపు సందర్భంగా కౌంటింగ్ కేంద్రం వద్ద కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్లు చేసినట్లు ఎస్పీ జానకి షర్మిల తెలిపారు. కౌంటింగ్ ప్రక్రియను ప్రశాంతంగా, పారదర్శకంగా నిర్వహించేందుకు అవసరమైన అన్ని భద్రతా చర్యలు చేపట్టినట్లు పేర్కొన్నారు. ఈ మేరకు కౌంటింగ్ కేంద్రం పరిసర ప్రాంతాల్లో ఏర్పాటు చేసిన పార్కింగ్, బారికేడింగ్, ప్రతినిధులు, అధికారులు, సిబ్బంది ప్రవేశంపై పాటించాల్సిన విధి విధానాలపై అధికారులకు గురువారం దిశా నిర్దేశం చేశారు. కౌంటింగ్ కేంద్ర పరిసరాల్లో మూడంచెల భద్రత ఏర్పాటు చేసి, అనుమతి పత్రాలు ఉన్న సిబ్బంది, ప్రతినిధులను మాత్రమే లోపలికి అనుమతిస్తామని తెలిపారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా ప్రత్యేక బందోబస్తు, గస్తీ బలగాల మోహరింపు, ట్రాఫిక్ నియంత్రణ చర్యలు చేపట్టినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో భైంసా ఏఎస్పీ రాజేష్ మీనా, నిర్మల్ ఏఎస్పీ సాయి కిరణ్, ఇన్స్పెక్టర్లు, ఆర్ఐలు పాల్గొన్నారు.

## కౌంటింగ్ కేంద్రానికి కొండెంగ ఫొటో



**ముద్ర, సిరిసిల్ల:** సిరిసిల్ల మున్సిపల్ కౌంటింగ్ కేంద్రం వద్ద కొండెంగ చిత్ర పటం ఏర్పాటు చేశారు. స్థానిక సినారె కళామందిరంలో ఏర్పాటు చేసిన కౌంటింగ్ కేంద్రం వద్ద కోతుల బెడద ఎక్కువగా ఉండడంతో అధికారులు కొండెంగ ఫొటోలను ఏర్పాటు చేశారు. కౌంటింగ్ కేంద్రం ఆవరణలో కోతులు రావడంతో అధికారులు సిబ్బంది భయాందోళనకు గురయ్యారు. దీంతో సమస్య పరిష్కారం కోసం కొండెంగ చిత్రాలను ఏర్పాటు చేసినట్లు అధికారులు తెలిపారు.




## సీఐటీయూ ఆధ్వర్యంలో రాస్తారోకో

**ముద్ర, మంచిర్యాల:** దేశవ్యాప్త సార్వత్రిక సమ్మెలో భాగంగా సీఐటీయూ ఆధ్వర్యంలో మధ్యాహ్న భోజన కార్మికులు, అంగన్వాడీ టీచర్లు, ఆయాలు గురువారం మంచిర్యాల జిల్లా తాండూర్ లో తహసీల్దార్ కార్యాలయం నుంచి ఐబీ వరకు ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా కేంద్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేస్తూ జాతీయ రహదారిపై రాస్తారోకో, ధర్నా చేశారు. అనంతరం తహసీల్దార్ జ్యోత్స్న కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా సీఐటీయూ మంచిర్యాల జిల్లా సహాయ కార్యదర్శి దాగం రాజారాం మాట్లాడుతూ దేశవ్యాప్త సార్వత్రిక సమ్మెలో అన్ని రంగాల కార్మికులు, పాల్గొని విజయవంతం చేశారన్నారు. కేంద్ర ప్రభుత్వం అవలంబిస్తున్న కార్మిక, కర్షక, ప్రజా, రైతు, వ్యతిరేక విధానాలను వ్యతిరేకించాలని కోరారు. కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన నాలుగు లేబర్ కోడ్లు కార్మికుల హక్కులను హరించి వేయడంతో పాటు కార్మిక సంఘాలను సైతం అణచివేసే విధంగా ఉన్నాయన్నారు. సమ్మెకు మద్దతుగా ఆటో యూనియన్ అధ్యక్షుడు హబీబ్ పాషా ఆధ్వర్యంలో ఆటో యూనియన్ నాయకులు ఐబీ చౌరాస్తాలో వంటావార్పు చేపట్టి నిరసన తెలిపారు.

సమగ్ర సమాచార పత్రిక
ముద్ర
13.02.2026 శుక్రవారం, హైదరాబాద్
www.mudranews.in | @mudranews



**2018 ఎస్సీ/ఎస్టీ చట్టం బంద్ (Apr 2, 2018)**

ఎస్సీ/ఎస్టీ వేధింపుల నిరోధక చట్టంపై సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పును నిరసిస్తూ దళిత సంఘాలు ఈ బంద్‌కు పిలుపునిచ్చాయి. ఉత్తరాది రాష్ట్రాల్లో ఈ బంద్ ఉధృతంగా సాగి, చట్టాన్ని యథాతథంగా పునరుద్ధరించాలని డిమాండ్ చేశారు.



# బీబీనగర్ లో సమ్మె సక్సెస్

- బీబీనగర్ లో సమ్మె సక్సెస్
- సీఐటీయూ జిల్లా అధ్యక్షులు కోమటి రెడ్డి చంద్రా రెడ్డి

**ముద్ర ప్రతినిధి, భువనగిరి :**

కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం తెచ్చిన 4 లేబర్ కోడ్స్, విబి జి రామ్ జి స్కీం, విద్యుత్తు సవరణ బిల్లు, విత్తన చట్టాలను రద్దు చేయాలని సీఐటీయూ జిల్లా అధ్యక్షులు కోమటిరెడ్డి చంద్రా రెడ్డి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. గురువారం దేశవ్యాప్త సార్వత్రిక సమ్మెను పురస్కరించుకొని సీఐటీయూ నాయకులు ఉదయం నుండి కొండ మడుగు, బీబీనగర్ పారిశ్రామిక ప్రాంతాల్లో పరిశ్రమలను బంద్ చేయించి డాగ్ బంగ్లా నుండి బ్రాహ్మణపల్లి రోడ్డు అటు నుండి పోచంపల్లి రోడ్డు వరకు ప్రదర్శన నిర్వహించి చౌరస్తాలో అరగంట పాటు రాస్తారోకో నిర్వహించారు. భారీగా వాహనాలు నిలిచిపోయాయి ట్రాఫిక్ క్లియర్ కావడానికి చాలా సమయం పట్టింది. ఈ కార్యక్రమాన్ని ఉద్దేశించి చంద్రా రెడ్డి మాట్లాడుతూ.. లేబర్ కోడ్స్ తెచ్చి కార్మికులను బానిసలుగా మార్చే ప్రయత్నం చేస్తున్నదని యాజమాన్యాలకు, కార్పొరేట్ శక్తులకు యథేచ్ఛగా శ్రమ దోపిడీ చేసుకునేందుకు వీలుగా లేబర్ కోడ్స్ రూపొందించారని మండిపడ్డారు. స్వాతంత్ర్యంకు పూర్వం నుండి మన పూర్వీకులు ఎన్నో త్యాగాలు చేసి సాధించిన 29 కార్మిక చట్టాలను పార్లమెంటులో మెజారిటీ ఉందన్న పేరుతో రద్దుచేసి 4 లేబర్ కోడ్స్ గా రూపొందించారని అన్నారు. ఈ లేబర్ కోడ్స్ అమల్లోకి వస్తే రోజుకు 8 గంటల స్థానంలో 12 గంటలు పని చేయాలని, కార్మికులు సంఘటితమై సంఘాన్ని పెట్టుకునే హక్కును గాని, తమ సమస్యల పరిష్కారం కోసం సమ్మె చేసే హక్కును గాని లేకుండా చేస్తున్నదని అన్నారు. విద్యుత్తును ప్రైవేటీకరణ చేయడం కోసం పార్లమెంట్ లో విద్యుత్ సవరణ బిల్లు ఆమోదం చేసిందని తెలిపారు. మోదీ ప్రభుత్వం అనుసరిస్తున్న కార్మిక, రైతు, ప్రజా వ్యతిరేక విధానాలకు వ్యతిరేకంగా రానున్న కాలంలో పెద్ద ఎత్తున పోరాటాల్లో పాల్గొనాలని అన్నారు. ఈ కార్యక్రమంలో సిఐటియు జిల్లా సహాయ కార్యదర్శి పొట్ట యాదమ్మ, జిల్లా కమిటీ సభ్యులు సయ్యద్ ఉమర్, సిహెచ్ శ్రీనివాస్, మాజీ జిల్లా కమిటీ సభ్యులు గాడి శ్రీనివాస్, ప్రజా సంఘాల నాయకులు ఎరుకలి బిక్షపతి, రేసు రామచంద్రా రెడ్డి, బాలబోయిన జంగయ్య, గ్రామపంచాయతీ యూనియన్ మండల అధ్యక్ష, కార్యదర్శులు నాంపల్లి భాస్కర్, మంద యాదగిరి, స్టెర్లింగ్ స్టోనెక్స్ నాయకులు పలుగుల మునీశ్వర్ రెడ్డి, బాలరాజు, అంజయ్య, అంగన్వాడీ యూనియన్ నాయకులు ఎస్కే షాహెద, శారద ధనలక్ష్మి, పద్మ, ఆశ యూనియన్ నాయకులు ఉడుత భవాని, గుర్రం బాలమణి, రాజ్యలక్ష్మి, సిహెచ్ అనిత, ఫీల్డ్ అసిస్టెంట్స్ నాయకులు బింగి నరసింహ, నాశపోయిన నరసింహ, లత, సునీత, మిషన్ భగీరథ నాయకులు జంగయ్య, కరుణాకర్, మధ్యాహ్న భోజనం నాయకులు వసంత, పద్మ లతో పాటు పాశం బాలయ్య, సిలివేరు రమేష్, మార్కండేయ, తాళ్ల అనూష, పావని, సరస్వతి, లావణ్య, సుజాత, రామారావు, లోక్దాస్ పవన్, బండారు భగత్, శివ తదితరులు పాల్గొన్నారు.






## కార్మిక వ్యతిరేక చట్టాలను రద్దు చేయాలి

- వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు బొల్లు యాదగిరి

**ముద్ర, మోత్కూరు:**

కేంద్ర ప్రభుత్వం తెచ్చిన కార్మిక వ్యతిరేక చట్టాలను వెనక్కి తీసుకోవాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షులు బొల్లు యాదగిరి కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలను డిమాండ్ చేశారు. నిరంకుశ పాలనను నిరశిస్తూ జాతీయ కార్మిక సంఘాలు ఇచ్చిన పిలుపు మేరకు దేశవ్యాప్త సమ్మెలో భాగంగా శుక్రవారం మోత్కూర్ పట్టణం అంబేద్కర్ చౌరాస్తాలో ప్రజా సంఘాల ఆధ్వర్యంలో నిరసన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో చేనేత కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి గుండు వెంకటనర్సు, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా నాయకులు రాచకొండ రాములమ్మ, సీఐటీయూ మండల నాయకులు మెంట ఎల్లయ్య, భవన నిర్మాణ కార్మిక సంఘం రాష్ట్ర కమిటీ సభ్యులు ఎస్ కె శ్రీను, భవన నిర్మాణ కార్మిక సంఘం జిల్లా సహాయ కార్యదర్శి కూరెళ్ళ నరసింహ తదితరులు పాల్గొన్నారు.



## ప్రజా వ్యతిరేక బిల్లులు రద్దు చేయాలి

**ముద్ర, తుర్కపల్లి:**

కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన లేబర్ కోడ్స్, విబిజి రామ్ జీ ఉపాధి చట్టం, జాతీయ విత్తన బిల్లు, విద్యుత్ సవరణ బిల్లులను వెంటనే రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ తుర్కపల్లి మండల కేంద్రంలో అఖిల భారత ప్రజాతంత్ర మహిళా సంఘం (ఐద్వా) ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఎమ్మార్వో కార్యాలయం నుంచి ఎం.డీ.ఓ కార్యాలయం వరకు ర్యాలీ నిర్వహించి, తెలుగు తల్లి విగ్రహం వద్ద రాస్తారోకో చేపట్టారు. ఈ సందర్భంగా ఐద్వా జిల్లా ప్రధాన కార్యదర్శి బట్టుపల్లి అనురాధ మాట్లాడుతూ.., కేంద్ర బీజేపీ ప్రభుత్వం తీసుకొచ్చిన ఈ చట్టాలు అమలులోకి వస్తే కార్మికులు, రైతులు, వ్యవసాయ కార్మికులు తీవ్రంగా నష్టపోతారని అన్నారు. విద్యుత్ సవరణ బిల్లుతో విద్యుత్ రంగాన్ని ప్రైవేటు వ్యక్తులకు అప్పగించే ప్రయత్నం జరుగుతోందని, ఇది అమలైతే రైతులపై కరెంట్ బిల్లుల భారం పెరిగి అప్పుల పాలయ్యే పరిస్థితి వస్తుందని హెచ్చరించారు. ఈ విధానాలకు వ్యతిరేకంగా రాజకీయాలకు అతీతంగా ఐక్యంగా పోరాటాలు చేపట్టాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సిఐటియు జిల్లా కమిటీ సభ్యులు పోతరాజు జహంగీర్, తూటి వెంకటేశం, గడ్డమీది నరసింహ, గ్రామపంచాయతీ యూనియన్ మండల అధ్యక్షుడు ఎరుకల స్వామి గౌడ్, అంగన్‌వాడీ యూనియన్ నాయకులు మరియు ఇతర సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు.

## ఉద్యమకారులను విస్మరిస్తే సహించం

- తెలంగాణ ఉద్యమ సంఘాల ఐక్య వేదిక రాష్ట్ర అధ్యక్షుడు బత్తుల సోమయ్య

**ముద్ర, ఖమ్మం:**



భౌగోళిక తెలంగాణ కోసం ప్రాణత్యాగం చేసిన ఉద్యమకారులను విమర్శించి, తెలంగాణ డబ్బంతా మూసీలో సీఎం రేవంత్ రెడ్డి పోస్తున్నారు అని, తెలంగాణ ఉద్యమ సంఘాల ఐక్య వేదిక రాష్ట్ర అధ్యక్షుడు బత్తుల సోమయ్య అన్నారు. హైదరాబాద్ మహానగరంలోని ఆర్.టి. సి కళ్యాణ మండపంలో తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కవిత నిర్వహించిన ఉద్యమకారుల ఆత్మ గౌరవ సభలో సోమయ్య మాట్లాడుతూ.. ఇప్పటికైనా జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత ఉద్యమకారుల నినాదాన్ని ఎత్తుకున్నందుకు కృతజ్ఞతలు తెలిపారు. నిజంగా చెప్పాలంటే కేసీఆర్ ఉద్యమకారులను విస్మరించారని, దీనికి కొంతమంది కెసిఆర్ పక్కన చేరి ఉద్యమకారులకు అన్యాయం చేశారని ఆరోపించారు. ఖమ్మం జిల్లా నుంచి నాడు మంత్రిగా ఉన్న తుమ్మల నాగేశ్వరరావు లాంటి వాళ్ళు కూడా ఉద్యమకారులకు తీరని ద్రోహం చేశారని అన్నారు. అగ్గిపెట్టె హరీశ్ రావు కూడా ఉద్యమకారులకు అన్యాయం చేసినవాళ్లలో ఉన్నాడని బత్తుల ఆరోపించారు. అదే పంథాలో ప్రస్తుతం రేవంత్ రెడ్డి కూడా నడుస్తున్నాడని, కేవలం తెలంగాణ ఇచ్చిందనే కారణం చేతనే సోనియమ్మ పై ప్రేమతో.., కేసీఆర్ మీద కోపంతో కాంగ్రెస్ పార్టీని గెలిపించామని రేవంత్ రెడ్డి కేవలం వాగ్దానాలకే పరిమితమైతే ఇంటి దారి పట్టడం ఖాయం అని ఈ సందర్భంగా హెచ్చరించారు. కవిత మీద గౌరవంతో మద్దతు పలుకుతున్నామని, ఉద్యమకారుల పక్షాన నిలబడి కొట్లాడాలని కోరారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ ఉద్యమ సంఘాల ఐక్య వేదిక రాష్ట్ర కార్యదర్శి పాలకుర్తి కృష్ణ, తునికి పాటి చారి, కుక్క సత్యం, షేక్ అబ్జల్ మియా, కాలింగ్ గురవయ్య, జంపాని అంజయ్య, వడిత్యా రాజేష్ నాయక్, వడ్డేబోయిన వెంకటేశ్వర్లు, బొల్లికొండ పాపయ్య, కలకోట అరుణ, ఉల్లోజు వెంకన్న, అశోక్ సింగ్, మేర నాగయ్య, గుమ్మ సీతమ్మ, కుర్రి ముత్తయ్య, రామాంజనేయులు, రామ్మూర్తి నాయక్, మంగిలాల్ నాయక్, కోసూరి రాములు, లక్క పిచ్చయ్య, లక్క పుల్లయ్య, కుర్రీ వెంకయ్య , కొత్త వెంకటరెడ్డి, బిక్షమా చారి, వీరబాబు తదితరులు పాల్గొన్నారు.

## మల్టీ పర్పస్ విధానాన్ని రద్దు చేయాలి

**ముద్ర, నడిగూడెం:**



మల్టీపర్పస్ వర్కర్స్ విధానాన్ని రద్దు చేయాలని గ్రామ పంచాయతీ ఎంప్లాయిస్ వర్కర్స్ యూనియన్ మండల అధ్యక్షులు షేక్ సుభాని కోరారు. దేశవ్యాప్త సమ్మెలో భాగంగా గురువారం మండల కేంద్రంలో సిఐటియు అనుబంధ సంఘమైన గ్రామ పంచాయతీ వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో కార్మికులు నడిగూడెం బస్టాండ్ సెంటర్ నుండి ఎంపీడీవో ఆఫీస్ వరకు ర్యాలీ నిర్వహించి, నిరసన వ్యక్తం చేశారు. అనంతరం ఎంపీఓ విజయ కుమారికి వినతి పత్రం అందజేశారు. గ్రామ పంచాయతీ కార్మికుల ర్యాలీకి సిపిఎం సంఘీభావం తెలిపారు. కార్యక్రమంలో జిపి వర్కర్స్ యూనియన్ మండలాధ్యక్షుడు సుభాని, సిపిఎం నాయకులు బెల్లంకొండ సత్యనారాయణ, సిఐటియు మండల కన్వీనర్ మల్లెల వెంకన్న గ్రామ పంచాయతీ వర్కర్లు నందిపాటి వెంకన్న, చిమట నాగరాజు, రాజుల రామయ్య, చాపల వెంకన్న, ప్రమోదు, మధుసూదన్,

## రైతు భరోసా ఇవ్వాలని బీఆర్ఎస్ ధర్నా

**ముద్ర, తుంగతుర్తి:**



యాసంగి సీజన్ అయిపోవస్తున్నా రైతులకు ఇప్పటివరకు రైతు భరోసా విడుదల చేయలేదని మండల కేంద్రంలో టీఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు . ఈ సందర్భంగా మాజీ ఎంపీపీ, మండల పార్టీ అధ్యక్షుడు తాటికొండ సీతయ్య మాట్లాడుతూ.. ప్రభుత్వం రైతు భరోసా నిధులు విడుదల చేయకపోవడంతో పెట్టుబడి సాయం కోసం రైతులు ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. గత టీఆర్ఎస్ ప్రభుత్వంలో సీజన్ ప్రారంభం కాగానే రైతు భరోసా నిధులు రైతుల అకౌంట్లో జమ అయ్యేదని, ప్రస్తుతం కాంగ్రెస్ ప్రభుత్వంలో రైతులకు రైతు భరోసా నిధులు రాక ఎరువులు సక్రమంగా అందకపోవడంతో రైతులు అవస్థలు పడుతున్నారని అన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం రైతు భరోసా నిధులు విడుదల చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీపీ దొంగరి శ్రీను, టిఆర్ఎస్ పార్టీ నాయకులు గాజుల యాదగిరి, సర్పంచులు తప్పెట్ల ఎల్లయ్య, మాతంగి వెంకటమ్మ కర్ణాకర్, నాయకులు కొండగడుపుల నాగయ్య, పూర్ణా నాయక్, మల్యాల రాములు, గుడిపాటి వీరయ్య, కదారి దాసు, ఎస్ కే యాకూబ్, మట్టపల్లి వెంకట్, మల్లెపాక రాములు, జటంగి రవి, పాండవుల మహేష్, కరుణాకర్, భాస్కర్, గోపగాని రమేష్, సింహాద్రి, రమేష్, వెంకన్న, ఉప్పుల నాగమల్లు, సోమేశ్ తో పాటు కార్యకర్తలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

## కార్మిక వ్యతిరేక విధానాలను తిప్పికొట్టండి

- కొలిశెట్టి యాదగిరి రావు, సీపీఎం రాష్ట్ర కమిటీ సభ్యులు

**ముద్ర, తుంగతుర్తి:**



దేశంలో అధికారంలో ఉన్న బిజెపి ప్రభుత్వం అనుసరిస్తున్న కార్మిక, రైతు, ప్రజా వ్యతిరేక విధానాలను తిప్పికొట్టాలని సీఐటీయూ, ఏఐటీయూసీ ఆధ్వర్యంలో భారీ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా సీపీఎం రాష్ట్ర కమిటీ సభ్యులు కొలిశెట్టి యాదగిరిరావు మాట్లాడుతూ.. కేంద్ర ప్రభుత్వం కార్మిక వ్యతిరేక విధానాలను అవలంబిస్తూ బడా పెట్టుబడిదారులకు ఈ దేశ సంపదను అప్పజెప్పి పేద మధ్యతరగతి వర్గాల ప్రజలపై అనేక భారాలను మోపుతున్నదని విమర్శించారు. అనేక సంవత్సరాలు కొట్లాడి సాధించుకున్న 29 కార్మిక చట్టాలను తొలగించి వాటి స్థానంలో నాలుగు లేబర్ కోడ్లను తీసుకొచ్చి కార్మికుల బతుకులను ఆగం చేసిన చరిత్ర బిజెపి ప్రభుత్వానికి అని అన్నారు. కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలను మార్చుకోకపోతే కార్మిక సంఘాలు మేధావులు ప్రజా సంఘాలు ప్రభుత్వంపై ఐక్యంతో పోరాటాలు కొనసాగుతాయి అని అన్నారు. ఈ కార్యక్రమంలో సిఐటియు, ఏఐటీయూసీ జిల్లా నాయకులు బుర్ర శ్రీనివాస్ రాజారాం, బొంకూరు శ్యాం సుందర్, కోట రామస్వామి, అంగన్‌వాడీ వర్కర్స్ తుంగతుర్తి ప్రాజెక్టు గౌరవ అధ్యక్షురాలు ఖమ్మంపాటి ధనలక్ష్మి, స్వరూప, మంగమ్మ, మంజుల, మాజీ జెడ్పిటిసి తాటి విజయమ్మ, పళ్ళ సుదర్శన్, గడ్డం ఎల్లయ్య, జాజుగాల్ల ముత్తయ్య, ఉప్పుల సోమయ్య, యాదగిరి, బోనాల వెంకన్న, రామచంద్రు, మరియు గ్రామ పంచాయతీ వర్కర్స్ అమాలి సంఘం నాయకులు బిల్డింగ్ వర్కర్స్ నాయకులు తదితరులు పాల్గొన్నారు



## రిజర్వ్ బ్యాంక్ ఆర్థిక వారోత్సవాలు

**ముద్ర, మోత్కూర్:**

రిజర్వు బ్యాంక్ ఆఫ్ ఇండియా వారి ఆదేశానుసారం మోత్కూరు మండలం పాటిమట్ల గ్రామం లో ఏర్పాటు చేసిన ఆర్థిక అక్షరాస్యత పై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. బ్యాంకు ఖాతా లేకుంటే జరిగే నష్టాలను గురించి ముఖ్య అతిథిగా లీడ్ బ్యాంకు మేనేజర్ శివరామకృష్ణ వివరించారు. ఈ కార్యక్రమం లో, డీపీఎం, వెంకటేశ్వర్లు. అడిషనల్ డీఆర్డిఓ, జంగారెడ్డి. ఎస్బిఐ బ్యాంక్ మేనేజర్ కిరణ్ కుమార్ మోత్కూరు అడ్డగూడూరు ఏపీఎంలు, ఫకీరయ్య,కళావతి. కౌన్సిలర్స్ యుగంధర్, మహేష్ తదితరులు పాల్గొన్నారు.

## మహిళలకు అవగాహన సదస్సు

**ముద్ర, మోత్కూర్:**

మహిళలకు జీవనోపాదుల నిర్వహణపై మండల పరిషత్ కార్యాలయంలో మోత్కూరు, అడ్డగూడూర్ గుండాల,ఆత్మకూర్ మండల ఏపిఎంలకు, సీసీలకు, విఓ ఏలకు, సీఆర్పీలకు స్టార్ట్ అప్ విలేజ్ ఎంటర్ ప్లేన్యూర్ షిప్ ప్రోగ్రాం పై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా సేర్ప్ ఎస్ పిఎం ఉమాపతి, ఏపీడి జంగారెడ్డి మాట్లాడుతూ.. గ్రామాలలో మహిళలు నిర్వహిస్తున్న వ్యాపారాల విస్తరణ కోసం, కొత్త వ్యాపారాలు ఏర్పాటు చేసుకోవడం కోసం, అవగాహన కల్పించారు. వ్యాపార నిర్వహణ అభివృద్ధి కోసం సంఘములో, సంఘ బంధంలో తీర్మానాలు చేయించి కావాల్సిన లోన్స్ సౌకర్యాన్ని కల్పించాలని కోరారు. ఈ కార్యక్రమంలో లీడ్ బ్యాంకు మేనేజర్ శివరామకృష్ణ, ఎస్బిఐ మేనేజర్ కిరణ్, కెనరా బ్యాంక్ మేనేజర్ అశోక్, ఏపీఎంలు కేపీ రాజు, ఫకీరయ్య, నరసింహ,వెంకటేశ్వర్లు, కళావతి జిల్లా సమైక్య అధ్యక్ష కార్యదర్శులు రేణుక, పల్లవి, స్వాప్ అధ్యక్షులు శైలజ, అడ్డగూడూర్ అధ్యక్షులు లక్ష్మి,నాలుగు మండలాల సీసీలు, వివో ఏలు, సీఆర్పీలు పాల్గొన్నారు.





## కౌంటింగ్ ప్రక్రియ బాధ్యతగా నిర్వహించాలి

- యాదాద్రి భువనగిరి జిల్లా కలెక్టర్ హనుమంతరావు

**ముద్ర ప్రతినిధి, భువనగిరి :**

మున్సిపల్ ఎన్నికల సందర్భంగా కౌంటింగ్ ప్రక్రియను సంబంధిత అధికారులు పారదర్శకంగా బాధ్యతాయుతంగా నిర్వహించాలని యాదాద్రి భువనగిరి జిల్లా కలెక్టర్ హనుమంతరావు అన్నారు. గురువారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో మున్సిపల్ ఎన్నికల కౌంటింగ్ కు సంబంధించిన అధికారులకు, సిబ్బందికి శిక్షణ ఇచ్చారు. ఈ శిక్షణ కార్యక్రమాన్ని ఉద్దేశించి జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ... మున్సిపల్ ఎన్నికల్లో కౌంటింగ్ అనేది చాలా కీలకమైనదని అన్నారు. రాష్ట్ర ఎన్నికల సంఘం ఆదేశాలు అనుసరించి ప్రాథమిక మరియు వివరణాత్మక కౌంటింగ్ నిర్వహించాలని , రూల్ 56 ప్రకారం మొదటగా పోస్టల్ బ్యాలెట్ ను లెక్కించాలని తెలిపారు. యాక్ట్ 212 ప్రకారం సిక్రెసి మెయింటెనెన్స్ యాక్టు చదివి మరియు కౌంటింగ్ పారదర్శకంగా నిర్వహించాలన్నారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ భాస్కర్ రావు, ఆర్డీవో కృష్ణారెడ్డి, జిల్లా గ్రామీణ అభివృద్ధి అధికారి నాగిరెడ్డి, డిపిఓ విష్ణువర్ధన్ రెడ్డి, మాస్టర్ ట్రైనర్స్ నర్సిరెడ్డి, హరినాథ్ రెడ్డి, కౌంటింగ్ సిబ్బంది పాల్గొన్నారు.



## యూరియా యాప్ రద్దు చేయాలని రైతుల ధర్నా

**ముద్ర, నడిగూడెం:**

యూరియా యాప్ రద్దు చేయాలని రైతులు గురువారం మండల కేంద్రంలో పిఎసిఎస్ ముందు రాస్తారోకో, ధర్నా నిర్వహించారు. యూరియా పొందేందుకు యాప్ విధానాన్ని రద్దు చేయాలని, పాత పద్ధతిలోనే యూరియా సరఫరా చేయాలని కోరారు. సకాలంలో యాప్ లో బుక్ కావడం లేదని రైతులు రాస్తారోకో నిర్వహించారు. సాంకేతిక సమస్యలు, నెట్వర్క్ సమస్యలతో యూరియా కట్టలు పొందలేకపోతున్నామని, స్లాట్ బుక్ చేసిన సెకండ్ లోనే నో స్టాక్ చూపిస్తుందని రైతులు ఆవేదన వ్యక్తంచేశారు. వెంటనే యాప్ విధానాన్ని రద్దు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో రైతులు, గుండు శ్రీను, నక్క సైదులు, జానీ మియా , వందనపు చంద్ర మోహన్, గునుగుంట్ల పోతురాజు, గునుగుంట్ల బుచ్చిరాజు, వట్టి మహేష్, నక్క మహేష్, మెడిసిన మెట్ల రాజశేఖర్, రైతు సంఘం జిల్లా సహాయ కార్యదర్శి బెల్లంకొండ సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

సమగ్ర సమాచార పత్రిక
# ముద్ర
13.02.2026 శుక్రవారం, హైదరాబాద్
www.mudranews.in | @mudranews



**2020 సార్వత్రిక సమ్మె (Jan 8, 2020)**




మోదీ ప్రభుత్వ విధానాలు కార్మిక వ్యతిరేకమని ఆరోపిస్తూ 10 ప్రధాన కేంద్ర కార్మిక సంఘాలు ఈ భారీ బంద్‌ను నిర్వహించాయి. సుమారు 25 కోట్ల మంది ప్రజలు పాల్గొన్నట్లు అంచనా వేసిన ఈ బంద్, నిరుద్యోగం మరియు ఆర్థిక సంక్షోభంపై దృష్టి సారించింది.



## కౌంటింగ్ లో సిబ్బంది పాత్ర కీలకం

- **కలెక్టర్ రాహుల్ రాజ్**

**ముద్ర ప్రతినిధి, మెదక్:**

మున్సిపల్ ఎన్నికల ఓట్ల కౌంటింగ్ ప్రక్రియలో ఆర్వో లు, సూపర్వైజర్లు, అసిస్టెంట్ సూపర్వైజర్లు, మైక్రో అబ్జర్వర్ల పాత్ర చాలా కీలకమని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ రాహుల్ రాజ్ ఎన్నికల అధికారులకు సూచించారు.

**గురువారం వెస్లీ పాఠశాలలోని**

స్ట్రాంగ్ రూంను, కౌంటింగ్ హాలును అదనపు కలెక్టర్ నగేష్, అదనపు ఎస్పీ మహేందర్, డిఎస్పీ ప్రసన్నకుమార్, ఆర్డీవో రమాదేవి తో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా కౌంటింగ్ సిబ్బందికి పలు సూచనలు, సలహాలు అందించారు. స్ట్రాంగ్ రూంకు మూడంచెల పోలీస్ భద్రత వ్యవస్థను ఏర్పాటు చేసినట్లు తెలిపారు.

కౌంటింగ్ రోజు ఆర్వోలు, మున్సిపల్ ఎన్నికల్లో పోటీ చేసిన అభ్యర్థులు, రాజకీయ పార్టీల నాయకులు, ఉదయం 5:45 లోపల కౌంటింగ్ కేంద్రంలో ఉండాలన్నారు.

కౌంటింగ్ హాలులో ఫోను అనుమతి లేదన్నారు. ఓట్ల లెక్కింపు రౌండ్ల వారీగా, టేబుల్ వారీగా ఫ్లెక్సీలు ఏర్పాటు చేయాలని అధికారులను ఆదేశించారు. కౌంటింగ్ కేంద్రం వద్ద కట్టు దిట్టమైన భద్రత ఏర్పాట్లు చేశామన్నారు. ఈ కార్యక్రమంలో మెదక్ తహసీల్దార్ లక్ష్మణ్ బాబు, మున్సిపల్ కమిషనర్ శ్రీనివాస్ రెడ్డి, జిల్లా సైన్స్ అధికారి రాజిరెడ్డి, ఆర్వోలు, సూపర్వైజర్లు, అసిస్టెంట్ సూపర్వైజర్లు పాల్గొన్నారు.




## కౌంటింగ్ కేంద్రాల వద్ద భారీ భద్రత

- **ఎస్పీ డీవీ శ్రీనివాస్ రావు**

**ముద్ర ప్రతినిధి మెదక్:**

మున్సిపాలిటీ ఎన్నికల కౌంటింగ్ కేంద్రాల వద్ద భారీ పోలీసు బందోబస్త్ ఏర్పాటు చేసినట్లు ఎస్పీ డీవీ శ్రీనివాస్ తెలిపారు. మెదక్ వేస్లీ కళాశాల ప్రాంగణంలో గురువారం సిబ్బందికి సూచనలు చేశారు. కౌంటింగ్ సెంటర్‌లో చేపట్టిన భద్రతా ఏర్పాట్లను సమీక్షించారు. కౌంటింగ్ సెంటర్‌లోకి ప్రవేశించే ప్రతి వ్యక్తిని ఖచ్చితంగా తనిఖీ చేయాలని ఆదేశించారు. చెల్లుబాటయ్యే అనుమతిపత్రాలు ఉన్నవారికే ప్రవేశం కల్పించాలని, ఇతరులను ఎట్టి పరిస్థితుల్లోనూ అనుమతించవద్దని స్పష్టం చేశారు. మహిళా అభ్యర్థులను మహిళా సిబ్బంది మాత్రమే తనిఖీ చేయాలని సూచించారు. మొబైల్ ఫోన్లు, ఇతర పరికరాలను కౌంటింగ్ సెంటర్‌లోకి అనుమతించబోమని తెలిపారు. భద్రతా పరంగా విధించిన నిబంధనలను ఖచ్చితంగా అమలు చేయాలని అధికారులను ఆదేశించారు.



## నాసిరకం భోజనం పెడుతున్నారని విద్యార్థుల నిరసన

**ముద్ర, సంగారెడ్డి:**

నాసిరకం భోజనం పెడుతున్నారని ఆరోపిస్తూ విద్యార్థులు నిరసన వ్యక్తం చేశారు. సంగారెడ్డి జిల్లా నారాయణఖేడ్ మండలం జూకల్ శివారులోని ఎస్టీ ఆశ్రమ పాఠశాలలో నాసిరకం భోజనం పెడుతున్నారని ఆరోపిస్తూ రోడ్డుపై విద్యార్థులు ధర్నా చేశారు. భోజనాన్ని రోడ్డుపై వేసి గిరిజన ఆశ్రమ పాఠశాల సిబ్బందికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఈ ధర్నాతో కిలోమీటర్ల మేర ట్రాఫిక్ నిలిచిపోయింది. సమాచారం అందుకున్న పోలీసులు సంఘటన స్థలానికి చేరుకొని విద్యార్థులతో మాట్లాడి, సమస్యను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తామని హామీ ఇచ్చి ధర్నాను విరమింపజేశారు

## రోడ్డు ప్రమాదంలో యువకుడి మృతి

- **కుటుంబానికి అండగా గ్రామ యువకులు**

**ముద్ర, నస్రుల్లాబాద్:**

రోడ్డు ప్రమాదంలో ప్రాణాలు కోల్పోయిన యువకుడి కుటుంబానికి గ్రామ యువకులు అండగా నిలిచారు. సోమవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో అంకోల్ గ్రామానికి చెందిన పసుపుల సాయి మృతి చెందాడు. ఈ నేపథ్యంలో మృతుడి కుటుంబానికి అంకోల్ గ్రామానికి చెందిన యువకులు ఆర్థిక సాయం చేశారు. గురువారం ఆ కుటుంబాన్ని పరామర్శించిన యువకులు రూ.63,500 కుటుంబసభ్యులకు అందించారు. ప్రాణాలు కోల్పోయిన సాయిది నిరుపేద కుటుంబం కావడంతో ఆర్థిక సాయం చేసినట్లు యువకులు తెలిపారు.



# ఫలితానికి వేళాయే..!





- **మెదక్ గోల్ బంగ్లాలో, నర్సాపూర్‌లో బివిఆర్ఐటి, తూప్రాన్‌లో నోబుల్ ఫార్మా కళాశాల, రామాయంపేటలో ఎంపీడీవో కార్యాలయంలో ఓట్ల లెక్కింపు**
- **మూడు రౌండ్లలో ఫలితాలు**

**ముద్ర ప్రతినిధి, మెదక్:**

ఎప్పుడెప్పుడా అని ఎదురుచూస్తున్న మున్సిపల్ ఎన్నికల ఫలితాల వెల్లడికి వేళయింది. మెదక్ జిల్లాలో 4 చోట్ల కౌంటింగ్ నిర్వహణకు అధికార యంత్రాంగం అన్ని ఏర్పాట్లు పూర్తి చేసింది. జిల్లాలో 4 మున్సిపాలిటీలలో 75 వార్డులుండగా మెదక్ లో 32వ వార్డు ఎన్నిక ఏకగ్రీవమైంది. మిగిలిన 74 వార్డులకు 287 మంది అభ్యర్థులు పోటీలో ఉన్నారు. అభ్యర్థుల భవితవ్యం కొన్ని గంటల్లో తేలనుంది. మెదక్ లో 31 వార్డులు ఉండగా 112 మంది అభ్యర్థులు పోటీలో ఉన్నారు. రామాయంపేటలో 12 వార్డులు 48 మంది అభ్యర్థులు, తుప్రాన్ లో 16 వార్డులు 64 మంది అభ్యర్థులు, నర్సాపూర్ లో 15 వార్డులు ఉండగా 63 మంది అభ్యర్థులు పోటీ పడుతున్నారు.

**లెక్కింపు కేంద్రాలు:**

మెదక్ గోల్ బంగ్లా వెస్లీ కళాశాల, నర్సాపూర్‌లో బివిఆర్ఐటి, తూప్రాన్‌లో నోబుల్ ఫార్మా కళాశాల లింగారెడ్డిపల్లి, రామాయంపేటలో ఎంపీడీవో కార్యాలయంలో ఓట్ల లెక్కింపు జరగనుంది.

**మెదక్ లో 3 రౌండ్లలో ఫలితాలు:**

మెదక్ వెస్లీ గోల్ బంగ్లాలో ఓట్ల లెక్కింపు చేపడతారు. 3 రౌండ్లలో ఓట్లు లెక్కిస్తారు. 31 వార్డులకు 11 టేబుళ్లు ఏర్పాటు చేశారు.

ఒక్కో టేబుల్ వద్ద ఆర్ఓ, సూపర్వైజర్, ఇద్దరు సహాయకులుంటారు.

**మొదటి రౌండ్లో...**

1,4,7,10,13,16,19,22,25,28,

**31 వార్డులు, సెకండ్ రౌండ్లో...**

2,5,8,11,14,17,20,23,26,29 వార్డులు

**మూడో రౌండ్లో**

3,6,9,12,15,18,21,24,27,30 వార్డుల ఓట్లు లెక్కించి ఫలితాలు వెల్లడిస్తారు.

**25 చొప్పున బండిళ్లు:**

ఓట్ల లెక్కింపులో ముందుగా బ్యాలెట్ బాక్సులు తెరిచి 25 చొప్పున బండిళ్లు కట్టి అకౌంట్ సరిచూసుకున్న అనంతరం అభ్యర్థులవారీగా వేరుచేసి ఫలితాలు ప్రకటిస్తారు. రామాయంపేటలో 4 టేబుళ్లు, 3 రౌండ్లు, తుప్రాన్ లో 6 టేబుళ్లు 3 రౌండ్లు, నర్సాపూర్ లో 5 టేబుళ్లు 3 రౌండ్లలో ఫలితాలు వెల్లడి కానున్నాయి.

## కార్మిక వ్యతిరేక లేబర్ కోడ్ లు రద్దు చేయాలి

- **సమ్మె విజయవంతం**
- **సీఐటీయూ రాష్ట్ర కార్యదర్శి పద్మశ్రీ**

**ముద్ర ప్రతినిధి, మెదక్:**




కార్మిక వ్యతిరేక లేబర్ కోడ్ లు రద్దు చేయాలని సీఐటీయూ రాష్ట్ర కార్యదర్శి పద్మశ్రీ డిమాండ్ చేశారు. గురువారం మెదక్ జిల్లా కేంద్రంలో ఐబీ నుండి రాందాస్ చౌరస్తా వరకు సిఐటియు టౌన్ కమిటీ ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన రాష్ట్ర కార్యదర్శి పద్మ శ్రీ మాట్లాడుతూ కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం తెచ్చిన 4 లేబర్ కోడ్లను వెంటనే రద్దు చేయాలని, విద్యుత్ సవరణ చట్టం 2025, విబి జిరామ్ జీ చట్టం, విత్తన సవరణ బిల్లు, ఎల్ఐసిలో 100 శాతం విదేశీ పెట్టుబడులను అనుమతించడం లాంటి ప్రమాదకర నిర్ణయాలను ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం కార్మిక సంఘాలు, కార్మిక చట్టాలు లేని దేశంగా మార్చాలని, కార్మికుల్ని కట్టు బానిసలుగా చేసి పెట్టుబడిదారులకు, పారిశ్రామికవేత్తలకు, కార్పొరేట్లకు మేలు చేస్తుందని విమర్శించారు. అందులో భాగంగానే వీరోచితంగా పోరాడి ప్రాణ త్యాగాలతో సాధించుకున్న 29 కార్మిక చట్టాలను రద్దు చేసి కార్మిక వ్యతిరేక 4 లేబర్ కోడ్ లను తెచ్చిందని పేర్కొన్నారు.

ఈ కార్యక్రమంలో సిఐటియు జిల్లా సహాయ కార్యదర్శి సంతోష్, వ్యవసాయ కార్మిక సమాఖ్య జిల్లా అధ్యక్షుడు దేవయ్య, యశోద నాయకులు దుర్గా, యాదగిరి, హమాలీ, మున్సిపల్, ఆశ, అంగన్వాడి, ఆటో, మధ్యాహ్న భోజన, గ్రామ పంచాయతీల కార్మికులు పాల్గొన్నారు.

## ఆర్థిక అక్షరాస్యత పట్ల అవగాహన కలిగి ఉండాలి

- **కెనరా బ్యాంక్ మేనేజర్ తుల్జారాం**

**ముద్ర, జహీరాబాద్:**




ప్రతి ఒక్కరూ ఆర్థిక అక్షరాస్యతపై అవగాహన కలిగి ఉండాలని న్యాల్కల్ మండలంలోని హద్నూర్ కెనరా బ్యాంక్ మేనేజర్ తుల్జారాం సూచించారు. గురువారం స్థానిక గ్రామపంచాయతీ కార్యాలయంలో ఆర్థిక అక్షరాస్యతపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా మేనేజర్ మాట్లాడుతూ కష్టపడి సంపాదించిన వాటికి విలువ, గుర్తింపు ఆర్థిక అక్షరాస్యతతోనే సాధ్యమని చెప్పారు. భవిష్యత్ ప్రణాళికలను ఆర్థిక అక్షరాస్యత కీలక పాత్ర పోషిస్తాయని తెలిపారు. నానాటికి పెరిగిపోతున్న సైబర్ నేరాలు, మోసాలపై గ్రామీణ ప్రాంత ప్రజలు అవగాహనను పెంచుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అందించే అన్ని రకాల పథకాలు, రుణాలు, బీమా సదుపాయాలను వివరించారు. యువత, మహిళలు, రైతులు తక్కువ వడ్డీతో అందించే రుణాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. బ్యాంకుల ద్వారా లభించే జన సురక్ష, పీఎం విశ్వకర్మ యోజన, ముద్ర, పీఎంఈజీపీ , పీఎం జీవన జ్యోతి, అటల్ పెన్షన్ యోజన లాంటి రుణాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ ప్రవీణ్ కుమార్, ఉప సర్పంచ్ షబ్బీర్ ఖాన్, పంచాయతీ కార్యదర్శి ధనరాజ్, బ్యాంకు అధికారులు ప్రశాంత్, వార్డు సభ్యులు ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

## ‘రుద్రూరు మాజీ సర్పంచ్ పార్టీ వ్యతిరేక కార్యకలాపాలు మానుకోవాలి’

**ముద్ర, కామారెడ్డి:**



బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు, రుద్రూర్ మాజీ సర్పంచ్ చంద్రశేఖర్ పార్టీ వ్యతిరేక కార్యకలా పాలు మానుకోవాలని మండల కాంగ్రెస్ శ్రేణులు హెచ్చరించారు. పోతంగల్ మండలకేంద్రంలో గురువారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో నాయకులు మాట్లాడారు. సీనియర్ కాంగ్రెస్ నాయకుడు అని చెప్పుకుంటున్న ఆయన మున్సిపల్ ఎన్నికల్లో కాంగ్రెస్ నాయకుడికి మద్దతు తెలుపకుండా ప్రత్యర్థులతో చేతులు కలపడం ఏంటని వారు ప్రశ్నించారు. ఇలాంటి పార్టీ వ్యతిరేక కార్యకలాపాలు మానుకోవాలని హితవు పలికారు. పార్టీ వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడడమే కాకుండా సొంత బలం నిరూపించుకోవడానికి కాసులు బాలరాజుపై ఆరోపణలు చేయడం సమంజసం కాదన్నారు. ఈ కార్యక్రమంలో ఏంసీ చైర్మన్ హన్మంతు, నాయకులు గంధపు పవన్, ఎజాజ్ ఖాన్, నిరడి గంగాధర్, గంట్ల విఠల్, కేశ వీరేశం, గంధపు రాజు, మన్సూర్, నాభి, శ్రీనివాస్ రావు, దాన్ రాజ్, సాయిలు, కాలిక్, శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.




## శాంతి భద్రతలకు విఘాతం కలిగిస్తే కఠిన చర్యలు

- **ఎస్సై రంజిత్ కుమార్ రెడ్డి**

**ముద్ర, నర్సాపూర్:**

మున్సిపల్ ఎన్నికల ఓట్ల లెక్కింపు కేంద్రం వద్ద శాంతి భద్రతలకు విఘాతం కలిగిస్తే కఠిన చర్యలు తప్పవని ఎస్సై రంజిత్ కుమార్ రెడ్డి హెచ్చరించారు. శుక్రవారం బివిఆర్ఐటి కళాశాలలో ఓట్ల లెక్కింపు జరుగనున్నందున.. ఎన్నికల్లో పోటీ చేసిన అభ్యర్థులు, ఎన్నికల ఏజెంట్లు, కౌంటింగ్ ఏజెంట్లు, పట్టణ ప్రజలకు ఎస్సై పలు సూచనలు చేశారు. ఎన్నికల కోడ్ ఉల్లంఘన, కేంద్రం వద్ద పార్కింగ్ గురించి ఆయన కీలక ఆదేశాలు ఇచ్చారు. మున్సిపల్ ఎన్నికల ఓట్ల కౌంటింగ్ కేంద్రానికి వచ్చే వారు తమ వాహనాలను వైపర్ కాలేజ్ దగ్గర ఏర్పాటు చేసిన పార్కింగ్ ప్రదేశంలో మాత్రమే పార్క్ చేయాలని ఎస్సై సూచించారు. ట్రాఫిక్‌కు ఆటంకం కలిగించే విధంగా రోడ్డుకు ఇరువైపులా వాహనాలు పార్క్ చేస్తే కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. కౌంటింగ్ సెంటర్‌కు 200 మీటర్ల పరిధిలోకి అభ్యర్థులు, ఎన్నికల ఏజెంట్లు, కౌంటింగ్ ఏజెంట్లకు మాత్రమే ప్రవేశం ఉంటుందని తెలిపారు. వీరు తమ సెల్ ఫోన్లను ఇంటి వద్ద లేదా 200 మీటర్ల బయట ఉంచి లోపలికి రావాల్సి ఉంటుందని చెప్పారు.

మున్సిపల్ ఎన్నికల ప్రవర్తనా నియమావళి అమల్లో ఉన్నదని, గెలిచిన అభ్యర్థులు ర్యాలీలు, రోడ్డు షోలు, బాణాసంచా కాల్చడం, డీజేలు ఏర్పాటు చేయడం, గుంపులు గుమికూడడం వంటి కార్యక్రమాలు నిర్వహించరాదని ఎస్సై సూచించారు. మైక్‌లు, లౌడ్ స్పీకర్లు, వాహన ర్యాలీలకు అనుమతి లేదని చెప్పారు. చట్టం, శాంతిభద్రతలకు విఘాతం కలిగించేలా ప్రవర్తించిన వారిపై కఠిన చట్టపరమైన చర్యలు తీసుకుంటామని ఎస్సై వెల్లడించారు. సామాజిక మాధ్యమాల్లో తప్పుడు ప్రచారం, ప్రేరేపించే పోస్టులు, గెలుపుఓటమి పై విద్వేషపూరిత వ్యాఖ్యలు చేయడం వంటి వాటికి పాల్పడితే చట్టరీత్యా కేసులు నమోదు చేస్తామని ఆయన తెలిపారు. పోలీసు శాఖకు సహకరించి అందరూ కౌంటింగ్ ప్రక్రియను ప్రశాంతంగా, సజావుగా జరిగేలా చూడాలని ఎస్సై రజింత్ కుమార్ రెడ్డి కోరారు.

**2022 అగ్నిపథ్ వ్యతిరేక బంద్**

సైనిక నియామకాల కోసం కేంద్రం తెచ్చిన 'అగ్నిపథ్' పథకాన్ని వ్యతిరేకిస్తూ యువత మరియు విద్యార్థి సంఘాలు దేశవ్యాప్త బంద్‌కు పిలుపునిచ్చాయి. బీహార్, యూపీ వంటి రాష్ట్రాల్లో ఈ నిరసనలు హింసాత్మకంగా మారి రైళ్లను తగులబెట్టడం వంటి సంఘటనలు జరిగాయి.



# శంషాబాద్ విమానాశ్రయానికి బాంబు బెదిరింపు

**ముద్ర, హైదరాబాద్ :**

శంషాబాద్ విమానాశ్రయంలో బాంబు పెట్టినట్లు గుర్తు తెలియని దుండగులు మెయిల్ ద్వారా బెదిరించారు. దీంతో అప్రమత్తమైన భద్రతా సిబ్బంది సోదాలు నిర్వహించారు. గురువారం బహ్రెయిన్ నుంచి హైదరాబాద్‌కు బయల్దేరిన గల్ఫ్ ఎయిర్ లైన్స్ (జీఎఫ్ 274) విమానానికి బాంబు బెదిరింపు రావడంతో ప్రయాణికులు భయాందోళన చెందారు. విమానం గాల్లో ఉండగానే ఈమెయిల్ రావడంతో అధికారులు, విమానసిబ్బంది, ప్రయాణికులు ఆందోళనకు గురయ్యారు. పైలట్ అప్రమత్తమై ఎయిర్ ట్రాఫిక్ కంట్రోల్ సమన్వయంతో విమానాన్ని రన్ వే పై ఎమర్జెన్సీ ల్యాండ్ చేశారు. వెంటనే రన్ వే కు దూరంగా ఉన్న ఐసోలేషన్ బే కి తరలించి తనిఖీలు చేపట్టారు. ఎయిర్ పోర్ట్ భద్రతా బలగాలు, బాంబు స్క్వాడ్ రంగంలోకి దిగి విమానం మొత్తాన్నీ క్షుణ్ణంగా పరిశీలించారు. విమానంలో, ప్రయాణికుల లగేజీలో ఎలాంటి పేలుడు పదార్థాలు లేవని అధికారులు నిర్ధారించడంతో.. అంతా హమ్మయ్యా అని ఊపిరి పీల్చుకున్నారు. బాంబు బెదిరింపు మెయిల్ హోక్స్ మెయిల్ అని తేలింది. ఈ ఘటనతో ఇతర విమాన సర్వీసులకు స్వల్ప అంతరాయం ఏర్పడింది. ప్రయాణికులకు అసౌకర్యం కలిగించినందుకు ఎయిర్ లైన్స్ యాజమాన్యం విచారం వ్యక్తం చేసింది. పోలీసులు దీనిపై కేసు నమోదు చేసి.. బాంబు బెదిరింపు మెయిల్ పంపింది ఎవరో తెలుసుకునే పనిలో నిమగ్నమయ్యారు.

## 18 లక్షల మెట్రిక్ టన్నుల అదనపు ధాన్యం తీసుకోండి

- **యాసంగి ధాన్యం సేకరణ గడువు రెండు నెలలు పొడిగించండి**
- **బాయిల్డ్ రైస్‌లో అయిదు శాతం నూకకు అనుమతించండి**
- **2014-15 బకాయిలు రూ.1,468.94 కోట్లు విడుదల చేయండి**
- **కేంద్ర మంత్రి ప్రహ్లాద్ జోషికి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, రాష్ట్ర మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి వినతి**

**ముద్ర, ఢిల్లీ:**

వానాకాలం పంటకు (202526 సీజన్) సంబంధించి తాము అదనంగా సేకరించిన 18 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని ఎఫ్‌సీఐ తీసుకోవాలని కేంద్ర ఆహార, పౌరసరఫరాల శాఖ మంత్రి ప్రహ్లాద్ జోషికి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి విజ్ఞప్తి చేశారు. కేంద్ర మంత్రిని ఆయన నివాసంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, రాష్ట్ర పౌరసరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి గురువారం కలిశారు. వానా కాలం పంటకు సంబంధించి 53.73 లక్షల మెట్రిక్ టన్నులకు (ఎల్ఎంటీ) అనుమతించారని.. కానీ భారీగా పంట ఉత్పత్తి కావడంతో అదనంగా 18 ఎల్ఎంటీలు తాము సేకరించినందున ఆ మొత్తాన్ని 10 శాతం నూకతో ఎఫ్ సీఐ సేకరించాలని కేంద్ర మంత్రికి వారు విజ్ఞప్తి చేశారు. 202425 యాసంగి పంటకు సంబంధించి 5 శాతం నూకతో అదనంగా 10 లక్షల మెట్రిక్ టన్నుల బాయిల్డ్ రైస్ మిల్లింగ్‌కు అనుమతించాలని కేంద్ర మంత్రి జోషిని సీఎం రేవంత్ రెడ్డి, రాష్ట్ర మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి కోరారు. 202425 వానా కాలం పంటకు సంబంధించి కస్టమ్స్ మిల్లింగ్ రైస్‌కు ఈ ఏడాది ఫిబ్రవరి 28వ తేదీ వరకు గడువు నిర్దేశించారని, దానిని మరో రెండు నెలలు పాటు పొడిగించాలని కేంద్ర మంత్రికి విజ్ఞప్తి చేశారు. భారత ఆహార సంస్థకు (ఎఫ్‌సీఐ) 201415 వానా కాలంలో సరఫరా చేసిన బియ్యానికి సంబంధించి తెలంగాణకు బకాయి పెట్టిన రూ.1,468.94 కోట్లను వెంటనే విడుదల చేయాలని కేంద్ర మంత్రి ప్రహ్లాద్ జోషిని సీఎం, రాష్ట్ర మంత్రి కోరారు. నాడు అదనపు లెవీ సేకరణకు సంబంధించిన మొత్తాన్ని రాష్ట్ర ప్రభుత్వమే భరించిందని కేంద్ర మంత్రి దృష్టికి వారు తీసుకెళ్లారు. నాడు సేకరణకు తాము రుణం తీసుకున్నామని.. దానికి వడ్డీ రూ.2 వేల కోట్లకుపైగా పెరిగిందని తెలియజేశారు. ప్రధానమంత్రి గరీబ్ కళ్యాణ్ యోజన కింద 2021, మే నుంచి 2022, మార్చి వరకు సరఫరా చేసిన అదనపు బియ్యం, 2022 ఏప్రిల్ నెలలో సరఫరా చేసిన బియ్యానికి సంబంధించిన బకాయిలు రూ.343.27 కోట్లను విడుదల చేయాలని కేంద్ర మంత్రికి సీఎం, రాష్ట్ర మంత్రి విజ్ఞప్తి చేశారు. సమావేశంలో ఎంపీలు డాక్టర్ మల్లు రవి, సురేశ్ షెట్కార్, రాష్ట్ర పౌరసరఫరాల శాఖ అదనపు డైరెక్టర్ రోహిత్ సింగ్, కేంద్ర ప్రభుత్వ పథకాల సమన్వయకర్త డాక్టర్ గౌరవ్ ఉప్పల్ పాల్గొన్నారు.

# ఉద్యమకారులకు న్యాయం చేయాలి.. లేకపోతే వదలిపెట్టం: కవిత

- **వారిద్దరి పాలనలో ఉద్యమకారులు, అమరవీరులకు అన్యాయం**
- **సోయి లేని రేవంత్ సీఎం కావడం దురదృష్టం**
- **ఉద్యమకారుల బిడ్డలకు ప్రైవేట్ ఉద్యోగాల్లో 20 శాతం రిజర్వేషన్లు కల్పించాలి**
- **త్వరలోనే కొత్త రాజకీయ పార్టీ ఏర్పాటు**
- **ఉద్యమకారుల ఆత్మగౌరవ సభలో జాగృతి అధ్యక్షురాలు కవిత**

**ముద్ర, తెలంగాణ బ్యూరో :**

ముద్ర, తెలంగాణ బ్యూరో: తెలంగాణ ఏర్పాటు తర్వాత ఉద్యమకారులు, అమరవీరుల కుటుంబాలకు అన్యాయం జరిగిందని తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత ఆరోపించారు. ఉద్యమ సోయి లేని రేవంత్ రెడ్డి సీఎం కావడం దురదృష్టకరమని విమర్శించారు. హైదరాబాద్ బాగ్ లింగంపల్లిలో నిర్వహించిన ఉద్యమకారుల ఆత్మగౌరవ సభలో ఆమె మాట్లాడుతూ, కాంగ్రెస్ పార్టీ ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను రాబోయే బడ్జెట్‌లో అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఉద్యమకారుల బిడ్డలకు ప్రైవేట్ ఉద్యోగాల్లో 20 శాతం రిజర్వేషన్లు కల్పించాలని ఆమె కోరారు. హామీలు నెరవేర్చకపోతే కఠిన పోరాటానికి దిగుతామని హెచ్చరించారు. ప్రొఫెసర్ కోదండరాం, ఆకునూరి మురళి వంటి నేతలు ఈ విషయంపై స్పందించాలన్నారు. బీఆర్ఎస్ పాలనలో కూడా ఉద్యమకారులకు న్యాయం జరగలేదని కవిత పేర్కొన్నారు. తెలంగాణ అస్తిత్వాన్ని కాపాడేందుకు త్వరలోనే కొత్త రాజకీయ పార్టీ ఏర్పాటు చేయనున్నట్లు ప్రకటించారు. తెలంగాణ తత్వం అయిన సహనశీలత, మంచితనాన్ని కాపాడాలని పిలుపునిచ్చారు.




# జాహ్నవి కందుల కుటుంబానికి న్యాయం

- **రూ. 262 కోట్ల భారీ పరిహారం ప్రకటించిన అమెరికాలోని సియాటెల్ నగరం**



అమెరికా గడ్డపై పోలీస్ అధికారి నిర్లక్ష్యానికి బలైన తెలుగు విద్యార్థిని కందుల జాహ్నవి (23) కేసులో సంచలన తీర్పు వెలువడింది. మానవత్వాన్ని కించపరిచేలా వ్యవహరించిన సియాటెల్ పోలీస్ విభాగంపై సాగిన సుదీర్ఘ న్యాయపోరాటం ఎట్టకేలకు ఒక కొలిక్కి వచ్చింది. జాహ్నవి మృతికి నష్టపరిహారంగా 32 మిలియన్ డాలర్లు (సుమారు రూ. 262 కోట్లు) చెల్లించేందుకు సియాటెల్ నగర యంత్రాంగం అంగీకరించింది. అమెరికాలో పోలీస్ నిర్లక్ష్యం కారణంగా జరిగిన పౌర మరణాల్లో ఇది అత్యంత భారీ పరిహారాల్లో ఒకటిగా రికార్డు సృష్టించింది.

**విషాదం వెనుక అసలు కథ**

2023 జనవరిలో యూనివర్సిటీ ఆఫ్ వాషింగ్టన్‌లో మాస్టర్స్ చదువుతున్న కర్నూలు జిల్లాకు చెందిన జాహ్నవి కందుల రోడ్డు దాటుతుండగా పెట్రోలింగ్ కారు ఢీకొట్టింది. ఆ సమయంలో వాహనాన్ని నడుపుతున్న పోలీస్ అధికారి అత్యవసర కాల్‌కు స్పందిస్తూ గంటకు 120 కిలోమీటర్ల పైగా వేగంతో వెళ్తున్నట్లు దర్యాప్తులో తేలింది. ఈ ప్రమాదంలో జాహ్నవి అక్కడికక్కడే మృతి చెందింది.

**ప్రపంచాన్ని కుదిపేసిన బాడీ కామ్ వీడియో**

జాహ్నవి మృతి కంటే కూడా ఆ తర్వాత బయటకు వచ్చిన పోలీస్ అధికారి డేనియల్ అడరర్ బాడీ కెమెరా దృశ్యాలు ప్రపంచవ్యాప్తంగా ఆగ్రహాన్ని రేకెత్తించాయి. ఒక నిండు ప్రాణం పోయిందన్న బాధ లేకుండా తన సహచరుడితో మాట్లాడుతూ.. "ఆమె చనిపోయింది.. ఆమె ఒక సాధారణ వ్యక్తి. ఆమె ప్రాణానికి పెద్ద విలువ లేదు. ఒక 11 వేల డాలర్ల చెక్కు రాసి పారేస్తే సరిపోతుంది.. హహహ" అంటూ వెకిలిగా నవ్వుతూ అడరర్ చేసిన వ్యాఖ్యలు సభ్య సమాజాన్ని విస్మయానికి గురిచేశాయి. భారత ప్రభుత్వం ఈ ఉదంతాన్ని తీవ్రంగా పరిగణించి అమెరికా విదేశాంగ శాఖతో చర్చలు జరిపింది. సోషల్ మీడియాలో 'జస్టిస్ ఫర్ జాహ్నవి' హ్యాష్‌ట్యాగ్ అంతర్జాతీయ స్థాయిలో ట్రెండ్ అయ్యింది.

**న్యాయపోరాటంలో గెలుపు**

జాహ్నవి తల్లిదండ్రులు అమెరికన్ న్యాయవ్యవస్థలో రాజీలేని పోరాటం చేశారు. అధికారిపై క్రిమినల్ కేసులు నమోదు చేయడంలో కొన్ని సాంకేతిక ఇబ్బందులు ఎదురైనప్పటికీ సివిల్ లా సూట్ ద్వారా సియాటెల్ సిటీని బాధ్యులను చేయడంలో వారు విజయం సాధించారు. చివరకు రూ. 262 కోట్ల భారీ పరిహారాన్ని ప్రభుత్వం ప్రకటించింది. అమెరికాలో ఒక భారతీయ విద్యార్థి మృతికి లభించిన అత్యధిక పరిహారం ఇదే కావడం గమనార్హం.. ఈ కేసు నేపథ్యంలో సియాటెల్ పోలీస్ విభాగం తమ అత్యవసర వాహన వేగ నియంత్రణ నిబంధనలను సవరించింది. వివాదాస్పద వ్యాఖ్యలు చేసిన డేనియల్ అడరర్‌ను ఇప్పటికే విధుల నుంచి తొలగించారు.

**తల్లిదండ్రుల భావోద్వేగం**

"మా బిడ్డ ప్రాణం కంటే మాకు ఏదీ ముఖ్యం కాదు. ఈ డబ్బు ఆమెను తిరిగి తీసుకురాలేదు. కానీ ఒక భారతీయ అమ్మాయి ప్రాణానికి విలువ లేదన్న వారికి ఇది ఒక గట్టి సమాధానం. ఏ తల్లిదండ్రులకూ ఇలాంటి పరిస్థితి రాకూడదు " అని జాహ్నవి కుటుంబ సభ్యులు ఆవేదన వ్యక్తం చేశారు. కర్నూలు నుంచి ఎన్నో కలలతో అమెరికా వెళ్ళిన ఒక సామాన్య విద్యార్థిని ప్రాణాన్ని 'తక్కువ ధర' కట్టిన వారికి, అమెరికా చట్టాలే కోట్లలో జరిమానా విధించడం ఒక చారిత్రక పరిణామం. ఇది కేవలం ఒక కుటుంబానికి దక్కిన పరిహారం మాత్రమే కాదు.. విదేశాల్లో ఉంటున్న భారతీయుల ఆత్మగౌరవానికి దక్కిన విజయం.

# జగ్గారెడ్డి, అర్వింద్ పై కేసులు నమోదు

- **ఎన్నికల సిబ్బంది విధులకు ఆటంకం**
- **పోలీసులపై అనుచిత వ్యాఖ్యలపై చర్యలు**





**ముద్ర, తెలంగాణ బ్యూరో :**

ఈ నెల 11న మున్సిపల్ పోలింగ్ లో ఎన్నికల విధులు నిర్వర్తిస్తోన్న పోలీసులపై అనుచిత వ్యాఖ్యలు చేసిన టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గారెడ్డి, నిజామాబాద్ ఎంపీ ధర్మపురి అర్వింద్ పై ఆ శాఖ చర్యలు తీసుకున్నది. ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు వారిద్దరిపై గురువారం కేసులు నమోదు చేసింది. ఎన్నికల విధుల్లో ఉన్న సిబ్బందిని అడ్డుకోవడమే కాకుండా, వారి విధులకు తీవ్ర ఆటంకం కలిగించారనే ఆరోపణలతో కాంగ్రెస్ సీనియర్ నేత, మాజీ ఎమ్మెల్యే జగ్గారెడ్డిపై సంగారెడ్డి పోలీసులు బీఎస్ఎస్ యాక్ట్ 223, 351, 352, 132, 329 సెక్షన్ల కింద కేసు నమోదు చేసినట్లు వెల్లడించారు. 34వ వార్డులోని ఒక పోలింగ్ కేంద్రం వద్ద విధుల్లో ఉన్న పోలీసు అధికారులతో వాగ్వాదానికి దిగిన జగ్గారెడ్డి . అక్కడి సీఐ, కాంగ్రెస్ అభ్యర్థి పట్ల అనుచితంగా ప్రవర్తించారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ క్రమంలో ఎన్నికల సిబ్బందిని, పోలీసులను విధులు నిర్వర్తించకుండా అడ్డుకున్నారని అధికారులు ఎన్నికల సంఘానికి ఫిర్యాదు చేశారు. జిల్లా ఎన్నికల యంత్రాంగం నివేదికను పరిశీలించిన కేంద్ర ఎన్నికల సంఘం ఈ ఘటనను తీవ్రంగా పరిగణించింది. నిబంధనలను ఉల్లంఘించినందుకు, ప్రభుత్వ సిబ్బందిని భయభ్రాంతులకు గురిచేసినందుకు ఆయనపై వెంటనే కేసు నమోదు చేయాలని ఆదేశించింది. ఈ మేరకు సంగారెడ్డి పోలీసులు బీఎన్ఎస్ యాక్ట్‌లోని పలు సెక్షన్ల కింద కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు.

**నిజామాబాద్ ఎంపీపైనా మూడు సెక్షన్లు...**

నిజామాబాద్ పార్లమెంట్ సభ్యుడు ధర్మపురి అరవింద్‌పై పోలీసులు కేసు నమోదు చేశారు. హరిచరణ్ మార్వాడీ పాఠశాలలో ఏర్పాటు చేసిన పోలింగ్ కేంద్రంలో జరిగిన ఘటనను ఎలక్షన్ కమిషన్ సీరియస్‌గా తీసుకుంది. ఈ నేపథ్యంలో ఈ చర్యలు తీసుకున్నారు. పోలింగ్ విధుల్లో ఉన్న పోలీసులపై అనుచిత వ్యాఖ్యలు చేసినట్లు ఆరోపణలు రావడంతో 1 టౌన్ పోలీసులు కేసు నమోదు చేశారు. ఎస్సై గుర్రం నారాయణ, హెడ్ కానిస్టేబుల్ గోవర్ధన్, శ్రీనివాసులు ఇచ్చిన ఫిర్యాదు ఆధారంగా కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు. పోలింగ్ కేంద్రంలో విధులు నిర్వహిస్తున్న పోలీసులను, పోలింగ్ సిబ్బందిని పరుష పదజాలంతో దూషించినట్లు ఫిర్యాదులో పేర్కొన్నారు. అలాగే కెమెరాలతో పోలింగ్ కేంద్రంలోకి ప్రవేశించినట్లు ఆరోపణలు ఉన్నాయి. ఈ ఘటన నేపథ్యంలో భారతీయ న్యాయ సంహిత సెక్షన్లు 132, 223, 296(బి) కింద కేసులు నమోదు చేశారు. అదనంగా తెలంగాణ మున్సిపాలిటీ చట్టం-2019లోని సెక్షన్ 226 ప్రకారం కేసు నమోదు చేసినట్లు పోలీసులు వెల్లడించారు. ఘటనపై విచారణ కొనసాగుతోందని, అవసరమైన ఆధారాలను సేకరిస్తున్నట్లు అధికారులు తెలిపారు.

## గ్రామపంచాయతీలకు రూ.387 కోట్లు రిలీజ్

- **15వ ఆర్థిక సంఘ: నిధులు విడుదల చేసిన కేంద్రం**
- **పెండింగ్లో ఉన్న పనులకు, మౌలిక సదుపాయాల కల్పనకు ఊతం**

**ముద్ర, తెలంగాణ బ్యూరో :**

తెలంగాణ గ్రామపంచాయతీలకు కేంద్రం శుభవార్త అందించింది. వారం రోజుల క్రితం 15వ ఆర్థిక సంఘం నిధుల విడుదలలో భాగంగా తొలివిడతలో రూ.259.36 కోట్లు రిలీజ్ చేసిన కేంద్ర ప్రభుత్వం గురువారం మరో రూ.387 కోట్ల నిధులు విడుదల చేసింది. గ్రామ పంచాయతీ ఎన్నికలు ఆలస్యం కావడంతో.. 15వ ఆర్థిక సంఘం నిధుల విడుదల కూడా ఆలస్యమైంది. రెండు విడతల్లో కలిపి మొత్తం రూ.646.46 కోట్లను రిలీజ్ చేసింది. ఈ నిధులతో గ్రామ పంచాయతీల్లో పెండింగ్లో ఉన్న పనులకు, మౌలిక సదుపాయాల కల్పనకు ఊతం లభించనుంది. ఇంకా రూ.2400 కోట్ల నిధులు కేంద్రం నుంచి గ్రామపంచాయతీలకు రావలసి ఉంది. కాగా గ్రామాల్లో అభివృద్ధి కుంటుపడకుండా ఉండాలంటే కేంద్రం పెండింగ్‌లో ఉన్న నిధులను యుద్ధప్రాతిపదికన విడుదల చేయాలని రాష్ట్ర పంచాయతీశాఖ మంత్రి సీతక్క విజ్ఞప్తి చేశారు. కేంద్రం చెప్పిన నిబంధనలన్నీ రాష్ట్ర ప్రభుత్వం పాటించిందని, సకాలంలో ఫండ్స్ అందితేనే గ్రామాల రూపురేఖలు అభివృద్ధితో మారుతాయన్నారు.

# రాష్ట్రంలో 44వేలకు పైగా జర్నలిస్టులకు అక్రిడిటేషన్ కార్డులు

- **అక్రిడిటేషన్ ప్రక్రియ మరింత పారదర్శకంగా అర్హులందరికీ న్యాయం**
- **రాష్ట్ర రెవెన్యూ, హౌసింగ్, సమాచార పౌరసంబంధాల శాఖ మంత్రి శ్రీ పొంగులేటి శ్రీనివాసరెడ్డి**






**ముద్ర, హైదరాబాద్:**

రాష్ట్రంలో అర్హత కలిగిన ప్రతి జర్నలిస్టుకూ అక్రిడిటేషన్ కార్డు అందేలా ప్రభుత్వం కట్టుబడి ఉందని రాష్ట్ర రెవెన్యూ, హౌసింగ్, సమాచార పౌరసంబంధాల శాఖ మంత్రి శ్రీ పొంగులేటి శ్రీనివాసరెడ్డి తెలిపారు. జర్నలిస్టుల సంక్షేమం పట్ల ముఖ్యమంత్రి శ్రీ రేవంత్ రెడ్డిగారి నాయకత్వంలోని ప్రజా ప్రభుత్వం పూర్తి నిబద్ధతతో పనిచేస్తోందని పేర్కొన్నారు. అక్రిడిటేషన్ కార్డుల జారీ విధానం, అక్రిడిటేషన్ కమిటీ ఏర్పాటు తదితర అంశాలపై గురువారం సచివాలయంలోని తన కార్యాలయంలో సమాచార పౌరసంబంధాల శాఖ కమిషనర్ శ్రీమతి సిహెచ్. ప్రియాంక, ముఖ్యమంత్రి సిపిఆర్‌వో శ్రీ జి. మల్సూర్‌లతో మంత్రి సుదీర్ఘంగా చర్చించారు. ప్రక్రియ పారదర్శకంగా, వేగవంతంగా సాగేందుకు తీసుకోవాల్సిన చర్యలపై దిశానిర్దేశం చేశారు.

అక్రిడిటేషన్ కార్డుల జారీకి సంబంధించి ప్రభుత్వం ముందుగా జి.ఓ. 252 జారీ చేసినట్లు మంత్రి తెలిపారు. అనంతరం జర్నలిస్టు సంఘాలతో సమావేశమై వారి సూచనలు, అభిప్రాయాలను సవివరంగా పరిగణనలోకి తీసుకొని అవసరమైన సవరణలు చేసి జి.ఓ. 103ను జారీ చేసినట్లు వెల్లడించారు. ఈ సవరణల ద్వారా రాష్ట్రవ్యాప్తంగా ప్రింట్ మీడియా, ఎలక్ట్రానిక్ మీడియా మరియు డిజిటల్ మీడియా విభాగాల్లో మొత్తం 44,706 అక్రిడిటేషన్ కార్డులు పొందే అవకాశం కలుగుతుందని తెలిపారు.

గతంలో సుమారు 23 వేల మందికి మాత్రమే అక్రిడిటేషన్ కార్డులు ఉండగా, తాజా నిర్ణయంతో దాదాపు 21 వేలకు పైగా కార్డుల సంఖ్య పెరుగుతుందని మంత్రి వివరించారు.

2.50 లక్షల పైగా సర్క్యులేషన్ ఉన్న 8 పత్రికలకు 6,256 కార్డులు, 75 వేల నుండి 2.50 లక్షల వరకు సర్క్యులేషన్ ఉన్న24 పత్రికలకు 17,784 కార్డులు , 25001 నుంచి 75 వేల వరకు సర్క్యులేషన్ ఉన్న 30 పత్రికలకు 3,390, అదేవిధంగా 15001 నుంచి 25000 వరకు సర్క్యులేషన్ ఉన్న 169 చిన్న పత్రికలకు 11,661 , 15వేలలోపు సర్క్యులేషన్ ఉన్న 113 చిన్న పత్రికలకు 226, పీరియాడికల్‌స్‌కు 624, 20 న్యూస్ ఏజన్సీలకు 68 అక్రిడిటేషన్‌లు పొందుతాయని తెలిపారు.

అలాగే 21 శాటిలైట్ ఛానళ్లకు 4,431 కార్డులు, 8 జాతీయ ఛానల్‌స్‌కు 32, వంద లోకల్ కేబుల్ ఛానళ్లకు 200 ,డిజిటల్ మీడియా విభాగానికి 10 కార్డులు మొత్తంగా 44,706 కార్డులు కేటాయించినట్లు తెలిపారు. ఇందులో రాష్ట్ర మరియు జిల్లా స్థాయిలో 16,056, నియోజకవర్గ మరియు మండల స్థాయిలో 28,650 మంజూరు చేస్తున్నట్లు తెలిపారు.

అక్రిడిటేషన్ కార్డుల జారీ నిరంతర ప్రక్రియ అని, అవసరాన్ని బట్టి మరోసారి సమావేశమై తదుపరి చర్యలు తీసుకోవాలని నిర్ణయించినట్లు మంత్రి తెలిపారు. ప్రజాస్వామ్యంలో నాలుగో స్థంభంగా ఉన్న మీడియా ప్రతినిధుల గౌరవం, భద్రత, సంక్షేమం ప్రభుత్వానికి అత్యంత ప్రాధాన్యమని మంత్రి శ్రీ పొంగులేటి శ్రీనివాసరెడ్డి స్పష్టం చేశారు.

సమగ్ర సమాచార పత్రిక
ముద్ర
13.02.2026 శుక్రవారం, హైదరాబాద్
www.mudranews.in | @mudranews



**2026 ప్రస్తుత భారత్ బంద్ ( Feb 12, 2026)**

భారత్-అమెరికా వాణిజ్య ఒప్పందం మరియు కొత్త కార్మిక కోడ్స్‌కు వ్యతిరేకంగా నేడు (ఫిబ్రవరి 12) ఈ బంద్ జరుగుతోంది. సమ్యుక్త కిసాన్ మోర్చా మరియు ట్రేడ్ యూనియన్లు కలిసి రైతుల ప్రయోజనాలను కాపాడాలని ఈ నిరసన చేపట్టాయి.




# సార్వత్రిక సమ్మె విజయవంతం

**ముద్ర, కాప్రా :**

కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన నాలుగు లేబర్ కోడ్‌లను రద్దు చేయాలని, కార్మిక హక్కులను కాలరాస్తున్న మోదీ ప్రభుత్వ విధానాలను నిరసిస్తూ కేంద్ర కార్మిక సంఘాల పిలుపుమేరకు నిర్వహించిన దేశవ్యాప్త సార్వత్రిక సమ్మె కాప్రా ప్రాంతంలో విజయవంతమైంది. ఏఐటీయూసీ, సీఐటీయూ, ఐఎన్‌టీయూసీ, ఐఎఫ్‌టీయూ ఆధ్వర్యంలో నాచారం, చర్లపల్లి చౌరస్తా నుంచి ర్యాలీ ప్రారంభమై, పారిశ్రామిక వాడల్లో ద్విచక్ర వాహనాలపై నినాదాలు చేస్తూ పరిశ్రమలను బంద్ చేయించారు. ఈ సందర్భంగా ఏఐటీయూసీ పూర్వ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వి.ఎస్. బోస్ మాట్లాడుతూ, నూతన లేబర్ కోడ్‌ల వల్ల కార్మికుల ఉద్యోగ భద్రత, వేతన హక్కులు, సంఘటిత హక్కులు తీవ్రంగా దెబ్బతినే ప్రమాదం ఉందన్నారు. సంస్థలకు కార్మికులను సులభంగా తొలగించే అవకాశం పెరగడం, పని గంటలు పెరగడం, కనీస వేతనాల విషయంలో అనిశ్చితి ఏర్పడటం వంటి అంశాలు కార్మిక వర్గానికి ముప్పుగా మారతాయని తెలిపారు. ట్రేడ్ యూనియన్ హక్కులను బలహీనపరిచే ఈ చట్టాలు ప్రజాస్వామ్య హక్కులపై కూడా దాడి చేస్తున్నాయని విమర్శించారు. ఈ కార్యక్రమంలో సీపీఐ రాష్ట్ర సమితి సభ్యుడు కల్లూరు ధర్మేంద్ర, సీపీఐ ఉప్పల్ మండల కార్యదర్శి టి. సత్యప్రసాద్, సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు గణేష్, ఐఎన్‌టీయూసీ జిల్లా నేత ప్రకాశ్ రెడ్డి, ఐఎఫ్‌టీయూ నాయకురాలు అనురాధతోపాటు కార్మిక సంఘాల నేతలు గిరిబాబు, రాజ్‌కుమార్ పాల్గొన్నారు. సుమారు 100 మంది కార్మికులు సమ్మెలో భాగస్వాములయ్యారు.

**సమ్మెతో స్తంభించిన చర్లపల్లి**

చర్లపల్లి : కేంద్ర కార్మిక సంఘాల పిలుపుమేరకు గురువారం నిర్వహించిన దేశవ్యాప్త సార్వత్రిక సమ్మె చర్లపల్లి పారిశ్రామికవాడలో విస్తృత ప్రభావం చూపింది. వివిధ పరిశ్రమల కార్మికులు, కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులు, స్కీం వర్కర్లు పెద్దఎత్తున పాల్గొని నిరసన ర్యాలీలు చేపట్టారు. పలుచోట్ల పని నిలిపివేయడంతో పరిశ్రమల కార్యకలాపాలు స్తంభించాయి. ఈసందర్భంగా జరిగిన సమావేశంలో సీఐటీయూ రాష్ట్ర కమిటీ సభ్యుడు, మేడ్చల్ జిల్లా సహాయ కార్యదర్శి జి. శ్రీనివాసులు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన నాలుగు లేబర్ కోడ్‌లు కార్మిక హక్కులకు భంగం కలిగిస్తాయని విమర్శించారు. విద్యుత్ (సవరణ) బిల్లు2025, విబిజిరామ్‌జీ చట్టం, నూతన జాతీయ విత్తన చట్టం, ఇన్సూరెన్స్ రంగంలో వంద శాతం ఎఫ్‌డీఐ నిర్ణయాలను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వరంగ సంస్థలను ప్రైవేటీకరించవద్దని, కనీస వేతనం రూ.26వేలుగా నిర్ణయించాలని కోరారు. స్కీం వర్కర్లను కార్మికులుగా గుర్తించి హక్కులు కల్పించాలని, కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులను శాశ్వతీకరించాలని తెలిపారు. ఎంవీ యాక్ట్2019లో ఇబ్బందికర నిబంధనలు సవరించాలని డిమాండ్ చేశారు. "పోరాడితే పోయేదేమీ లేదు... బానిస సంకెళ్లు తప్ప" అంటూ కార్మికులు నినాదాలు చేశారు. సమ్మె శాంతియుతంగా కొనసాగినట్లు నాయకులు పేర్కొన్నారు. కార్యక్రమంలో చర్లపల్లి ఇండస్ట్రియల్ ఎంప్లాయీస్ యూనియన్ అధ్యక్షుడు బి.వి. సత్యనారాయణ తోపాటు వివిధ కార్మిక సంఘాల నాయకులు, పెద్ద సంఖ్యలో కార్మికులు పాల్గొన్నారు.

# గెలుపేవరిదో.. ఉత్కంఠకు నేడు తెర

- **జిల్లాలో ఆరు మున్సిపాలిటీల ఓట్ల లెక్కింపుకు ఏర్పాట్లు పూర్తి**

**ముద్ర ప్రతినిధి, ఉమ్మడి రంగారెడ్డి జిల్లా :**

మున్సిపల్ ఎన్నికల తుది ఘట్టానికి నేడు తెరపడనుంది. మంగళవారం పోలింగ్ ముగియగా, షెడ్యూల్ ప్రకారం శుక్రవారం ఓట్ల లెక్కింపు చేపట్టేందుకు అధికారులు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. జిల్లాలో ఈసారి కాంగ్రెస్, బీఆర్ఎస్, బీజేపీల మధ్య త్రిముఖ పోటీ నెలకొనడంతో ఫలితాలపై ఉత్కంఠ నెలకొంది. మరికొన్ని గంటల్లోనే గెలుపు ఎవరిదో తేలనుంది. ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు ఎన్నికలు జరిగిన ఆరు మున్సిపాలిటీల్లో కౌంటింగ్ కేంద్రాలు ఏర్పాటు చేశారు. పోలింగ్ అనంతరం బ్యాలెట్ పెట్టెలను భద్రపరిచి, ఆయా కేంద్రాలకు తరలించారు. ఓట్ల లెక్కింపు సజావుగా సాగేందుకు మొత్తం 265 మంది అధికారులు, సిబ్బందిని నియమించారు. ఇందులో పర్యవేక్షక అధికారులు, లెక్కింపు సిబ్బంది ఉన్నారు. అదనంగా అవసరమైతే వినియోగించేందుకు సిబ్బందిని సిద్ధంగా ఉంచారు. జిల్లాలోని ఆమనగల్, చేవెళ్ల, ఇబ్రహీంపట్నం, మొయినాబాద్, షాద్‌నగర్, శంకర్‌పల్లి మున్సిపాలిటీల పరిధిలోని 126 వార్డుల్లో మొత్తం 1,39,044 ఓట్లు నమోదయ్యాయి. వీటి లెక్కింపుకు 63 టేబుళ్లు ఏర్పాటు చేశారు. ఆయా మున్సిపాలిటీల్లో గుర్తించిన కేంద్రాల్లో కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్ల మధ్య లెక్కింపు నిర్వహించనున్నారు. ప్రతి మున్సిపాలిటీలో వార్డుల సంఖ్యకు అనుగుణంగా టేబుళ్లను కేటాయించారు. ఫలితాల ప్రకటనతో స్థానిక రాజకీయాల్లో ఆధిపత్యం ఎవరికో స్పష్టత రానుంది. ఎన్నికల ప్రక్రియ ప్రశాంతంగా ముగియడంతో, లెక్కింపు కూడా అదే విధంగా సాగేందుకు అధికారులు చర్యలు చేపట్టారు.

# అగ్ని ప్రమాదాల నివారణకు కట్టుదిట్టమైన చర్యలు

- **మార్చి నుంచి హైడ్రా తనిఖీలు ముమ్మరం**

**ముద్ర, హైదరాబాద్ :**

అగ్ని ప్రమాదాల నివారణకు ప్రతి ఒక్కరూ జాగ్రత్తలు పాటించాలని హైడ్రా కమిషనర్ ఏ.వి.రంగనాథ్ పిలుపునిచ్చారు. వేసవి కాలం సమీపిస్తున్న నేపథ్యంలో అగ్ని మాపక నిబంధనలను కచ్చితంగా అమలు చేయాలని సూచించారు. నగరంలో జరిగిన అనేక అగ్ని ప్రమాదాలకు నిబంధనలు పాటించకపోవడమే ప్రధాన కారణమని పేర్కొన్నారు. పాతబస్తీలో నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో చార్మినార్ ఎమ్మెల్యే జుల్ఫికర్ అలీతో కలిసి ఆయన మాట్లాడారు. జనవరి నెలాఖరులో నిర్వహించిన తనిఖీల్లో నిబంధనలు ఉల్లంఘించిన తొమ్మిది దుకాణాలను సీజ్ చేసినట్లు తెలిపారు. వ్యాపార సంఘాల విజ్ఞప్తి మేరకు ఒక నెల గడువు ఇచ్చామని, మార్చి రెండో వారం నుంచి తనిఖీలు ముమ్మరం చేస్తామని స్పష్టం చేశారు. నిబంధనలు పాటించని వ్యాపార సముదాయాలు, దుకాణాలపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. తనిఖీలు వేధింపుల కోసం కాదని, ప్రజల భద్రత కోసం చేపడుతున్న చర్యలేనని కమిషనర్ వివరించారు. వ్యాపారులు అగ్ని మాపక పరికరాలు ఏర్పాటు చేసుకోవాలని, నిల్వ చేసిన సరుకుల విషయంలో అప్రమత్తంగా ఉండాలని సూచించారు. గత అగ్ని ప్రమాదాల దృశ్యాలు, రక్షణ చర్యల వివరాలను ప్రదర్శించారు. ఈ కార్యక్రమంలో అదనపు డైరెక్టర్ వర్ల పాపయ్య, ప్రాంతీయ అటవీ అధికారి జయప్రకాశ్, జిల్లా అటవీ అధికారులు యజ్ఞనారాయణ, వెంకన్న, విద్యుత్ శాఖ అధికారి ఏ.వి. రామారావు, నగర ప్రణాళిక అధికారి శ్రీనివాస్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# జైల్లో దాదాపు చూపు కోల్పోయిన ఇమ్రాన్ ఖాన్

- **జైలు పరిస్థితులపై సుప్రీం కోర్టు ఆందోళన**

**ముద్ర,న్యూస్:**

పాకిస్థాన్ మాజీ ప్రధాని ఇమ్రాన్ ఖాన్ ఆరోగ్య పరిస్థితి మరోసారి చర్చనీయాంశంగా మారింది. ప్రస్తుతం రావల్పిండిలోని అదియాలా జైలులో పలు కేసుల్లో శిక్ష అనుభవిస్తున్న ఆయన కంటి చూపు గణనీయంగా తగ్గిందన్న సమాచారం ఆందోళన కలిగిస్తోంది. జైలు అధికారుల నిర్లక్ష్య వైఖరే దీనికి కారణమని ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి.

**85 శాతం చూపు కోల్పోయినట్లు ఆరోపణ**

సుప్రీం కోర్టు నియమించిన న్యాయవాది (అమికస్ క్యూరీ) ఇటీవల జైలులో ఇమ్రాన్ ఖాన్‌ను కలిసి ఆయన ఆరోగ్య పరిస్థితిపై సమగ్ర నివేదిక సమర్పించారు. ఆ నివేదిక ప్రకారం, మూడు నుంచి నాలుగు నెలల క్రితం వరకు తన కుడి కన్ను చూపు సరిగ్గానే ఉందని, ఆ తర్వాత మసకబారడం ప్రారంభమైందని ఇమ్రాన్ వెల్లడించారు. సమస్యను జైలు ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లినా సరైన వైద్య పరీక్షలు నిర్వహించలేదని ఆయన పేర్కొన్నారు. ప్రస్తుతం తన కుడి కన్నులో సుమారు 85 శాతం చూపు కోల్పోయినట్లు న్యాయవాదితో తెలిపారు.

**ఏకాంత నిర్బంధమే కారణమా?**

రెండున్నరేళ్లుగా జైలులో ఒంటరిగా గదిలో ఉంచడంతో మానసికంగా, శారీరకంగా తీవ్ర ప్రభావం పడిందని నివేదికలో ప్రస్తావించారు. సకాలంలో వైద్య సేవలు అందించకపోవడం, కుటుంబ సభ్యులను కలిసే అవకాశం ఇవ్వకపోవడం వంటి అంశాలు పరిస్థితిని మరింత విషమం చేశాయని ఆరోపణలు ఉన్నాయి.

**కోర్టు ఆదేశాలు**

ఈ నివేదికపై స్పందించిన పాకిస్థాన్ సుప్రీం కోర్టు, ఇమ్రాన్ ఖాన్‌కు వెంటనే సమగ్ర వైద్య పరీక్షలు నిర్వహించాలని జైలు అధికారులను ఆదేశించింది. ఆయన ఆరోగ్యంపై పూర్తి నివేదిక సమర్పించాలని కూడా సూచించింది.

**రాజకీయ ప్రభావం?**

ఇమ్రాన్ ఖాన్ ఆరోగ్య సమస్యలు దేశ రాజకీయాల్లో కొత్త చర్చకు దారితీసే అవకాశముంది. ఆయన పార్టీ అయిన పాకిస్థాన్ తహ్రీక్‌ఇఇన్సాఫ్



(PTI) ఇప్పటికే జైలు పరిస్థితులపై తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తోంది. ప్రభుత్వం మాత్రం అన్ని ఆరోపణలను ఖండిస్తున్నట్లు సమాచారం. ఇకపై కోర్టు ఆదేశాల అమలు ఎలా ఉంటుందన్నది, ఇమ్రాన్ ఖాన్ ఆరోగ్య పరిస్థితి ఎలా మారుతుందన్నది ఆసక్తికరంగా మారింది. పాకిస్థాన్ రాజకీయాల్లో ఈ పరిణామాలు మరింత ఉద్రిక్తతకు దారితీయవచ్చని విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు.

# బాలికలను కరిచిన ఎలుకలు..

- **ఏపీలో అమానుష ఘటన**

**ముద్ర, తెలంగాణ బ్యూరో:**

ముద్ర , ఎన్టీఆర్ జిల్లా : బాలికలను ఎలుకలు కరిచిన అమానుష సంఘటన ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని ఎన్టీఆర్ జిల్లా ఎ.కొండూరు మండల కేంద్రంలోని కస్తూర్బా గాంధీ బాలికా విద్యాలయంలో బుధవారం రాత్రి జరిగింది. గురువారం విషయం వెలుగు చూడగా విద్యాలయ అధికారులు గోప్యంగా ఉంచారు. బాధిత బాలికలకు అనారోగ్య సమస్య తలెత్తకుండా చికిత్స చేయించేందుకు ఎ.కొండూరు పీహెచ్‌సీకి తరలించడంతో విషయం బయటకు వచ్చింది. సమాచారం అందగానే తహసీల్దార్ ఎన్. అరవింద్, ఎంపీడీవో బి.శ్రీనివాసరావు, జీసీడీవో బి.విశ్వభారతి కేజీబీవీకి చేరుకొని విచారించి బాలికల నుంచి వాగ్మూలం తీసుకున్నారు.



అధికారుల వివరాల మేరకు.. బుధవారం రాత్రి డార్మెటరీలో నిద్రిస్తున్నప్పుడు 7వ తరగతి చదువుతున్న కావూరి కళావతి, చిమటా లక్ష్మీప్రసన్న, మాల్లాది శ్యామల, కె.శ్రీవర్షిత, బి.దీవెన, టి.కీర్తి, ఎస్. నవ్యశ్రీ, పి.ప్రణతి, ఎం.రజని, వి.స్నేహ తదితర 12 మంది బాలికలను ఎలుకలు కరిచాయి. సమాచారం జిల్లా ఉన్నతాధికారులకు చేరడంతో మండల స్థాయి అధికారులు అప్రమత్తమై కేజీబీవీకి చేరుకుని విచారించి స్థానిక పీహెచ్‌సీకి తరలించి వైద్యం చేయించారు. డార్మెటరీకి ఉన్న కిటికీల నుంచి ఎలుకలు లోపలకు ప్రవేశించి బాలికలను కరిచాయి. సత్వర చికిత్స అందించేందుకు ఏడాదిగా విద్యాలయంలో ఏఎన్ఎం పోస్టు ఖాళీగా ఉంది.

# చేవెళ్లలో పెండింగ్ రైల్వే వంతెనలు పూర్తి చేయాలి : ఎంపీ

**ముద్ర, వికారాబాద్ జిల్లా ప్రతినిధి :**

చేవెళ్ల పార్లమెంటు నియోజకవర్గ పరిధిలో పెండింగ్‌లో ఉన్న రైల్వే పైవంతెనలు, దిగువ వంతెనల నిర్మాణ పనులను తక్షణమే ప్రారంభించాలని చేవెళ్ల ఎంపీ కొండా విశ్వేశ్వర్ రెడ్డి రైల్వే శాఖ సహాయ మంత్రి సోమన్నను కోరారు. న్యూఢిల్లీలోని రైలు భవన్‌లో జరిగిన సమావేశంలో ఆయన ఈ అంశాలను ప్రస్తావించారు. గతంలో కేంద్ర రైల్వే మంత్రి అశ్విని వైష్ణవ్‌కు కూడా వినతిపత్రం సమర్పించినట్లు తెలిపారు. బషీరాబాద్ మండలం నవాంద్గి రైల్వే స్టేషన్‌లో హుబ్లీ ఎక్స్‌ప్రెస్ రైలుకు నిలుపుదల కల్పించేందుకు దక్షిణ మధ్య రైల్వే ప్రధాన నిర్వాహక అధికారి సానుకూల ప్రతిపాదన పంపినట్లు తెలిపారు. దీనిపై రైల్వే బోర్డు తక్షణ చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. వికారాబాద్ పట్టణంలోని జిల్లా కోర్టు సమీపం, ఇంద్రానగర్ ప్రాంతాల్లోని రైల్వే స్థాయి దాటివేత గేట్ల వద్ద వివరణాత్మక ప్రాజెక్టు నివేదికలు సిద్ధమైన నేపథ్యంలోవాటి నిర్మాణాన్ని ప్రారంభించాలని కోరారు. అదేవిధంగా కొండకల్, ముబారక్‌పూర్, మర్పల్లి, పాత శంకర్‌పల్లి, మొరంగపల్లి, వనంపల్లి గేట్, గొల్లగూడ, నావంద్గి, సిద్దాంతి, శాతంరాయి, ఫతేపూర్ ప్రాంతాల్లో రైల్వే లైన్ క్రింద రహదారి సదుపాయాల (ఎల్‌హెచ్‌ఎస్) నిర్మాణానికి అవసరమైన అనుమతులు



మంజూరు చేసి పనులు ప్రారంభించాలని ఎంపీ కోరారు. ఈ అంశాలపై రైల్వే శాఖ సహాయ మంత్రి సానుకూలంగా స్పందించినట్లు ఆయన ఒక ప్రకటనలో తెలిపారు.

# రూ. 2200 కోట్ల ఆస్తిని కాపాడిన హైడ్రా

- **మొండికుంటలో ఆక్రమణల తొలగింపు**

**ముద్ర, హైదరాబాద్ :**

మాధాపూర్ హైటెక్స్ ప్రదర్శన కేంద్రం సమీపంలోని మొండికుంట చెరువు పరిసరాల్లో హైడ్రా గురువారం విస్తృత స్థాయి చర్యలు చేపట్టింది. రంగారెడ్డి జిల్లా శేరిలింగంపల్లి మండలం ఖానామెట్ గ్రామంలోని సర్వే నంబరు 53లోని మొండికుంటతో పాటు సర్వే నంబరు 55లో ఉన్న ప్రభుత్వ భూమిలో ఆక్రమణలను తొలగించింది. మొత్తం 11 ఎకరాల భూమిని స్వాధీనం చేసుకుని సుమారు రూ. 2200కోట్ల విలువైన ప్రభుత్వ ఆస్తిని రక్షించినట్లు అధికారులు తెలిపారు. చెరువు చుట్టూ కంచె ఏర్పాటు చేసి భద్రత చర్యలు ప్రారంభించారు. అధికారుల విచారణలో చెరువు పూర్తి ట్యాంక్ స్థాయి(ఎఫ్‌టీఎల్) పరిధిలో ఆలయాన్ని హద్దుగా చూపిస్తూ పలువురు ఆక్రమణలకు పాల్పడినట్లు తేలింది. అక్కడ 30కు పైగా దుకాణాలు, మెకానిక్ షెడ్లు, ఇనుము-ఉక్కు దుకాణాలు ఏర్పాటు చేసి నెలకు లక్షల రూపాయల అద్దెలు వసూలు చేస్తున్నట్లు గుర్తించారు. జనవరి 31న రెవెన్యూ అధికారులతో సమావేశం నిర్వహించి, ఉపగ్రహ చిత్రాల ఆధారంగా ఆక్రమణలు జరిగినట్టు నిర్ధారించిన అనంతరం నిర్వాసితులకు గడువు ఇచ్చి, గురువారం భారీ భద్రత మధ్య తొలగింపు చర్యలు చేపట్టారు. ఆక్రమణలు తొలగించిన నేపథ్యంలో స్థానికులు హైడ్రా చర్యలను అభినందించారు. స్వాధీనం చేసుకున్న భూమిలో పార్కులు అభివృద్ధి చేయడంతో పాటు చెరువును సుందరీకరించాలని వారు అధికారులను కోరారు.

# కమ్యూనిటీ పోలీసింగ్' ద్వారా ప్రజలతో మమేకం : సైబరాబాద్ సీపీ

**ముద్ర, శేరిలింగంపల్లి :**

సైబరాబాద్ పోలీసు కమిషనరేట్ 24వ ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకుని పోలీసు కమిషనర్ డాక్టర్ ఎం.రమేష్ జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు. ఈసందర్భంగా పోలీసు అధికారులు, సిబ్బందికి శుభాకాంక్షలు తెలిపారు. 2003లో స్థాపితమైన సైబరాబాద్ కమిషనరేట్ వేగంగా అభివృద్ధి చెందుతున్న పట్టణ ప్రాంతానికి సమర్థవంతమైన సేవలు అందిస్తున్నదన్నారు. ప్రాంత అభివృద్ధిలో పోలీసుల కృషి కీలకమని, ప్రజాసేవకు మరింత అంకితభావంతో పనిచేయాలని పిలుపునిచ్చారు. సాంకేతికత ఆధారిత ఆధునిక పోలీసింగ్‌లో సైబరాబాద్ కమిషనరేట్ దేశ, అంతర్జాతీయ స్థాయిలో గుర్తింపు పొందిందని సీపీ తెలిపారు. నియంత్రణపర్యవేక్షణ వ్యవస్థలు, సైబర్ నేరాల దర్యాప్తు, ట్రాఫిక్ నిర్వహణ, సమాజ పోలీసింగ్, ప్రజావ్యక్తిగత భాగస్వామ్య కార్యక్రమాల ద్వారా ఆదర్శంగా నిలిచిందన్నారు. నగర విస్తరణ నేపథ్యంలో కేంద్ర పట్టణ ప్రాంతాన్ని మూడు జోన్లుగా విభజించి, పోలీసు స్టేషన్లను మున్సిపల్ వార్డులతో అనుసంధానం చేస్తున్నట్లు వెల్లడించారు. సైబర్ నేరాలు, రహదారి ప్రమాదాలు ప్రధాన సవాళ్లుగా ఉన్నాయని సీపీ అన్నారు. పెరుగుతున్న జనాభాకు అనుగుణంగా భద్రతా వ్యవస్థను మరింత బలోపేతం చేస్తామని తెలిపారు. వలస కార్మికుల భద్రత, సంక్షేమంపై ప్రత్యేక దృష్టి సారిస్తున్నామని, సేవా కార్యక్రమాల ద్వారా ప్రజలతో అనుబంధాన్ని పెంపొందిస్తామని చెప్పారు. కార్యక్రమంలో భాగంగా సీపీ ఆఫీసు ప్రాంగణంలో సీపీ మొక్క నాటారు. అనంతరం ధీర, వీర, ధృవ, భీమ, రాఖీ, తేజ, మౌని, లైకా పోలీసు జాగిలాల గౌరవ వందనం సమర్పించాయి. ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ ఆధ్వర్యంలో సీపీ కార్యాలయ ఆవరణలో ఏర్పాటు చేసిన రక్తదాన శిబిరంలో పోలీసు సిబ్బంది స్వచ్ఛందంగా రక్తదానం చేశారు. ఫార్మేషన్ డే సందర్భంగా నార్సింగి సైకిల్ ట్రాక్ పై ప్రజలతో కలిసి పోలీసులు ప్రజలతో కలిసి సైక్లింగ్ చేశారు.





సమగ్ర సమాచార పత్రిక
ముద్ర
13.02.2026 శుక్రవారం, హైదరాబాద్
www.mudranews.in | @mudranews



### టాలీవుడ్ బంద్



నిర్మాణ వ్యయాల నియంత్రణ, ఓటిటి విడుదలపై నిబంధనలపై 2022, ఆగస్టు 1వ తేదీ నుండి సుమారు మూడు వారాల పాటు (ఆగస్టు 21 వరకు) టాలీవుడ్ షూటింగ్‌లు పూర్తిగా నిలిపివేయబడ్డాయి. యాక్టివ్ తెలుగు ఫిల్మ్ ప్రొడ్యూసర్స్ గిల్డ్, తెలుగు ఫిల్మ్ ఛాంబర్ ఆఫ్ కామర్స్ సంయుక్తంగా ఈ నిర్ణయం తీసుకున్నాయి.

# అఫ్ఘనిస్థాన్‌కు వరుస షాక్‌లు



- నబీపై ఐసీసీ జరిమానా..

ముద్ర. స్పోర్ట్స్ డెస్క్

టీ20 ప్రపంచకప్‌లో విజయానికి ఎదురుచూస్తున్న అఫ్ఘనిస్థాన్‌కు మరో ఎదురుదెబ్బ తగిలింది. దక్షిణాఫ్రికాతో జరిగిన ఉత్కంఠభరిత మ్యాచ్‌లో రెండో సూపర్ ఓవర్ వరకు పోరాడినా ఓటమి చవిచూసిన కాబూల్ జట్టుకు ఇప్పుడు క్రమశిక్షణ చర్యల రూపంలో షాక్ ఎదురైంది. సీనియర్ ఆల్‌రౌండర్ మొహమ్మద్ నబీపై ఐసీసీ జరిమానా విధించింది. మ్యాచ్ సందర్భంగా అంపైర్ నిర్ణయంపై అసంతృప్తి వ్యక్తం చేసినందుకు ఆయనపై లెవల్–1 నిబంధనల ఉల్లంఘన కింద చర్యలు తీసుకున్నారు.

సఫారీలతో మ్యాచ్‌లో 14వ ఓవర్ సమయంలో ప్రత్యర్థి బౌలర్ ఎంగిడి ధరించిన చేతి బ్యాండ్‌పై అభ్యంతరం వ్యక్తం చేస్తూ నబీ అంపైర్‌తో వాగ్వాదానికి దిగినట్లు రిఫరీ నివేదికలో పేర్కొన్నారు. అనంతరం క్రమశిక్షణ కమిటీ విచారణ జరిపి మ్యాచ్ ఫీజులో 15 శాతం కోతతో పాటు ఒక డీమెరిట్ పాయింట్ విధించింది. నబీ తన తప్పును అంగీకరించినట్లు సమాచారం.

**గుర్బాజ్ పోరాటం వృథా**

మ్యాచ్ పరంగా అఫ్గనిస్థాన్ గట్టి పోరాటమే చేసింది. 187 పరుగుల లక్ష్యాన్ని ఛేదించేందుకు దిగిన జట్టుకు రహ్మనుల్లా గుర్బాజ్ మెరుపు ఇన్నింగ్స్‌తో ఊపిరి పోశాడు. స్కోరు సమం చేయడంతో మ్యాచ్ సూపర్ ఓవర్‌కు దారి తీసింది. తొలి సూపర్ ఓవర్‌లోనూ తేడా రాకపోవడంతో రెండో సూపర్ ఓవర్ నిర్వహించగా, అక్కడే అఫ్గనిస్థాన్ తడబాటుకు గురైంది. కీలక దశలో వికెట్ కోల్పోవడంతో విజయం చేజారింది. వరుసగా రెండు ఓటములతో రషీద్ ఖాన్ బృందం సూపర్–8 అవకాశాలు క్లిష్టంగా మారాయి.

# టీ20 ప్రపంచకప్‌లో ఇటలీ సంచలనం..
# నేపాల్‌కు గట్టి షాక్

ముద్ర. స్పోర్ట్స్ డెస్క్

పొట్టి ప్రపంచకప్‌లో కొత్త చరిత్ర నమోదైంది. అరంగేట్రం చేసిన ఇటలీ జట్టు తొలి మ్యాచ్‌లోనే ఘన విజయం సాధించి అందరి దృష్టిని ఆకర్షించింది. గత మ్యాచ్‌లో ఇంగ్లండ్‌ను ఇబ్బందిపెట్టిన నేపాల్‌ను ఈసారి ఇటలీ పూర్తిగా అదుపులో పెట్టింది. ముంబై వాంఖడే స్టేడియంలో జరిగిన గ్రూప్–సీ పోరులో ఆల్‌రౌండ్ ప్రదర్శనతో 124 పరుగుల లక్ష్యాన్ని సునాయాసంగా ఛేదించింది.

ముందుగా బౌలింగ్‌లో కృష్ణన్ కలుగమగే (3/18), బెన్ మనేటి (2/9)లు చెలరేగడంతో నేపాల్ 123 పరుగులకే కుప్పకూలింది. రోహిత్ పౌడెల్ (23), దీపేంద్ర సింగ్ ఐరీ (17)లను త్వరగా ఔట్ చేసి ఒత్తిడి పెంచారు. అనంతరం ఛేదనలో ఓపెనర్లు జస్టిన్ మొస్కా (60 నాటౌట్), ఆంథోని మొస్కా (62 నాటౌట్)లు అదిరిపోయే భాగస్వామ్యంతో మ్యాచ్‌ను ఏకపక్షంగా మార్చేశారు. 124 పరుగుల అజేయ భాగస్వామ్యంతో లక్ష్యాన్ని వికెట్ నష్టపోకుండా చేరుకుని రికార్డు సృష్టించారు. కలుగమగే ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్‌గా ఎంపికయ్యాడు.



# 41 ఏళ్ల నదీమ్ సంచలనం..
# టీ20 ప్రపంచకప్‌లో అరుదైన రికార్డు

ముద్ర. స్పోర్ట్స్ డెస్క్



టీ20 ప్రపంచకప్ వేదికగా చిన్న జట్లు ధైర్యంగా పోరాడుతూ పెద్ద జట్లకు సవాల్ విసురుతున్నాయి. ఈ నేపథ్యంలో ఒమన్ సీనియర్ బ్యాటర్ మొహమ్మద్ నదీమ్ అరుదైన ఘనత సాధించాడు. గ్రూప్‌బీ మ్యాచ్‌లో శ్రీలంకపై అద్భుతంగా ఆడిన నదీమ్, టీ20 వరల్డ్‌కప్ చరిత్రలో అర్ధశతకం నమోదు చేసిన అత్యంత వయసున్న ఆటగాడిగా నిలిచాడు. 41 ఏళ్ల 161 రోజుల వయసులో హాఫ్ సెంచరీ సాధించి కొత్త మైలురాయిని నెలకొల్పాడు.

ఈ క్రమంలో ఆయన శ్రీలంక దిగ్గజం సనత్ జయసూర్య రికార్డును అధిగమించాడు. 2009లో జయసూర్య 39 ఏళ్ల 345 రోజుల వయసులో అర్ధశతకం సాధించగా, ఇప్పుడు ఆ రికార్డు నదీమ్ పేరిట మారింది. శ్రీలంకతో జరిగిన మ్యాచ్‌లో ఒమన్ వికెట్లు వరుసగా పడుతున్నా, నదీమ్ మాత్రం స్థిరంగా నిలిచి అజేయంగా 53 పరుగులు సాధించాడు.

**లంక దెబ్బకు ఒమన్ కుదేలు**

మ్యాచ్ విషయానికి వస్తే శ్రీలంక బ్యాటర్లు దూకుడుగా ఆడి 225 పరుగుల భారీ స్కోరు నమోదు చేశారు. లక్ష్య ఛేదనలో ఒమన్ బలహీనపడింది. మహీష్ థీక్షణ, దుష్మంత చమీర తమ బౌలింగ్‌తో ఒమన్ బ్యాటింగ్‌ను కుదేలు చేశారు. నదీమ్ (53 నాటౌట్), వసీం అలీ (27) తప్ప మిగతా బ్యాటర్లు విఫలమవడంతో జట్టు 120 పరుగులకే పరిమితమైంది. 105 పరుగుల తేడాతో విజయం సాధించిన శ్రీలంక గ్రూప్‌బీలో అగ్రస్థానాన్ని దక్కించుకుంది.

# ఇషాన్ కిషన్ మెరుపులు..
# నమీబియాపై భారత్ దూకుడు

ముద్ర. స్పోర్ట్స్ డెస్క్

టీ20 ప్రపంచకప్ వేదికగా ఇషాన్ కిషన్ తుఫాన్ ఇన్నింగ్స్‌తో స్టేడియాన్ని ఉర్రూతలూగించాడు. అరుణ్ జైట్లీ మైదానంలో నమీబియా బౌలర్లపై దాడి ప్రారంభించిన ఈ ఎడమచేతి ఓపెనర్ కేవలం 20 బంతుల్లోనే అర్ధశతకం నమోదు చేశాడు. పవర్‌ప్లే చివరి ఓవర్లో వరుస సిక్సర్లతో మ్యాచ్ గమనాన్ని పూర్తిగా మార్చేశాడు. 24 బంతుల్లో 61 పరుగులు చేశాడు. అతని దూకుడుతో భారత్ ఆరు ఓవర్లకే 86 పరుగులు చేసి, వెంటనే వంద మార్క్‌ను కూడా అందుకుంది.

సంజూ శాంసన్ త్వరగా ఔటైనా, ఇషాన్ మాత్రం దూకుడును తగ్గించలేదు. స్మిట్ వేసిన ఓవర్లో వరుసగా నాలుగు సిక్సర్లు బాది ప్రత్యర్థి శిబిరంలో ఆందోళన రేపాడు. తరువాత తిలక్ వర్మతో కలిసి స్కోరు వేగాన్ని కొనసాగించాడు. అయితే ప్రమాదకరంగా మారుతున్న ఇషాన్‌ను కెప్టెన్ ఎరాస్మస్ అవుట్ చేయడంతో నమీబియా కొంత ఉపశమనం పొందింది. 10 ఓవర్లకు భారత్ రెండు వికెట్ల నష్టానికి 120 పరుగులు చేసి బలమైన స్థితిలో నిలిచింది.అయితే తర్వాత హార్దిక్ పాండ్యా 2 బంతుల్లోనే 52 పరుగులు చేసి స్కోరు వేగాన్ని పెంచాడు. శివం దూబే 23 పరుగులతో సహకారం అందించాడు. హార్దిక్ అవుటయ్యాక వరుసగా వికెట్లు పడడంతో 250 దాటుతుందనుకున్న స్కోరు నిర్ణీత 20 ఓవర్లలో 209-9కి టీమిండియా పరిమితమైంది.



# అసెంబ్లీ ఎన్నికల ప్రభావం..
# ఐపీఎల్ షెడ్యూల్‌పై బీసీసీఐ మౌనం

ముద్ర. స్పోర్ట్స్ డెస్క్



ఇండియన్ ప్రీమియర్ లీగ్ 19వ సీజన్ వేలం ముగిసి రెండు నెలలు దాటినా ఇప్పటివరకు టోర్నీ షెడ్యూల్ విడుదల కాలేదు. సాధారణంగా ఈ సమయానికి మ్యాచ్‌ల తేదీలు ప్రకటించాల్సి ఉండగా, బీసీసీఐ నుంచి ఎలాంటి అధికారిక ప్రకటన రాలేదు. ఆనవాయితీ ప్రకారం మార్చి నుంచి మే మధ్య టోర్నీ నిర్వహించే అవకాశమున్నప్పటికీ, ప్రస్తుత పరిస్థితుల్లో స్పష్టత లేకపోవడం చర్చనీయాంశంగా మారింది.

ఈ ఆలస్యానికి అసెంబ్లీ ఎన్నికలే కారణమని సమాచారం. బెంగాల్, తమిళనాడు, అస్సాంలో త్వరలో ఎన్నికలు జరగనున్న నేపథ్యంలో భద్రతా ఏర్పాట్లపై అనిశ్చితి నెలకొంది. ఎన్నికల సమయంలో పోలీసులు విధుల్లో నిమగ్నమవుతారని, అదే తేదీల్లో మ్యాచ్‌లు ఉంటే వేదికల మార్పులు చేయాల్సి వస్తుందని బీసీసీఐ వర్గాలు చెబుతున్నాయి. ఎన్నికల షెడ్యూల్‌పై పూర్తి స్పష్టత వచ్చిన తర్వాతే ఐపీఎల్ తేదీలను ఖరారు చేస్తామని అధికారులు పేర్కొన్నట్లు తెలుస్తోంది. అవసరమైతే టోర్నీని రెండు దశలుగా నిర్వహించే అవకాశాన్ని కూడా పరిశీలిస్తున్నారని సమాచారం. గత సీజన్‌లో RCB ఛాంపియన్‌గా నిలిచిన విషయం తెలిసిందే.



# చిన్న జట్ల సవాల్..
# ప్రపంచకప్‌కు కొత్త ఊపు

ముద్ర. స్పోర్ట్స్ డెస్క్

టీ20 ప్రపంచకప్‌లో అసోసియేట్ దేశాలు కేవలం పాల్గొనడానికే వచ్చాయనుకున్నవారికి ఈసారి గట్టి సమాధానం లభిస్తోంది. మొత్తం 20 జట్లలో పది చిన్న దేశాలే ఉన్నప్పటికీ, మైదానంలో వారు చూపిస్తున్న పోరాటస్ఫూర్తి టోర్నీని మరింత రసవత్తరంగా మార్చుతోంది. ఒకపక్షంగా ముగుస్తాయని భావించిన మ్యాచ్‌లు చివరి ఓవర్ల వరకు ఉత్కంఠ రేపుతున్నాయి. విజయరేఖను దాటడంలో కొంత అనుభవలేమి అడ్డుపడుతున్నా, పెద్ద జట్లకు చెమటలు పట్టించడం మాత్రం ఆపడం లేదు.

టోర్నీ ఆరంభ మ్యాచ్‌ల్లోనే ఈ ధోరణి స్పష్టమైంది. నెదర్లాండ్స్‌పై పాకిస్థాన్ తీవ్ర ఒత్తిడిని ఎదుర్కొంది. స్కాట్లాండ్ వెస్టిండీస్‌ను గట్టిగా నిలువరించింది. అమెరికా భారత్‌ను కష్టాల్లోకి నెట్టగా, నేపాల్ ఇంగ్లాండ్‌ను చివరి ఓవర్ వరకు ఉక్కిరిబిక్కిరి చేసింది. అఫ్ఘానిస్థాన్ న్యూజిలాండ్, దక్షిణాఫ్రికా వంటి జట్లను గట్టిగా సవాలు చేసింది. ఐర్లాండ్ కూడా శ్రీలంకపై విజయానికి అతి చేరువగా వెళ్లింది. ఈ ప్రదర్శనలు ఒక విషయం స్పష్టం చేస్తున్నాయి——ఇప్పటి నుంచి చిన్న జట్లను తక్కువ అంచనా వేయడం ప్రమాదకరం. వారి ధైర్యం, పట్టుదల ప్రపంచకప్‌కు అసలైన కిక్‌ను ఇస్తోంది.




# లంక దూకుడు.. ఒమన్‌పై
# 105 పరుగుల భారీ విజయం

ముద్ర. స్పోర్ట్స్ డెస్క్

టీ20 ప్రపంచకప్‌లో శ్రీలంక మరో విజయాన్ని ఖాతాలో వేసుకుంది. గ్రూప్‌బీ మ్యాచ్‌లో ఒమన్‌ను 105 పరుగుల తేడాతో చిత్తు చేసి రెండో గెలుపు నమోదు చేసింది. ముందుగా బ్యాటింగ్ చేసిన లంక నిర్ణీత 20 ఓవర్లలో 5 వికెట్లు కోల్పోయి 225 పరుగుల భారీ స్కోరు సాధించింది. లక్ష్య ఛేదనకు దిగిన ఒమన్ 120 పరుగులకే పరిమితమై మ్యాచ్‌ను చేజార్చుకుంది.

లంక ఇన్నింగ్స్‌లో కుశాల్ మెండిస్ (61), దసున్ శనక (50), పవన్ రత్ననాయకే (60) అర్ధశతకాలతో జట్టుకు బలమైన పునాది వేశారు. అనంతరం బౌలింగ్‌లో దుష్మంత చమీర, మహీశ్ తీక్షణ చెరో రెండు వికెట్లు తీసి ఒమన్ బ్యాటింగ్‌ను కుదేలు చేశారు. ఒమన్ తరఫున నదీమ్ (53), వసీం అలీ (27) పోరాడినప్పటికీ మిగతా బ్యాటర్లు విఫలమవడంతో భారీ ఓటమి

సమగ్ర సమాచార పత్రిక
ముద్ర
13.02.2026 శుక్రవారం, హైదరాబాద్
www.mudranews.in | @mudranews








# “మేరే ప్యారీ ప్యారడైజ్ వాసియో” పోస్టర్ వైరల్

• ఆగస్టు 21కి ‘ది ప్యారడైజ్’ షిఫ్ట్

నాని ప్రధాన పాత్రలో తెరకెక్కుతున్న ‘ది ప్యారడైజ్’ విడుదల తేదీ మారింది. 2026 మార్చిలో ప్రేక్షకుల ముందుకు తీసుకురావాలని ముందుగా నిర్ణయించిన ఈ చిత్రాన్ని ఇప్పుడు ఆగస్టు 21న విడుదల చేయనున్నట్లు చిత్ర బృందం వెల్లడించింది. కొత్త రిలీజ్ డేట్‌ను ప్రకటిస్తూ విడుదల చేసిన పోస్టర్‌లో “మేరే ప్యారీ ప్యారడైజ్ వాసియో” అనే ట్యాగ్‌లైన్ ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. తాజా పోస్టర్‌లో నాని ఇంటెన్స్ గెటప్ సినిమాపై అంచనాలను పెంచుతోంది. డార్క్ షేడ్స్‌తో రూపొందించిన ఈ లుక్ కథలోని భావోద్వేగ, యాక్షన్ అంశాలను సూచిస్తోంది. విడుదల వాయిదా పడినా, ప్రమోషన్స్‌తో చిత్రంపై ఆసక్తిని నిలబెట్టే ప్రయత్నం కొనసాగుతోంది. ఆగస్టు 21న బాక్సాఫీస్ వద్ద ఈ సినిమా ఎలా నిలుస్తుందో చూడాలి.






# అప్పల సూరి సర్‌ప్రైజ్ లుక్

• పెద్ది లో జగపతి బాబు నయా అవతార్

టాలీవుడ్‌లో ఫ్యామిలీ హీరోగా గుర్తింపు తెచ్చుకున్న జగపతి బాబు, ఇప్పుడు క్యారెక్టర్ ఆర్టిస్ట్‌గా తనదైన ముద్ర వేస్తున్నారు. రామ్ చరణ్ ప్రధాన పాత్రలో రూపొందుతున్న ‘పెద్ది’ (Peddi Movie) కోసం ఆయన పూర్తిగా కొత్త రూపంలో కనిపించబోతున్నారు. ‘అప్పల సూరి’ అనే కీలక పాత్రకు తగినట్టుగా బరువు తగ్గి, వయసు పైబడిన వ్యక్తిలా కనిపించేలా ప్రత్యేక మేకోవర్ తీసుకున్నారు. జగపతి బాబు పుట్టినరోజు సందర్భంగా మేకర్స్ విడుదల చేసిన ఆయన లుక్ ప్రేక్షకులను ఆశ్చర్యపరిచింది. సహజత్వం ఉట్టిపడే ఆ రూపం సోషల్ మీడియాలో వేగంగా వైరల్ అవుతోంది. గతంలో ‘రంగస్థలం’లో రామ్ చరణ్‌తో కలిసి నటించిన ఆయన, మరోసారి ఈ చిత్రంలో భాగమవడం ఆసక్తిని పెంచుతోంది. ఈ సినిమా ఏప్రిల్ 30న ప్రేక్షకుల ముందుకు రానుంది.

## క్యారెక్టర్ ఆర్టిస్ట్‌గా సక్సెస్ ఫుల్ ఇన్నింగ్స్

హీరోగా ఒక దశను విజయవంతంగా పూర్తి చేసిన జగపతి బాబు, తరువాత విలన్, క్యారెక్టర్ పాత్రల వైపు మలుపు తిప్పుకున్నారు. విభిన్న పాత్రలను ఎంచుకుంటూ తన నటనలో కొత్త కోణాలను చూపిస్తున్నారు. గతంలో కూడా పాత్రల కోసం లుక్ మార్చుకున్న సందర్భాలు ఉన్నా, ‘పెద్ది’ కోసం తీసుకున్న ఈ మేకోవర్ ప్రత్యేకంగా నిలుస్తోంది. సినిమాలో ఆయన పాత్ర కథకు కీలకమని సమాచారం. విడుదలకు ముందే ఈ లుక్‌తో చిత్రంపై ఆసక్తి మరింత పెరిగింది.

# స్లీవ్‌లెస్ లుక్‌లో మీనాక్షి చౌదరి మెస్మరైజ్

సాంప్రదాయం-స్టైల్ కలయికలో మరోసారి మెరిసింది మీనాక్షి చౌదరి. తాజాగా ఎమరాల్డ్ గ్రీన్ చీరలో ఆమె అందం మరింత తళుక్కుమంది. గాఢమైన ఆకుపచ్చ రంగు చీర ఆమెకు రాయల్ లుక్‌ను తీసుకొచ్చింది. స్లీవ్‌లెస్ బ్లౌజ్‌పై చేసిన నాజూకైన ఎంబ్రాయిడరీ, స్వల్ప శిమ్మర్ డిజైన్ సంప్రదాయ దుస్తులకు ఆధునిక టచ్ ఇచ్చాయి. సింపుల్‌గా కనిపించినా స్టైలిష్‌గా మెరిసే ఈ కాంబినేషన్ ఆమె ఫ్యాషన్ సెన్స్‌ను మరోసారి నిరూపించింది. గోల్డ్ జుమ్కాలతో లుక్‌ను పూర్తి చేసింది. ఆభరణాలు ఎక్కువగా కాకుండా, సరైన మోతాదులో ఉండటం వల్ల ఆమె ఎలిగెన్స్ మరింత హైలైట్ అయింది. స్లీక్ ఓపెన్ హెయిర్ స్టైల్‌తో గ్రేస్, గ్లామర్ రెండింటినీ సమతూకంగా మేళవించింది. మొత్తానికి, సంప్రదాయ చీరలో మోడ్రన్ వైబ్ చూపిస్తూ మీనాక్షి మరోసారి అభిమానులను ఆకట్టుకుంది. ఈ లుక్ సోషల్ మీడియాలో ఫ్యాన్స్‌ను ఫిదా చేస్తోంది.

# 70వ ఫిల్మ్‌ఫేర్ సౌత్ అవార్డ్స్ లో టాలీవుడ్ జోరు

దక్షిణ భారత సినీ రంగంలో ప్రతిష్ఠాత్మకంగా భావించే ఫిల్మ్‌ఫేర్ సౌత్ అవార్డ్స్‌కు రంగం సిద్ధమైంది. 70వ అవార్డుల వేడుకను ఫిబ్రవరి 21న కేరళలో నిర్వహించనున్నట్లు నిర్వాహకులు వెల్లడించారు. ప్రతి ఏడాది లాగే ఈసారి కూడా స్టార్ నటీనటులు, దర్శకులు, సాంకేతిక నిపుణులు పెద్ద సంఖ్యలో హాజరుకానున్నారు. 2024లో విడుదలైన చిత్రాలకు సంబంధించిన విభాగాల్లో అవార్డులు అందజేయనున్నారు.

## ఉత్తమ చిత్రం విభాగం

ఈ ఏడాది ఉత్తమ చిత్రంగా పోటీలో నిలిచిన సినిమాలు: ‘35 చిన్న కథ కాదు’, ‘కమిటీ కుర్రోళ్లు’, ‘హనుమాన్’, ‘కల్కి 2898 ఏడీ’, ‘లక్కీ భాస్కర్’, ‘పుష్ప : ది రూల్’.

## ఉత్తమ దర్శకుడు

దర్శకుల విభాగంలో నాగ్ అశ్విన్ (కల్కి 2898 ఏడీ), నంద కిశోర్ (35 చిన్న కథ కాదు), ప్రశాంత్ వర్మ (హనుమాన్), సుకుమార్ (పుష్ప : ది రూల్), వెంకీ అట్లూరి (లక్కీ భాస్కర్), యదు వంశీ (కమిటీ కుర్రోళ్లు) పోటీలో ఉన్నారు.

## ఉత్తమ నటుడు

అల్లు అర్జున్ (పుష్ప : ది రూల్), దుల్కర్ సల్మాన్ (లక్కీ భాస్కర్), ఎన్టీఆర్ (దేవర), నాని (సరిపోదా శనివారం), సిద్ధూ జొన్నలగడ్డ (టిల్లు స్క్వేర్), తేజ సజ్జ (హనుమాన్) ఉత్తమ నటుడి కేటగిరీలో నామినేషన్లు పొందారు.

## ఉత్తమ నటి

అనుపమ పరమేశ్వరన్ (టిల్లు స్క్వేర్), ఆషికా రంగనాథ్ (నా సామిరంగ), మీనాక్షి చౌదరి (లక్కీ భాస్కర్), నివేదా థామస్ (35 చిన్న కథ కాదు), ప్రియాంక మోహన్ (సరిపోదా శనివారం), రష్మిక (పుష్ప : ది రూల్) ఉత్తమ నటి విభాగంలో పోటీ పడుతున్నారు.

## ఉత్తమ సహాయ నటుడు

అమితాబ్ బచ్చన్ (కల్కి 2898 ఏడీ), ధనంజయ్ (జీబ్రా), ఫహద్ ఫాజిల్ (పుష్ప : ది రూల్), సత్య (మత్తు వదలరా 2), ఎస్‌జే సూర్య (సరిపోదా శనివారం), వినయ్ రాయ్ (హనుమాన్) ఈ విభాగంలో ఎంపికయ్యారు.

## ఉత్తమ సహాయ నటి

అంజలి (గ్యాంగ్స్ ఆఫ్ గోదావరి), ఫరియా అబ్దుల్లా (మత్తు వదలరా 2), రషి సింగ్ నందు (ప్రసన్నవదనం), శరణ్య ప్రదీప్ (అంబాజీపేట మ్యారేజీ బ్యాండు), శ్రద్ధా శ్రీనాథ్ (మెకానిక్ రాకీ), వరలక్ష్మి శరత్‌కుమార్ (హనుమాన్) సహాయ నటి విభాగంలో పోటీలో ఉన్నారు.

ఈసారి అవార్డుల కోసం గట్టి పోటీ నెలకొనడంతో విజేతలపై సినీ వర్గాల్లో ఉత్కంఠ నెలకొంది.

# జగతి మేడం అందాలు చూడతరమా?

కన్నడ, తెలుగు చిత్ర పరిశ్రమలో తనదైన ముద్ర వేసిన నటి జ్యోతి పూర్వాజ్ (జ్యోతి రాయ్) ప్రస్తుతం కెరీర్ పరంగా బిజీగా ఉన్నారు. పంజాబీ మూలాలున్నప్పటికీ, దక్షిణాది బుల్లితెరపై ఆమె అగ్ర నటిగా ఎదిగారు. కన్నడలో 'కిన్నరి', 'జోగుల' వంటి సీరియల్స్ ద్వారా గుర్తింపు పొందిన జ్యోతి, తెలుగులో 'గుప్పెడంత మనసు' సీరియల్‌లో జగతి పాత్రతో ఇంటింటికీ పరిచయమయ్యారు. ప్రస్తుతం ఆమె తన రూటు మార్చి యాక్షన్ సినిమాల వైపు మొగ్గు చూపుతున్నారు. మల్టీలింగ్వల్ సూపర్ హీరో మూవీ 'మాస్టర్ పీస్' మరియు థ్రిల్లర్ మూవీ 'కిల్లర్' (డ్రీమ్ గర్ల్) వంటి విభిన్న చిత్రాల్లో నటిస్తున్నారు.







# అర్జున్–విశ్వక్ మధ్య వివాదం ముగిసినట్లేనా?

సీనియర్ నటుడు అర్జున్ సర్జా, యువ హీరో విశ్వక్‌సేన్ మధ్య ఓ సినిమా సందర్భంగా ఏర్పడిన భేదాభిప్రాయాలు అప్పట్లో చర్చనీయాంశమయ్యాయి. తాజాగా ఓ ఇంటర్వ్యూలో ఆ విషయంపై స్పందించిన అర్జున్, గతాన్ని వదిలేసి ముందుకు సాగాలనే అభిప్రాయం వ్యక్తం చేశారు. విశ్వక్ నటించిన ‘ఫంకీ’ సినిమా మంచి విజయం సాధించాలని ఆకాంక్షించారు. అర్జున్ వ్యాఖ్యలపై విశ్వక్‌సేన్ స్పందిస్తూ, ఆయన మాట్లాడిన తీరు తనకు నచ్చిందన్నారు. జీవితంలో కోపాలు శాశ్వతం కావని, సమయం మారితే భావోద్వేగాలు కూడా మారుతాయని పేర్కొన్నారు. అర్జున్ దర్శకత్వంలో రూపొందిన ‘సీతా పయనం’తో పాటు విడుదలకు సిద్ధమైన ‘కపుల్ ఫ్రెండ్లీ’ చిత్రాలు సైతం సక్సెస్ కావాలని ఆకాంక్షించారు.

## ఆగిపోయిన ప్రాజెక్ట్... కొత్త దారి

2022లో విశ్వక్ హీరోగా, అర్జున్ కుమార్తె ఐశ్వర్య హీరోయిన్‌గా ఓ చిత్రం ప్రారంభమైంది. కొన్ని రోజులకే ఇద్దరి మధ్య అభిప్రాయ భేదాలు తలెత్తడంతో ఆ ప్రాజెక్ట్ నిలిచిపోయింది. అనంతరం ఐశ్వర్య, నిరంజన్ ప్రధాన పాత్రల్లో ‘సీతాపయనం’ను అర్జున్ తెరకెక్కించారు. సినిమా ప్రమోషన్స్ సందర్భంగా అర్జున్ మాట్లాడుతూ, అనుకోని పరిణామాలు జరుగుతుంటాయని, వాటిని పెద్దగా పట్టించుకోకుండా ముందుకు సాగడం మంచిదన్నారు. తమ కాంబినేషన్ కుదరలేదని, అంతే తప్ప వ్యక్తిగతంగా ఎలాంటి విభేదాలు లేవని స్పష్టం చేశారు. విశ్వక్ ఇంట్లో భోజనం చేసిన రోజులను కూడా ఆయన గుర్తు చేశారు.

## రోజు తేడాతో రెండు సినిమాలు

ఒకే ప్రాజెక్ట్‌తో రావాల్సిన ఈ ఇద్దరు నటులు ఇప్పుడు వేర్వేరు చిత్రాలతో బాక్సాఫీస్‌ను పరీక్షించనున్నారు. అనుదీప్ కేవీ దర్శకత్వంలో రూపొందిన కామెడీ ఎంటర్‌టైనర్ ‘ఫంకీ’ ఈ నెల 13న విడుదల కానుండగా, ప్రేమ-కుటుంబ భావోద్వేగాల నేపథ్యంలో తెరకెక్కిన ‘సీతాపయనం’ 14న ప్రేక్షకుల ముందుకు రానుంది. ఇద్దరి సినిమాలు విజయాన్ని అందుకుంటాయా అన్న ఉత్కంఠ సినీ వర్గాల్లో కనిపిస్తోంది.

Printed and published by Executive Director Aliminati Indra Reddy, on behalf of M/s Networth Media Private Limited. Printed at Colour Dot Graphics, Ali cafe X Road, Amberpet, Hyderabad-500013. Published at H. No. 6-3-569/2, unit 4A Fourth Floor, Kamadhenu, Rockdale compound, Somajiguda, Hyderabad-500082. Editor: Y. Narender Reddy. RNI No: TELTEL/2013/50413. email: mudradaily@gmail.com